

తిరుక్కుఱళ్ నేర్చుకుందాం

Thirukkural Payilvom

(TELUGU)



काशी तमिल संगमम 5.0

“तिरुक्कुऱळ् पयिल्वोम् - तिरुक्कुरल अभ्यास करें”

Translator

Dr. S. Jayaprakash



केंद्रीय शास्त्रीय तमिळ् संस्थान, चेन्नै

2026

విషయసూచిక

అధ్యాయం 1. కాశీ - తమిళనాడు 4

అధ్యాయం 2. తిరువళ్లువర్ జీవిత చరిత్ర 8

అధ్యాయం 3. తిరుక్కుఱళ్ గ్రంథ స్వరూపం – విశిష్టత 11

అధ్యాయం 4. వ్యాఖ్యాతలు – ప్రచురణ చరిత్ర 14

అధ్యాయం 5. దివ్యవాణి వళ్లువం 15

- 5.1. తిరుక్కుఱళ్‌లో ప్రేమ మరియు ధర్మం 15
- 5.2. తిరుక్కుఱళ్‌లో ఆతిథ్యం 18
- 5.3. తిరుక్కుఱళ్‌లో భూతదయ (జీవకారుణ్యం) 20
- 5.4. తిరుక్కుఱళ్‌లో సన్యాస ధర్మం 22
- 5.5. తిరుక్కుఱళ్‌లో వ్యక్తిగత క్రమశిక్షణ 23
- 5.6. తిరుక్కుఱళ్‌లో ఆత్మవిశ్వాస ఆలోచనలు 25
- 5.7. తిరుక్కుఱళ్‌లో విద్య 27
- 5.8. తిరుక్కుఱళ్‌లో నాయకత్వ లక్షణాలు 29
- 5.9. తిరుక్కుఱళ్‌లో ఆరోగ్యం 30
- 5.10. తిరుక్కుఱళ్‌లో వైద్య ధర్మం 31
- 5.11. తిరుక్కుఱళ్‌లో మానసిక ఆరోగ్యాని 32
- 5.12. తిరుక్కుఱళ్‌లో మానవతా దృక్పథం 34
- 5.13. తిరుక్కుఱళ్‌లో సామాజిక సామరస్యం 35
- 5.14. తిరుక్కుఱళ్‌లో మైత్రి 36
- 5.15. తిరుక్కుఱళ్‌లో రాజనీతి 37
- 5.16. తిరుక్కుఱళ్‌లో పరిపాలనా దక్షత 38
- 5.17. తిరుక్కుఱళ్‌లో ఆర్థిక ఆలోచనలు 39
- 5.18. తిరుక్కుఱళ్‌లో వ్యవసాయం 40

5.19. తిరుక్కుఱళ్‌లో పర్యావరణం 41

5.20. తిరుక్కుఱళ్‌లో కుటుంబ ధర్మం 42

5.21. తిరుక్కుఱళ్‌లో మహిళలు 44

5.22. తిరుక్కుఱళ్‌లో నిర్వహణ (మేనేజ్‌మెంట్) 45

5.23. ప్రపంచ భాషల్లో తిరుక్కుఱళ్ 46

అధ్యాయం 6: కుఱళ్ మణిమాల 48

అధ్యాయం 1

కాశి – తమిళనాడు

కాశీ, తమిళనాడుల మధ్య సుదీర్ఘమైన, విస్తృతమైన చారిత్రక సంబంధం ఉంది. కాశీగా పిలువబడే వారణాసి గురించి ప్రాచీన తమిళ ప్రామాణిక (సంగం/క్లాసికల్) గ్రంథాలు వివరిస్తున్నాయి. కలిత్తొగై, శిలప్పదిగారం, మణిమేఖలై, నీలకేశి, చూళామణి, పెరుంగదై, విల్లిభారతం, తేవారం, పెరియపురాణం, నాలాయిర దివ్య ప్రబంధం, తిరుప్పుగళ్, శివభోగసారం, తిరువిళైయాడల్ పురాణం, కాంచీపురాణం, శివజ్ఞానబాలయ్య స్వామిగళ్ కలంబగం, తిరువరుట్పా, వీరపాండ్య కట్టబొమ్మన్ కథాగానం, భారతియార్ కవితలు, కవిమణి రచించిన 'మలరుమ్ మాలైయుమ్' మొదలైన గ్రంథాల్లో కాశీ ప్రస్తావనలు ఉన్నాయి. ఇవే కాక శిలాశాసనాలు, తామ్రశాసనాలలోనూ ఆధారాలు లభిస్తున్నాయి. కాశీక్కలంబగం, కాశీ తుండి వినాయగర్ పదిగం, కాశీకాండం, కాశీరహస్యం, కాశీయాత్ర, కాశీమహాత్మ్యం (సింహధ్వజుని కథ), కాశీ విశ్వనాథ శతకం, శ్రీకాశీ యాత్రా దీపం వంటి ప్రత్యేక గ్రంథాలు కాశీ నేపథ్యంలో రచించబడ్డాయి. వీటి ద్వారా కాశీకి, తమిళనాడుకు తరతరాలుగా కొనసాగిన అనుబంధాన్ని గ్రహించవచ్చు.

చారిత్రక బంధాలను పునఃసమీక్షించుకోవడం, విజ్ఞానదాయకములైన ఇరు సంప్రదాయాలను ఒకే వేదికపై అనుసంధానించడం, వాటి మధ్యగల పరస్పర సంబంధాన్ని పంచుకోవడం, చిరకాలంగా వర్ధిల్లుతున్న నాగరికతా-సాంస్కృతిక కొనసాగింపులను బహిర్గతం గావించడం. 'ఒకే భారతం – ఉన్నత భారతం' అనే భావనలో సాంస్కృతిక విశేషాలను తెలుపుతూ జాతీయ సమైక్యతను ధృడతరం గావించడం, మేధోసంబంధమైన ఆలోచన పరివర్తనలను ప్రోత్సహించడం, అఖిల భారత స్థాయిలో తమిళ భాషను, ప్రాచీన తమిళ సాహిత్యాన్ని పరిచయం చేయడం, యువతను భారతీయ సాంస్కృతిక వారసత్వంతో మమేకం చేయడం, సాంకేతికత సహకారంతో భారతీయ భాషల మధ్య భాషా సంబంధాలను సమన్వయం చేయడం వంటి పలు ఉన్నత లక్ష్యాలతో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ 'కాశీ తమిళ సంగమం'ను నిర్వహిస్తోంది.

కాశీ, తమిళనాడుల మధ్యగల అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఇప్పటివరకు నాలుగు కాశీ తమిళ సంగమాలు జరిగాయి. అవి: కాశీ-తమిళనాడుల సంబంధం, మేధోపరమైన-సాంస్కృతిక సంబంధాల బలోపేతం, భారతీయ జ్ఞాన సంప్రదాయంలో అగస్త్య మహర్షి పాత్ర, తమిళం నేర్చుకుందాం అనే ఇతివృత్తాలతో నిర్వహించబడ్డాయి. ఆ పరంపరలో ఈ సంవత్సరం వారణాసిలో, "తిరుక్కుఱళ్ నేర్చుకుందాం" అనే ఇతివృత్తంతో 28.11.2026 నుండి 12.12.2026 వరకు కాశీ తమిళ సంగమం 5.0 జరుగుతుంది.

కాశీ – తమిళనాడు: చారిత్రక వారధి

గంగా నదీ తీరంలోని కాశీ, వైగై-కావేరీ నదీ తీరాలలోని తమిళనాడు భారతదేశపు ప్రాచీన విజ్ఞాన కేంద్రాలు. శతాబ్దాలుగా వీటిని కలిపి ఉంచుతున్న కొన్ని ముఖ్యమైన బంధాలు:

- కుమారగురుపరర్ (17వ శతాబ్దం): ధర్మపుర అధీనానికి చెందిన ఈయన కాశీలో కుమారస్వామి మఠాన్ని స్థాపించి, కేదార్ ఘాట్‌లో కేదారేశ్వర ఆలయాన్ని నిర్మించారు. 'కాశీ కలంబగం' రచించిన ఈయన కాశీలోనే పరమపదించారు.
- మహాకవి భారతియార్: 1898 నుండి 1902 వరకు కాశీలోని హనుమాన్ ఘాట్‌లో నివసించారు. ఆయన నివసించిన గృహం 'భారతి ఇల్లం' పేరిట పునరుద్ధరించబడి, 2022 డిసెంబర్ 11న ప్రారంభించబడింది. "కాశీ నగర పండితుల ఉపన్యాసాలను కాంచీపురంలో వినేందుకు ఒక సాధనాన్ని తయారుచేద్దాం" అన్న ఆయన కవితా పంక్తులు ఉత్తర-దక్షిణ భారతావనిని అనుసంధానించే మహోన్నత స్వప్నం.
- తెన్‌కాశి, శివకాశి: 'దక్షిణ కాశీ' అనే పేర్లే ఈ అనుబంధాన్ని స్పష్టం చేస్తుంది. 15వ శతాబ్దపు పాండ్య రాజైన పరాక్రమ పాండ్యుడితో ఈ ఆలయాలకు సంబంధం ఉంది. తెన్‌కాశి పాండ్య రాజైన అతివీరరామ పాండ్యుడు 'కాశీ కాండం' గ్రంథాన్ని రచించారు.
- "నీరంతా గంగ, నేలంతా కాశీ": పాండ్యుల సంప్రదాయంలో వాడుకలో ఉన్న ఈ వాక్యాన్ని గౌరవనీయ ప్రధానమంత్రి 2023 సంగమం ప్రారంభోత్సవంలో ఉటంకించారు.
- కాశీ–రామేశ్వరం యాత్ర: రామేశ్వర దర్శనంతోనే కాశీయాత్ర సంపూర్ణమవుతుందనేది చిరకాల విశ్వాసం. తమిళుల వివాహ సంప్రదాయంలో నేటికీ 'కాశీ యాత్ర' ఒక ప్రముఖ ఆచారంగా కొనసాగుతోంది.
- విద్యా వారధి: బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో 'సుబ్రహ్మణ్య భారతి తమిళ పరిశోధనా పీఠం' ఏర్పాటు చేయనున్నట్లు గౌరవనీయ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు భారతియార్ 100వ వర్ధంతి సందర్భంగా (11.09.2021న) ప్రకటించారు.

కాశీ తమిళ సంగమం ప్రస్థానం:

కాశీ తమిళ సంగమం 1.0

- ‘కాశీ, తమిళనాడు సంబంధం’ అనే ప్రధాన ఇతివృత్తంతో కాశీ తమిళ సంగమం 1.0 ఉత్తర ప్రదేశ్, వారణాసిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 16.11.2022 నుండి 15.12.2022 వరకు నిర్వహించబడింది.

కాశీ తమిళ సంగమం 2.0

- "మేధోపరమైన మరియు సాంస్కృతిక సంబంధాల బలోపేతం" అనే ప్రధాన ఇతివృత్తంతో కాశీ తమిళ సంగమం 2.0 ఉత్తర ప్రదేశ్, వారణాసిలోని నమో ఘాట్‌లో 17.12.2023 నుండి 30.12.2023 వరకు నిర్వహించబడింది.

కాశీ తమిళ సంగమం 3.0

- "భారతీయ జ్ఞాన సంప్రదాయంలో అగస్త్య మహర్షి పాత్ర" అనే ప్రధాన ఇతివృత్తంతో కాశీ తమిళ సంగమం 3.0 ఉత్తర ప్రదేశ్, వారణాసిలోని నమో ఘాట్‌లో 15.02.2025 నుండి 24.02.2025 వరకు నిర్వహించబడింది.

కాశీ తమిళ సంగమం 4.0

- "తమిళం నేర్చుకుందాం" అనే ప్రధాన ఇతివృత్తంతో కాశీ తమిళ సంగమం 4.0 ఉత్తర ప్రదేశ్, వారణాసిలోని నమో ఘాట్‌లో 02.12.2025 నుండి 15.12.2025 వరకు నిర్వహించబడింది. కాశీ తమిళ సంగమం ముగింపు వేడుక తమిళనాడులోని రామేశ్వరంలో 30.12.2025న జరిగింది.

కాశీ తమిళ సంగమం 5.0

- "తిరుక్కుఱళ్ నేర్చుకుందాం" అనే ప్రధాన ఇతివృత్తంతో ఉత్తర ప్రదేశ్, వారణాసిలోని నమో ఘాట్‌లో 28.11.2026 నుండి 12.12.2026 వరకు జరుగుతోంది. భారతదేశం నలుమూలల ఉన్న 1,000 కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుండి కళాశాల/విశ్వవిద్యాలయానికి ఒకరి చొప్పున 1,000 మంది విద్యార్థులను ఎంపిక చేసి, వారి మాతృభాషలోనే తిరుక్కుఱళ్‌ను నేర్చుకునేలా చేసి, వారు తమ తమ కళాశాలలకు తిరిగి వెళ్లి దానిని ప్రచారం చేస్తారు.

తిరుక్కుఱళ్ ఏ ఒక్క మతాన్నో, రాజునో, దేశాన్నో పేరుపెట్టి ప్రస్తావించలేదు. అందుకే అందరూ దీనిని తమ స్వంత గ్రంథంగా భావించి కొనియాడుతున్నారు. కేంద్ర శాస్త్రీయ తమిళ పరిశోధనా సంస్థ (CICT) ఈ గ్రంథాన్ని 35 భాషలలోనికి అనువదించి ప్రచురించడమే కాకుండా, రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లోని 22 భాషల్లోనూ తన బహుభాషా యాప్ ద్వారా అందిస్తోంది. దీనివల్ల కాశ్మీర్‌లోని ఒక విద్యార్థి, కన్యాకుమారిలోని ఒక విద్యార్థి ఒకే రోజున ఒకే కుఱళ్‌ను తమ తమ భాషల్లో నేర్చుకోగలుగుతారు.

అధ్యాయం 2

తిరువళ్లువర్ జీవిత చరిత్ర

తిరువళ్లువర్ గురించి మనకు నిస్సందేహంగా తెలిసిన ఏకైక సత్యం ఆయన అందించిన 1,330 కుఱళ్ పద్యాలు మాత్రమే. ఆయన జననం, కుటుంబం, వృత్తి గురించిన వివరాలు చాలావరకు తరువాతి కాలపు సంప్రదాయ కథనాలే. అయినప్పటికీ, ఆ గ్రంథమే దాని రచయితను అత్యంత స్పష్టంగా ప్రతిబింబిస్తోంది.

పేరు మరియు విశిష్ట నామాలు:

'వళ్లువన్' అనే పేరుకు 'తిరు' అనే గౌరవార్థక పదం చేరి 'తిరువళ్లువర్' అయింది. సాంప్రదాయం ఆయనకు అనేక విశిష్ట నామాలను ఇచ్చింది: నాయనార్, దేవర్, దైవప్పులవర్ (దైవిక కవి), ముదర్పాలవర్ (ఆది కవి), నాన్ముగనార్ (చతుర్ముఖుడు), మాదానుపంగి(మాతృసమానుడు), సెన్నాప్పోదార్(మధుర వాగ్విలాసి), పెరునావలర్(మహాపండితుడు), పొయ్యిల్ పులవర్ (అసత్యం పలకని కవి). మొదలైన పేర్లు తమిళ సమాజం ఆయనపై చూపిస్తోన్న అపారమైన గౌరవాన్ని తెలియజేస్తున్నాయి.

కాలం: విద్వాంసుల అభిప్రాయాలు:

తిరుక్కుఱళ్ రచనా కాలాన్ని క్రీ.పూ. 300 నుండి క్రీ.శ. 5వ శతాబ్దం వరకు రకరకాలుగా అంచనా వేశారు. చెక్ విద్వాంసుడు కమిల్ జ్వెలెబిల్ దీనిని క్రీ.శ. 450–500 మధ్యకాలమని పేర్కొన్నారు. బ్రిటానికా విజ్ఞాన సర్వస్వం 6వ శతాబ్దమని, మరికొందరు క్రీ.పూ. 1వ శతాబ్దమని భావిస్తున్నారని పేర్కొంది. తమిళ సంప్రదాయం వళ్లువర్ కాలాన్ని క్రీ.పూ. 31గా పరిగణిస్తున్నది. మైలైమలై అడిగళ్ ప్రతిపాదించిన ఈ లెక్క ఆధారంగా తమిళనాడు ప్రభుత్వం 1971లో ప్రభుత్వ గెజిట్‌లో 'తిరువళ్లువర్ సంవత్సరం' విధానాన్ని ప్రచురించింది; అది 1972 నుండి అమలులోకి వచ్చింది. తిరువళ్లువర్ సంవత్సరం = ప్రస్తుత సంవత్సరం (CE) + 31; తై మాసం 2026 నుండి తిరువళ్లువర్ సంవత్సరం 2057 అవుతుంది.

సంప్రదాయ కథనాలు:

అర్వాచీన కాలం నాటి విడి కవితలు, మౌఖిక సంప్రదాయాలు కొన్ని కథలను అందిస్తున్నాయి. వీటికి చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, ప్రజల హృదయాల్లో వళ్లువర్ ఏ రూపంలో నిలిచారో ఇవి స్పష్టం చేస్తాయి:

- ఆయన చెన్నైలోని మైలాపూర్‌లో జన్మించారని ఒక విస్తృతమైన విశ్వాసం ఉంది. అక్కడ ఆయనకు ఒక ప్రత్యేక ఆలయం కూడా ఉంది.

- ఆయన చేనేత వృత్తిని చేపట్టారని, ఆయన భార్య పేరు వాసుకి అని సంప్రదాయం చెబుతుంది. భర్త పిలవగానే చేదబావిలో నీళ్లు తోడుతున్న తాడును అలాగే వదిలేసి వాసుకి పరుగున వచ్చిందనే కథ గృహస్థ ధర్మంలోని ప్రేమానురాగాలకు నిదర్శనంగా చెబుతారు.
- మదురై తమిళ సంగంలో ఈ గ్రంథాన్ని ఆవిష్కరించినప్పుడు 'సంగ పలకం' కేవలం కుఱళ్‌కు మాత్రమే చోటిచ్చిందనే కథ కూడా ప్రచారంలో ఉంది.
- ఈ గ్రంథాన్ని కొనియాడుతూ రచించబడిన 55 వెణ్బా పద్యాల సంకలనమే 'తిరువళ్లువమాలై'. అందులో ఇడైక్కాడర్ "ఆవగింజను తొలిచి ఏడు సముద్రాలను అందులో చొప్పించినట్లు" అన్నారు. ఔవ్వైయార్(అవ్వైయార్) "పరమాణువును తొలచి ఏడు సముద్రాలను సంగ్రహంగా తీర్చిదిద్దిన గ్రంథం కుఱళ్" అని దానిని మరింత లోతుగా ప్రశంసించారు.

గ్రంథంలో కనిపించే కవి:

వళ్లువర్ ధర్మం, రాజనీతి, అర్థశాస్త్రం, యుద్ధరీతులు, వైద్యం, ప్రణయం వంటి సమస్త జీవన రంగాలను ఔపోసన పట్టిన ద్రష్ట. మనిషిని పుట్టుకతో కాకుండా కర్మల ద్వారానే ఆయన అంచనా వేశారు. అందుకే జైనులు, బౌద్ధులు, శైవులు, వైష్ణవులు వంటి అనేక సంప్రదాయాలకు చెందిన ప్రజలు వళ్లువర్‌ను తమవాడిగా భావిస్తారు. ఈ సార్వజనీనతే ఆయన విశాల దృక్పథానికి నిదర్శనం. ప్రాచీన విద్వాంసులు ఆయనను సమస్త భారతదేశ సామాన్య ధర్మ సంప్రదాయపు మహా స్వరంగా దర్శిస్తారు.

స్మారక చిహ్నాలు:

- **తిరువళ్లువర్ దినోత్సవం:** పొంగల్ పండుగ సమయాన 'తై' మాసపు(పుష్య-మాఘ మాసాలు) 2వ తేదీన జరుపుకుంటారు.
- **వళ్లువర్ కోట్టం, చెన్నై:** 1976 ఏప్రిల్‌లో భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారు. దీని రూపశిల్పి వి. గణపతి స్థపతి. ఇక్కడ 1,330 కుఱళ్ పద్యాలు శిలలమీద చెక్కబడ్డాయి. పునరుద్ధరించబడి 2025 జూన్ 21న తిరిగి ప్రారంభించబడింది.
- **తిరువళ్లువర్ విగ్రహం:** కన్యాకుమారిలో 133 అడుగుల ఎత్తైన తిరువళ్లువర్ విగ్రహం ప్రతిష్ఠించబడింది (133 అధ్యాయాలకు ప్రతీకగా ఒక్కో అధ్యాయానికి ఒక్కో అడుగు). 38 అడుగుల పీఠం ధర్మవిభాగం (అరత్తుప్పాల్) లోని 38 అధ్యాయాలను, 95 అడుగుల విగ్రహం అర్థ, కామ విభాగాల (పొరుట్పాల్,

కామత్తుప్పాల్) లోని 95 అధ్యాయాలను సూచిస్తాయి. 01.01.2000న ఆవిష్కరించబడిన ఈ విగ్రహం 2004 నాటి సునామీని సైతం తట్టుకుని నిలిచింది. రజతోత్సవ సందర్భంగా 2024 డిసెంబర్ 30న వివేకానంద రాక్‌ను కలిపే 77 మీటర్ల గాజు వంతెన (గ్లాస్ బ్రిడ్జ్) ప్రారంభించబడింది; ఈ విగ్రహాన్ని 'జ్ఞాన ప్రతిమ' (స్టాట్యూ ఆఫ్ విజ్డమ్) అని కూడా పిలుస్తారు.

అధ్యాయం 3

తిరుక్కుఱళ్ గ్రంథ స్వరూపం – విశిష్టత

తిరుక్కుఱళ్ 1,330 కుఱళ్ పద్యాలను కలిగి ఉంది. అవి పదేసి చొప్పున 133 అధ్యాయాలుగా ధర్మ-అర్థ-కామ (అఱమ్-పొరుళ్-ఇన్బమ్) అనే మూడు విభాగాలుగా విభజించబడ్డాయి. అన్ని కుఱళ్ పద్యాలు కేవలం రెండు పాదాలతో, ఏడు గణాలతో(సీర్లు) నిర్మితమైన 'కుఱళ్ వెణ్బా' ఛందస్సులో సాగుతాయి.

ముప్పాల్ (త్రివర్గ) నిర్మాణం:

మొత్తం: 133 అధ్యాయాలు, 1,330 కుఱళ్ పద్యాలు *(పరిమేలళగర్ వ్యాఖ్యానం ఆధారంగా విభజన)*		
అరత్తుప్పాల్ (ధర్మ విభాగం)	**పొరుట్పాల్ (అర్థ విభాగం)**	**కామత్తుప్పాల్ (కామ విభాగం)**
38 అధ్యాయాలు (1-38) 380 కుఱళ్ పద్యాలు	**70 అధ్యాయాలు(39-108) 700 కుఱళ్ పద్యాలు**	**25 అధ్యాయాలు (109-133) 250 కుఱళ్ పద్యాలు**
సంస్కృతి – 4 గార్హస్థం – 20 యతి ధర్మం – 13 విధి – 1	**రాజధర్మం – 25 పరిజనం – 32 ప్రకీర్ణక – 13**	**రహస్య ప్రణయం – 7 శీలం – 18**

ధర్మ విభాగం (అరత్తుప్పాల్) – 38 అధ్యాయాలు:

ధర్మ విభాగం వ్యక్తిగత అంతరంగ జీవనాన్ని, కుటుంబ జీవనాన్ని వివరిస్తుంది.

- **సంస్తుతి (పీఠికా విభాగం: 1–4):** దైవ ప్రార్థన, వాన ప్రాశస్త్యం, సన్యాసుల గొప్పతనం, ధర్మ ప్రాశస్త్యం. దైవ ప్రార్థన తరువాత వర్షానికి ప్రత్యేక అధ్యాయాన్ని ఇవ్వడం, జీవకోటి మనుగడకు ప్రకృతియే మూలమనే వళ్లువర్ దృక్పథాన్ని చాటుతుంది.

- **గార్హస్థం (5–24):** గృహస్థ జీవనం, జీవిత భాగస్వామి సద్గుణాలు, సంతాన ప్రాప్తి మొదలుకొని ప్రేమ, ఆతిథ్యం, ప్రియవచనం, కృతజ్ఞత, నిష్పాక్షికత, ఓర్పు, పరోపకారం, దానం, కీర్తి వరకు. గృహస్థ ధర్మాన్ని సన్యాసంతో సమానంగా, కొన్ని సందర్భాల్లో ఉన్నతంగా వళ్లువర్ గౌరవించారు.

- **యతిధర్మ పరిచ్ఛేదం(25–37):** భూతదయ, మాంసాహార విసర్జన, సత్యం, క్రోధ రాహిత్యం, అహింస, జీవహింస చేయకుండుట, అనిత్యత, సన్యాసం, తత్త్వబోధ/సత్య దర్శనం, కోరికలను త్యజించుట. ప్రపంచ పండితులను ఎంతగానో ఆకట్టుకున్న అహింసా సంబంధిత కుఱళ్ పద్యాలు ఈ విభాగంలోనే ఉన్నాయి.

- **విధి (38):** మానవ ప్రయత్నాలకు అతీతంగా ఉండే కర్మ ఫలితం గురించిన ఏకైక అధ్యాయం.

అర్థ విభాగం (పొరుట్పాల్) - 70 అధ్యాయాలు:

ఇది గ్రంథంలో సగానికి పైగా విస్తరించిన విభాగం; రాజనీతి, పరిపాలన, ఆర్థిక వ్యవస్థ, స్నేహం, సమాజం తదితర అంశాలను చర్చిస్తుంది.

- **రాజధర్మ పరిచ్ఛేదం(అరసియల్ : 39–63):** రాజార్హత, విద్య, వినికిడి (సత్సంగం), వివేకం మొదలుకొని న్యాయపాలన, వేగుల వ్యవస్థ, పురుష ప్రయత్నం, ఆపదల యందు స్థైర్యం వరకు. పాలకుని వ్యక్తిగత సద్గుణాలు, న్యాయమైన పాలనే ఇక్కడ కీలకం.

- **పరిజన పరిచ్ఛేదం (అంగవియల్ : 64–95):** మంత్రివర్గం, వాక్చాతుర్యం, కార్యాచరణ దక్షత, రాయబారం, దేశం, కోట, ధనార్జన విధానం, సైన్యం, మిత్రత్వం, శత్రుత్వం, ఔషధం/వైద్యం. రాజ్యంలోని సప్తాంగాలను ఒక్కొక్కటిగా విశ్లేషిస్తుంది.

- **ప్రకీర్ణక పరిచ్ఛేదం (ఒళిబియల్ : 96–108):** ఉన్నత వంశం, ఆత్మగౌరవం, మానం, సజ్జనత్వం, సద్గుణ సంపద, వ్యవసాయం, దారిద్ర్యం, యాచన, దుర్జనత్వం. పౌరుల గుణగణాలు ఈ పరిచ్ఛేదంలో చర్చించబడ్డాయి.

కామ విభాగం (కామత్తుప్పాల్) – 25 అధ్యాయాలు:

సంగ కాలంనాటి 'అగం' సాహిత్య సంప్రదాయంలో రూపుదిద్దుకున్న ప్రణయ కావ్యం ఇది. నాయకుడు, నాయిక, చెలికత్తె సంభాషణల రూపంలోనే ఈ కుఱళ్ పద్యాలు సాగుతాయి. "ఫలానా వారి పేరును నిర్దేశించి ప్రస్తావించరాదు" అనే తొల్కాప్పియ నియమావళి ప్రకారం ఇందులో ఎవరి పేరూ ప్రస్తావించబడలేదు; అందుకే ఈ ప్రణయభావం సర్వమానవాళికీ వర్తిస్తుంది.

- **రహస్య ప్రణయ పరిచ్ఛేదం (కళవియల్: 109–115):** సౌందర్యారాధన మొదలుకొని వదంతుల వరకు వివాహాత్పూర్వ ప్రణయాన్ని వివరిస్తుంది.

- **శీల పరిచ్ఛేదం (కఱ్పియల్ 116–133):** విరహ వేదన నుండి ప్రణయ కలహం వరకు భార్యాభర్తల ఎడబాటు, తపన, అలకలు, కలయికలను చర్చిస్తుంది.

ధర్మం లేని సంపద, సంపద లేని గార్హస్థం, ప్రేమ లేని ఆనందం వళ్లువర్ దృష్టిలో సంపూర్ణమైనవి కావు. మానవ జీవితానికి సంబంధించిన చతుర్విధ పురుషార్థాలుగా ధర్మం, అర్థం, కామం, మోక్షాలను వళ్లువం పేర్కొంటుంది. వళ్లువర్ మొదటి మూడింటిని విస్తృతంగా చర్చించి, మోక్షాన్ని యతిధర్మంలోనూ, నిజతత్వంలోనూ అంతర్భాగం చేశారు. ఈ సార్వజనీన చట్రమే భారతదేశంలోని ఏ ప్రాంతపు పాఠకుడికైనా తిరుక్కుఱళ్‌ను సులభంగా చేరువ చేస్తుంది.

కుఱళ్ వెణ్బా ఛందస్సు:

- **పాదాలు: ప్రతి పద్యంలోనూ** రెండు పాదాలు ఉంటాయి. మొదటి పాదంలో నాలుగు గణాలు(సీర్లు), రెండవ పాదంలో మూడు గణాలు(సీర్లు); మొత్తం ఏడు గణాలు(సీర్లు).

- **గణాలు/యతి-ప్రాసలు:** వెండెళై. చివరి గణం(సీర్) 'నాళ్', 'మలర్', 'కాసు', 'పిఱప్పు' అనే ఛందో నియమాలలో ఏదో ఒకదానితో ముగుస్తుంది.

- **గణ విభజన (సీర్ పిరిప్పు) - మొదటి కుఱళ్:**

  అగర | ముదల | ఎళుత్తెల్లామ్ | ఆది

  బగవన్ | ముదట్రే | ఉలగు.

ఈ సంక్షిప్తతే కుఱళ్ యొక్క బలం. ఔవ్వైయార్ దీనిని "పరమాణువును తొలిచి ఏడు సముద్రాలను చొప్పించినట్లు" అని పేర్కొన్నారు. సులభంగా గుర్తుంచుకోవడానికి, అనువదించడానికి, నేటి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడానికి కుఱళ్ అత్యంత అనువైన రూపం.

తిరుక్కుఱళ్ విశిష్ట నామాలు:

త్రివర్గం(ముప్పాల్), ఉత్తరవేదం, దైవనూల్(దైవ గ్రంథం), పొయ్యామొళి (అసత్యం కాని వాణి), వాయుఱై వాళ్‌త్తు(ఔషదంతో సమానమైన హితవు), పొదుమఱై (సార్వజనీన వేదం) మొదలైనవి తిరుక్కుఱళ్ విశిష్ట నామాలు. 'పొదుమఱై' (విశ్వవేదం) అనే పేరు రావడానికి దీనిలోని అంతస్సారమే కారణం. ఫ్రెంచ్ అనువాదకుడు ఎ. యస్. ఏరియల్ పేర్కొన్నట్లుగా, వళ్లువర్ "కులం, జాతి, మతం వంటి వేటితోనూ నిమిత్తం లేకుండా సమస్త మానవాళి కోసం" తన గళాన్ని వినిపించారు.

అధ్యాయం 4

వ్యాఖ్యాతలు - ప్రచురణ చరిత్ర

తిరుక్కుఱళ్‌కు 10వ శతాబ్దం నుండి 13వ శతాబ్దం వరకు ధర్మర్, మణక్కుడవర్, దామత్తర్, నచ్చర్, పరిదియార్, పరిమేలళగర్, తిరుమలైయర్, మల్లర్, పరిప్పెరుమాళ్, కాళింగర్ అనే పదిమంది ప్రాచీన వ్యాఖ్యాతలు వ్యాఖ్యానాలు రచించారు. వీరిలో మణక్కుడవర్, పరిదియార్, కాళింగర్, పరిప్పెరుమాళ్, పరిమేలళగర్ వ్యాఖ్యానాలు సంపూర్ణంగా లభిస్తుండగా; ధర్మర్, దామత్తర్, నచ్చర్ వ్యాఖ్యానాలు పాక్షికంగా లభిస్తున్నాయి. తిరుమలైయర్, మల్లర్ వ్యాఖ్యానాలు ప్రస్తుతం అలభ్యాలు. తిరుక్కుఱళ్‌ను ఎన్నో శతాబ్దాలుగా కాపాడి నేటి తరానికి అందించిన ఘనత ఈ వ్యాఖ్యాన సంప్రదాయానికే చెందుతుంది.

ఆధునిక వ్యాఖ్యానాలు:

19–20 శతాబ్దాలలో కవిరాజ పండితుడు, ఉ.వె. స్వామినాథయ్యర్, కె. వడివేలు చెట్టియార్, అయోద్దిదాసర్, వా.వు. చిదంబరనార్, తిరు.వి.కల్యాణసుందరనార్, నామక్కల్ కవిజ్ఞర్, భారతీదాసన్ మొదలైనవాళ్లు తిరుక్కుఱళ్‌కు విశేష వ్యాఖ్యానాలు సమకూర్చారు. సులభ శైలితో కూడిన సరళ వ్యాఖ్యాన పరంపర 1949లో డాక్టర్ ము. వరదరాజన్ రాసిన 'తిరుక్కుఱళ్ తెలివురై'తో ప్రారంభమైంది. నేటి కాలంలోనూ తిరుక్కుఱళ్కు వ్యాఖ్యానాలు నిరంతరం వెలువడుతూనే ఉన్నాయి.

తాళపత్రాల నుండి అచ్చు యంత్రానికి:

శతాబ్దాల తరబడి తిరుక్కుఱళ్ తాళపత్ర గ్రంథాల రూపంలోనే భద్రపరచబడింది. 1812లో తంజావూరు జ్ఞానప్రకాశర్ 'నాలడియార్', 'తిరువళ్లువమాలై'లతో కలిపి తిరుక్కుఱళ్ మొదటి ముద్రిత ప్రతిని వెలువరించారు. నాటి నుండి నేటి వరకు వందలాది ముద్రణలు వెలువడ్డాయి.

డిజిటల్ యుగం:

నేడు తిరుక్కుఱళ్ సమగ్ర గ్రంథం బహుభాషా మొబైల్ యాప్‌లు, ఆడియో బుక్స్ రూపాలలో నూతన పరిమాణాలను సంతరించుకుని ఇంటర్నెట్ మరియు స్మార్ట్‌ఫోన్‌లలో అందుబాటులో ఉంది.

అధ్యాయం 5

దివ్యవాణి వళ్లువం

ఈ అధ్యాయం, తిరుక్కుఱళ్‌లోని 108 అధికారాల ప్రధాన ఇతివృత్తాలను పరిచయం చేస్తూ ఒకటి నుండి ఇరవై మూడు శీర్షికలుగా రూపొందించబడింది.

5.1. తిరుక్కుఱళ్‌లో ప్రేమ మరియు ధర్మం

విశ్వవేదంగా కొనియాడబడే తిరుక్కుఱళ్ మానవ జీవితపు మౌలిక విలువలను అత్యంత సంక్షిప్తంగా, లోతుగా విశదీకరించే జీవన సాహిత్యం. మనిషి ఎలా జీవించాలో మాత్రమే కాకుండా, ఎటువంటి మానసిక పరిపక్వతతో జీవించాలో కూడా తిరువళ్లువర్ వివరిస్తారు. ఆ జీవన తాత్వికత కేంద్రంలో ప్రేమ మరియు ధర్మం కొలువై ఉన్నాయి. ప్రేమ ధర్మానికి ప్రాణంగా, ధర్మం ప్రేమ యొక్క కార్యాచరణ రూపంగా తిరుక్కుఱళ్‌లో ప్రస్ఫుటిస్తాయి.

ప్రేమ – మానవ జీవితానికి పునాది:

తిరువళ్లువర్ ప్రేమను కేవలం ఒక భావోద్వేగంగా పరిగణించలేదు; మనిషిని స్వార్థం నుండి పరమార్థం వైపు, లోకహితం వైపు నడిపించే ప్రాథమిక సద్గుణంగా దర్శించారు.

> *அன்பிலார் எல்லாம் தமக்குரியர் அன்புடையார்*
> *என்பும் உரியர் பிறர்க்கு. (குறள் 72)*
>
> అన్బిలార్ ఎల్లాం తమక్కురియర్; అన్బుడైయార్
> ఎన్బుం ఉరియర్ పిఱర్కు.
>
> ప్రేమలేనివారు ప్రతివస్తువూ తమకే కావాలని, దాన్ని స్వంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ప్రేమగలవారు తమ శరీరం, వస్తువులు, ప్రాణం అన్నీ పరోపకారార్థమే అని భావిస్తారు. (కుఱళ్ 72)

ప్రేమ లేని మనిషి తన చుట్టూ మాత్రమే జీవితాన్ని అల్లుకుంటాడు; ప్రేమ ఉన్నవాడు తన సర్వస్వాన్నీ ఇతరుల కోసం త్యాగం చేసే మానసిక ఔన్నత్యాన్ని పొందుతాడు. ఈ విధంగా 'నేను' అనే సంకుచిత భావనను 'మనం' అనే విశాల దృక్పథంగా మార్చేది ప్రేమే. అది కుటుంబంలో అనురాగంగా, సమాజంలో దయగా, అంతర్జాతీయ స్థాయిలో మానవతా దృక్పథంగా విస్తరిస్తుంది.

> *அன்பின் வழியது உயிர்நிலை அஃதிலார்க்கு*
> *என்புதோல் போர்த்த உடம்பு. (குறள் 80)*
>
> అన్బిన్ వళియదు ఉయిర్‌నిలై; అద్దిలార్కు
> ఎన్బుతోల్ పోర్త ఉడమ్బు.
>
> ప్రేమ నిండిన హృదయమనే బాటలో ప్రయాణం చేసినపుడే అది ప్రాణమున్న శరీరమవుతుంది. లేనపుడు ఎముకల గూడుపై చర్మమనే తిత్తిని కప్పినట్లుంటుంది. (కుఱళ్ 80)

శరీరంలో ప్రాణం ఉండటం మాత్రమే జీవితం కాదు; తోటి ప్రాణుల సుఖదుఃఖాలను అర్థం చేసుకోగల హృదయం ఉన్నప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుంది. కాబట్టి, తిరువళ్లువర్ దృష్టిలో ప్రేమ అనేది మానవుని ఒకానొక గుణం మాత్రమే కాదు; మానవ మనుగడకు జీవనాడి.

ప్రేమ మరియు ధర్మం:

ప్రేమకు, ధర్మానికి మధ్యగల విడదీయరాని అనుబంధాన్ని ఈ క్రింది కుఱళ్ స్పష్టం చేస్తుంది:

அன்பும் அறனும் உடைத்தாயின் இல்வாழ்க்கை
பண்பும் பயனும் அது. (குறள் 45)

అన్బుం అఱనుం ఉడైత్తాయిన్ ఇల్ వాళ్క్కై
పణ్బుం పయనుం అదు.

గృహస్థ జీవితాన్ని సాగించేవారు ప్రేమైక హృదయులుగా ధర్మమార్గంలో పయనించేవారుగా ఉండాలి. అదే జీవితానికి సాఫల్యాన్ని ఇస్తుంది. (కుఱళ్ 45)

గృహస్థ జీవితపు ఔన్నత్యం సిరిసంపదల్లోనో, అధికారంలోనో లేదు; ప్రేమ, ధర్మాలతో నిండిన జీవితంలోనే ఉంది. ఇక్కడ ప్రేమ అంతరంగపు గుణంగా, ధర్మం దాని బాహ్య ఆచరణ రూపంగా నిలుస్తాయి.

ప్రేమ కలవాడు ఇతరులకు హాని తలపెట్టడు. ఎదుటివారి కష్టాన్ని తన కష్టంగా భావించే వ్యక్తిలో నుండి దానగుణం, ఆతిథ్యం, అపకారం చేయకుండుట, అహింస, భూతదయ వంటి ధర్మాలు సహజంగానే జనిస్తాయి. కాబట్టి, తిరుక్కుఱళ్ బోధించే ధర్మం ఏదో ఒత్తిడి వల్ల బలవంతంగా ఆచరించే కట్టుబాటు కాదు; ప్రేమ నుండి సహజసిద్ధంగా ఉద్భవించే జీవన మార్గం. దీనిని,

அறத்திற்கே அன்புசார்பு என்ப அறியார்
மறத்திற்கும் அஃதே துணை. (குறள் 76)

అఱత్తిఱ్కే అన్బుచ్చార్బు ఎన్ప అఱియార్
మఱత్తిఱ్కుం అద్దే తుణై.

తెలియనివారు ధర్మకార్యాలకు మాత్రమే ప్రేమ తోడుగా ఉంటుందని చెబుతారు. పరిశీలించి చూసినట్లయితే వీరోచిత కార్యాలకు కూడ అదే తోడుగా ఉంటుంది. (కుఱళ్ 76)

అని వళ్లువర్ మరింత లోతుగా విశ్లేషిస్తారు. ప్రేమ కేవలం మార్దవానికి చిహ్నం మాత్రమే కాదు; కర్తవ్యాన్ని నిర్వహించడానికి, ఇతరుల కోసం త్యాగం చేయడానికి, న్యాయం వైపు ధైర్యంగా నిలబడటానికి ప్రేరేపించే అంతర్గత శక్తిగా కూడా నిలుస్తుంది.

ధర్మం – మనోనైర్మల్యం నుండే ప్రారంభం:

తిరువళ్లువర్ ధర్మ భావన కేవలం బాహ్య చేష్టలపై ఆధారపడినది కాదు; అది అంతరంగానికి సంబంధించినది.

ధర్మానికి పునాది మానవ మనస్సే. అందుకే,

மனத்துக்கண் மாசிலன் ஆதல் அனைத்தறன்
ஆகுல நீர பிற. (குறள் 34)

మనత్తుక్కణ్ మాసిలన్ ఆదల్ అనైత్తఱన్
ఆగుల నీర పిఱ.

మనసు పరిశుద్ధంగా ఉండడమే ధర్మం. మిగిలినవన్నీ ఆడంబరాలేకానీ వేరొకటి కాదు. (కుఱళ్ 34)

అని మనస్సు నిర్మలంగా ఉండటమే ధర్మానికి మూలమని వళ్లువర్ చెబుతారు. ఒక కార్యం పైకి మంచిదిగా కనిపించినప్పటికీ, దాని వెనుక కపటం, అసూయ, దురాశ లేదా కీర్తికాంక్ష ఉంటే ఆ కార్యపు ధార్మిక విలువ క్షీణిస్తుంది. అందువల్ల, ధర్మం అనేది మనిషి 'ఏం చేస్తున్నాడు?' అనే దానిలోనే కాకుండా, 'ఎందుకు చేస్తున్నాడు?' అనే సదుద్దేశంలోనూ ఇమిడి ఉంది.

ధర్మం యొక్క శ్రేష్ఠత్వాన్ని,

அறத்தினூஉங்கு ஆக்கமும் இல்லை அதனை
மறத்தலின் ஊங்கில்லை கேடு. (குறள் 32)

అఱత్తినూఉంగు ఆక్కముం ఇల్లై; అదనై
మఱత్తిలిన్ ఊంగిల్లై కేడు.

సకల శుభాలనూ అందించగల ధర్మాన్ని పోలినది జీవితంలో వేరొకటి లేదు. అటువంటి ధర్మాన్ని విస్మరించినట్లయితే దానికి మించిన హాని వేరొకటి లేదు. (కుఱళ్ 32)

అని తిరువళ్లువర్ చాటిచెప్పారు. సంపదలు, అధికారాలు శాశ్వతమైనవి కావు; కానీ ధర్మం ద్వారా లభించే మానవ విలువ కలకాలం నిలిచివుంటుంది. వళ్లువర్ ధర్మాన్ని మానవ జీవితపు అత్యున్నత సంపదగా దర్శించడానికి కారణం ఇదే.

ప్రేమ నుండి దయ (కారుణ్యం) వైపు:

తిరుక్కుఱళ్ పేర్కొనే ప్రేమ కుటుంబంతో, బంధువులతో మాత్రమే ఆగిపోదు. అది ఇతర మానవులను దాటి సమస్త జీవకోటిని ఆలింగనం చేసుకున్నప్పుడు భూతదయ(అరుళ్) అనే ఉన్నతమైన స్థితిని చేరుకుంటుంది.

அருட்செல்வம் செல்வத்துள் செல்வம் பொருட்செல்வம்
பூரியார் கண்ணும் உள. (குறள் 241)

అరుట్చెల్వం సెల్వత్తుళ్ సెల్వం; పొరుట్ చెల్వం
పూరియార్ కణ్ణుం ఉళ.

క్రూరాత్ములైన దుర్మార్గుల దగ్గర కూడ అశేషమైన సంపద ఉంది. కాని ఆ సంపద దయా సంపదకు సమానం కాదు. (కుఱళ్ 241)

భౌతిక సంపద కన్నా ఇతర ప్రాణుల వేదనను అర్థం చేసుకునే కారుణ్య సంపదే మిన్న అయినది. ఈ రీతిగా తిరుక్కుఱళ్ ప్రేమ భావన: వ్యక్తిగత ప్రేమ- కుటుంబ ప్రేమ- సామాజిక ప్రేమ- భూతదయ (జీవకారుణ్యం)గా విస్తరిస్తుంది. అందుకే,

தன்னுயிர்க்கு இன்னாமை தானறிவான் என்கொலோ
மன்னுயிர்க்கு இன்னா செயல். (குறள் 318)

తన్నుయిర్కు ఇన్నామై తానఱివాన్ ఎన్కోలో
మన్నుయిర్కు ఇన్నా సెయల్?

తనకు దుఃఖ కారణములు ఇవీ అని తెలిసిననాడు మిగిలిన ప్రాణులకు ఆ కష్టాలను కలిగించడం ఎందుకో? (కుఱళ్ 318)

అని వళ్లువర్ సూటిగా ప్రశ్నిస్తారు. తనకు నొప్పి అంటే ఏమిటో తెలిసినవాడు తోటి ప్రాణులకు ఆ బాధను ఎలా కలిగించగలడు అనే ఈ ప్రశ్నలో ధర్మపు లోతైన మూలాలు వ్యక్తమవుతాయి. తనను ఇతరుల స్థానంలో ఉంచి చూసుకోగల మనసే నిజమైన ధర్మానికి నాంది.

నేటి ప్రపంచానికి సందేశం:

విజ్ఞాన, సాంకేతిక, ఆర్థిక రంగాలలో మానవ సమాజం ఎంతగానో పురోగమించినప్పటికీ... ద్వేషం, హింస, స్వార్థం, వివక్ష వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో తిరుక్కుఱళ్ చాటిన ప్రేమ మరియు ధర్మాలు ప్రాచీన భావాలుగా మిగిలిపోకుండా, నేటి ప్రపంచానికి అత్యంత ఆవశ్యకమైన మానవీయ సూత్రాలుగా భాసిస్తున్నాయి. జ్ఞానం మానవునికి శక్తిని ఇస్తుంది; ఆ శక్తిని సన్మార్గానికి ఉపయోగించడానికి ధర్మం మార్గదర్శనం చేస్తుంది. సాంకేతికత మనుషులను అనుసంధానిస్తుంది; కానీ ప్రేమే వారి హృదయాలను ఏకం చేస్తుంది. చట్టం తప్పును నిరోధిస్తుంది; ధర్మం తప్పు చేయని ఉన్నతమైన మనస్సును నిర్మిస్తుంది.

తిరుక్కుఱళ్‌లో ప్రేమ, ధర్మం వేర్వేరు సిద్ధాంతాలు కావు. ప్రేమ ధర్మానికి మూలమైతే, ధర్మం ప్రేమ యొక్క మధుర ఫలం. ప్రేమ మనిషిని స్వార్థం నుండి విముక్తుడిని చేస్తుంది; ధర్మం అతడిని లోకకల్యాణం వైపు నడిపిస్తుంది. ప్రేమ కారుణ్యంగా మారినప్పుడు మనిషి సమస్త ప్రాణులను తనతో సమానంగా చూస్తాడు.

కాబట్టి, తిరువళ్లువర్ చూపిన ధర్మ జీవనం భయంతో పాటించే కట్టుబాటు కాదు; ప్రేమ నుండి సహజంగా వికసించే మహోన్నత జీవన విధానం. ప్రేమ మనిషిని మానవుడిగా మారుస్తుంది; ధర్మం ఆ మనిషిని ఉత్తముడిగా తీర్చిదిద్దుతుంది. ఇవి రెండూ సంగమించే చోటే వ్యక్తిగత శాంతి, కుటుంబ సౌఖ్యం, సామాజిక సామరస్యం, విశ్వ మానవతా వికాసం పరిమళిస్తాయి.

5.2. తిరుక్కుఱళ్‌లో ఆతిథ్యం

తమిళ సంస్కృతి విశిష్ట చిహ్నాలలో 'ఆతిథ్యం' (అతిథి సత్కారం) అగ్రగణ్యమైనది. అపరిచితులైనప్పటికీ ఇంటికి వచ్చిన వారిని చిరునవ్వుతో ఆహ్వానించి, భోజనం పెట్టి, ప్రేమానురాగాలతో ఆదరించడం ప్రాచీన తమిళ జీవన సంప్రదాయం. తిరువళ్లువర్ దీనిని కేవలం ఒక సామాజిక ఆచారంగా మాత్రమే చూడకుండా, గృహస్థ జీవితానికి మూలమైన ధర్మంగా

ఉన్నతీకరించారు. తిరుక్కుఱళ్‌లో ఆతిథ్యానికే ఒక ప్రత్యేక అధ్యాయాన్ని (అధికారాన్ని) కేటాయించి, అతిథి సత్కారం గొప్పదనాన్ని చాటి చెప్పారు.

గృహస్థ జీవన పరమార్థం - ఆతిథ్యం:

இருந்தோம்பி இல்வாழ்வது எல்லாம் விருந்தோம்பி
வேளாண்மை செய்தற் பொருட்டு. (குறள் 81)

ఇరున్దోమ్బి ఇల్ వాళ్‌వదు ఎల్లాం విరున్దోమ్బి
వేళాణ్‌మై సెయ్‌దఱ్ పొరుట్టు.

గృహస్థ ధర్మాలను తు.చ. తప్పకుండా పాటించడం ఎందుకంటె అతిథులను ఆహ్వానించి ఆదరించడం కోసమే. (కుఱళ్ 81)

ఒక వ్యక్తి ధనార్జన చేసి, దానిని పోషించుకుంటూ కుటుంబ జీవితాన్ని నడపడం కేవలం తాను, తన కుటుంబం మాత్రమే బతకడానికి కాదని; ఇతరులకు ఉపయోగపడటానికేనని వళ్లువర్ స్పష్టం చేశారు. ఇక్కడ ఆతిథ్యం అనేది కేవలం ఆహారం పెట్టడం మాత్రమే కాదు, తనకున్న దానిని ఇతరులతో పంచుకుని జీవించే సామాజిక ధర్మంగా నిలుస్తుంది.
అతిథి బయట వేచి ఉన్నప్పుడు అమృతమే అయినప్పటికీ తాను మాత్రమే భుజించడం సముచితం కాదు అనే విషయాన్ని

விருந்து புறத்ததாத் தானுண்டல் சாவா
மருந்தெனினும் வேண்டற்பாற்று அன்று. (குறள் 82)

విరున్దు పుఱత్తదా త్తానుణ్డల్ సావా
మరున్దెనినుం వేణ్డాఱ్ పాట్రు అన్ఱు.

వచ్చిన అతిథులను ఇంటి బయటే కూర్చోబెట్టి చావని మందైన అమృతమైనప్పటికీ దానిని తాను మాత్రమే తినడం ఉచితం కాదు. (కుఱళ్ 82)

అనే కుఱళ్ ద్వారా వల్లువర్ వివరిస్తున్నారు.
తాము సంపాదించిన దానిని తమ కోసం మాత్రమే దాచుకోవడం సంపద యొక్క నిజమైన ప్రయోజనం కాదనేదే దీని అంతరార్థం.

ఆహారం కంటే విలువైంది చిరునవ్వుతో కూడిన ఆదరణ:

అతిథి సత్కారంలో ఆహారం మాత్రమే ముఖ్యం కాదు; దానిని అందించే మనస్తత్వం, ముఖంలో వెల్లివిరిసే సంతోషం కూడా ఎంతో ముఖ్యం.

மோப்பக் குழையும் அனிச்சம் முகம்திரிந்து
நோக்கக் குழையும் விருந்து. (குறள் 90)

మోప్ప క్కుళైయుం అనిచ్చం, ముగమ్ తిరిన్దు
నోక్క క్కుళైయుం విరున్దు.

`అనిచ్చం' అనే పుష్పాన్ని వాసన చూసిన వెంటనే అది వాడిపోతుంది. అదే విధంగా ముఖాన్ని చిట్లించుకొని ఆహ్వానిస్తే అతిథుల మొహం వాడిపోతుంది. (కుఱళ్ 90)

వాసన చూసినంతనే వాడిపోయే అనిచ్చ పుష్పంలాగే, మన ముఖం మారినా లేదా విసుగు ప్రదర్శించినా అతిథి మనసు కూడా వాడిపోతుందని వళ్లువర్ చెబుతున్నారు. మనం అందించే వస్తువుల పరిమాణం కంటే, "మీరు మాకు ఆప్తులు" అనే భావనను అతిథికి కలిగించడమే నిజమైన ఆతిథ్యమని ఆయన సున్నితంగా స్పష్టం చేస్తున్నారు.

సామాజిక సంబంధాలకు పునాది:

అతిథి సత్కారం మనుషుల మధ్య దూరాన్ని తగ్గిస్తుంది. కొత్తవారిని బంధువులుగా మారుస్తుంది; వ్యక్తిని సమాజంతో అనుసంధానిస్తుంది. అందుకే అతిథి సత్కారాన్ని కేవలం వ్యక్తిగత సద్గుణంగా మాత్రమే కాకుండా, సామాజిక సమగ్రతను పెంపొందించే గొప్ప సంస్కారంగా కూడా చూడవచ్చు.గృహస్థ జీవితంలో అతిథి సత్కారమే అత్యుత్తమ కర్తవ్యంగా పరిగణించబడిందనే విషయాన్ని:

பெறுமவற்றுள் யாமறிவது இல்லை அறிவறிந்த
மக்கட்பேறு அல்ல பிற. (குறள் 61)

పెఱుమవట్రుళ్ యామఱివదు ఇల్లై అఱివఱిన్ద
మక్కట్పేఱు అల్ల పిఱ.

బుద్ధిమంతులైన సంతానానికి మించిన సంపద గృహస్థ జీవితంలో వేరొకటి లేదు.(కుఱళ్ 61)

అనే కుఱళ్ వివరిస్తుంది.

నేటి పట్టణీకరణ చెందిన, వ్యక్తికేంద్రీకృత జీవనశైలిలోనూ ఈ ఆలోచన ఎంతో అనువైనది. అతిథి సత్కారం యొక్క ఆధునిక రూపం కేవలం భోజనం పెట్టడంలో మాత్రమే లేదు; ఇతరులను గౌరవించడం, కొత్తవారిని సాదరంగా ఆహ్వానించడం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడంలోనూ ఉంది.

తిరుక్కుఱళ్‌లో ఆతిథ్యం అనేది కేవలం ఆహారాన్ని అందించే ప్రక్రియ కాదు; అది హృదయాన్ని పంచుకునే ధర్మం. సంపద గొప్పతనం దానిని కూడబెట్టుకోవడంలో లేదు; పంచుకోవడంలో ఉంది. ఇంటి ఔన్నత్యం అక్కడి భౌతిక వసతుల్లో లేదు; అక్కడికి వచ్చేవారికి లభించే ఆప్యాయతలో ఉంది. కాబట్టి, అతిథి సత్కారం ద్వారా తిరువళ్ళువర్ "తన కోసమే జీవించడం కంటే ఇతరుల కోసం జీవించడమే ఉత్కృష్టమైన గృహస్థ ధర్మం" అనే మానవతావాద దృక్పథాన్ని స్థాపిస్తున్నారు.

5.3. తిరుక్కుఱళ్‌లో జీవకారుణ్యం (సర్వజీవ ప్రేమ)

కేవలం మానవుడిని మాత్రమే కేంద్రంగా చేసుకోకుండా, సృష్టిలోని సమస్త జీవులను గౌరవించి జీవించాలనే విశాలమైన ధర్మ భావన తిరుక్కుఱళ్‌లో కనిపిస్తుంది. అరుళ్‌ఉడైమై (దయ కలిగి ఉండటం), పులాల్ మఱుత్తల్ (మాంసాహారాన్ని

నిరాకరించడం), కొల్లామై (జీవహింస చేయకపోవడం), ఇన్నా సెయ్యామై (కీడు చేయకపోవడం) వంటి అధ్యాయాల ద్వారా జీవుల జీవించే హక్కును వళ్లువర్ నొక్కి చెబుతున్నారు.

పరజీవులను తన ప్రాణంతో సమానంగా చూడటం:

தன்னூன் பெருக்கற்குத் தான்பிறிது ஊன்உண்பான்
எங்ஙனம் ஆளும் அருள். (குறள் 251)

తన్నూన్ పెరుక్కఱ్కు త్తాన్పిఱిదు ఊన్ఉణ్బాన్
ఎంగనం ఆళుం అరుళ్?

తమ శరీరంలోని కండలు పెంచుకోవడం కోసం వేరొక ప్రాణి శరీరాన్ని ఆహారంగా స్వీకరించేవారు ఏ విధంగా దయా స్వభావులవుతారు? (కుఱళ్ 251)

తన శరీరాన్ని పోషించుకోవడానికి మరో ప్రాణిని చంపి మాంసం తినేవాడు దయాహృదయుడు ఎలా కాగలడని వళ్లువర్ ప్రశ్నించారు. మన ప్రాణంలాగే ఇతర ప్రాణుల జీవనాన్ని గౌరవిస్తున్నామా? అని ఆహారపు అలవాట్లను మించిన ప్రాథమిక ధార్మిక ప్రశ్నను ఆయన లేవనెత్తారు.

அருளல்லது யாதெனின் கொல்லாமை கோறல்
பொருளல்லது அவ்வூன் தினல். (குறள் 254)

అరుళల్లదు యాదెనిన్ కొల్లామై కోఱల్
పొరుళల్లదు అవ్వూన్ తినల్.

చంపక పోవడం దయాగుణం. చంపడం దయారహితగుణం. కాబట్టి మాంసాహారాన్ని తీసుకోవడం ధర్మంకాదు. (కుఱళ్ 254)

జీవహింస చేయకపోవడాన్నే కరుణకు ప్రాతిపదికగా వళ్లువర్ స్థాపించారు.

భూతదయ పరాకాష్ఠ:

ఇతర ప్రాణులకు హాని తలపెట్టకుండా జీవించేవాడే ఉత్తముడైన మానవుడనే సత్యాన్ని:

கொல்லான் புலாலை மறுத்தானைக் கைகூப்பி
எல்லா உயிரு தொழும். (குறள் 260)

కొల్లాన్ పులాలై మఱుత్తానై క్కైకూప్పి
ఎల్లా ఉయిరుం తొళుం.

మాంసం తినని వాళ్లను, మాంసం కోసం ప్రాణులను చంపని వాళ్లను సకల జీవరాశులు నమస్కరించి ఆశీర్వదిస్తాయి. (కుఱళ్ 260)

అని ఈ కుఱళ్ ప్రబోధిస్తుంది. ప్రాణుల పట్ల కేవలం జాలిపడితే సరిపోదని:

உண்ணாமை வேண்டும் புலாஅல் பிறிதொன்றன்
புண்அது உணர்வார்ப் பெறின். (குறள் 257)

ఉణ్ణామై వేణ్డుం పులా అల్ పిఱిదొన్రన్
పుణ్అదు ఉణర్వార్ పెఱిన్.

మాంస భక్షణం ఎవరూ చేయకుండా ఉండాలి. పరిశీలించి చూసినట్లయితే మాంసం అనేది ఒక ప్రాణి శరీరంలోని పుండు అనేది గ్రహించవచ్చు. (కుఱళ్ 257)

అని స్పష్టం చేస్తూ, తోటి జీవి వేదనను అంతరంగంతో గ్రహించడమే నిజమైన జీవకారుణ్యమని చాటారు. ఎవరికీ బాధ కలిగించని జీవన విధానాన్ని ఎంచుకోవాలన్నదే ఈ అధ్యాయం అందించే నిగూఢ సందేశం.

నేటి కాలంలో వన్యప్రాణి సంరక్షణ, జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి భావనలతో ఈ ఆలోచనలను అనుసంధానించి చూడవచ్చు. మానవుడు ప్రకృతిని శాసించే యజమాని కాదు; అందులోని జీవశృంఖలలో ఒక భాగం మాత్రమే అనే సత్యాన్ని గ్రహించడానికి వళ్లువర్ భూతదయ మార్గం సుగమం చేస్తుంది.

తిరుక్కుఱళ్‌లో జీవకారుణ్యం అనేది తోటి మనుషులపై చూపే ప్రేమ యొక్క కొనసాగింపే. తన ప్రాణాన్ని కాపాడుకున్నట్లే సమస్త ప్రాణికోటిని కాపాడాలన్నదే కుఱళ్ బోధించే నియతి. మనిషి ఔన్నత్యం అతని బాహుబలంలో లేదు; తనకంటే బలహీనమైన జీవుల పట్ల చూపే అపార కరుణలోనే ఉంది. ఈ రీతిగా తిరుక్కుఱళ్ సమస్త జీవులను తనలో ఇముడ్చుకున్న సార్వజనీన ధర్మాన్ని ప్రతిపాదించింది.

5.4. తిరుక్కుఱళ్‌లో సన్యాస ధర్మం

తిరుక్కుఱళ్‌లోని 'అరత్తుప్పాల్' (ధర్మ విభాగం)లో గృహస్థ ధర్మం తరువాత సన్యాస ధర్మ సంబంధిత నియమాలు ప్రస్తావించబడ్డాయి. సన్యాసం అంటే కేవలం భౌతిక ప్రపంచం నుండి శారీరకంగా దూరమవ్వడం మాత్రమే కాదు; కామక్రోధాలు, అనుబంధాలు, అహంకారం వంటి అంతర్గత శత్రువులను జయించి మనోనిగ్రహాన్ని సాధించడమనే లోతైన తాత్త్వికార్థాన్ని తిరుక్కుఱళ్‌లోని పలు అధ్యాయాలు వెల్లడిస్తాయి. వ్యాఖ్యాన సంప్రదాయంలో ధర్మ కాండంలోని అధ్యాయాలను ఇల్లఱవియల్ (గృహస్థ విభాగం), తుఱవఱవియల్ (సన్యాస విభాగం)లుగా వర్గీకరించారు.

వ్యామోహాన్ని (మమకారాన్ని) వీడటం :

మానవుడి అనేక దుఃఖాలకు మితిమీరిన వ్యామోహమే మూలకారణం. సంపద, కీర్తి, అధికారం అనేవి జీవితానికి సాధనాలుగా మాత్రమే ఉండాలి తప్ప, మనిషిని శాసించే శక్తులుగా మారకూడదు. వీటిని తన జీవితంలో ఆచరించడానికి దైవానుగ్రహం ఎంతో ఆవశ్యకం; ఆ అనుగ్రహాన్ని పొందడానికి ఇతర ప్రాపంచిక బంధాలను విడిచిపెట్టి, భగవంతుని పాదపద్మాలను ఆశ్రయించాలి.

பற்றுக பற்றற்றான் பற்றினை அப்பற்றைப்
பற்றுக பற்று விடற்கு. (குறள் 350)

పట్రుగ పట్రట్రాన్ పట్రినై; అప్పట్రై
ప్పట్రుగ పట్రు విడఱ్కు.

బంధాలకు అతీతుడైన భగవంతునిపై మాత్రమే భక్తి శ్రద్ధలు కలిగి ఉండాలి. బంధాలను తెంచుకోవడానికి అతనిపై పెట్టుకొన్న భక్తియే సహాయం చేస్తుంది. (కుఱళ్ 350)

నిజమైన సన్యాసం వేషభాషల్లో, బాహ్య రూపంలో లేదు; అంతరంగంలో ఉంది. కోరికలను అణచుకోకుండా బాహ్యంగా సన్యాసిగా కనిపించడం వల్ల ఎటువంటి ప్రయోజనమూ లేదు. అందువల్ల తిరువళ్లువర్ ప్రబోధించిన సన్యాస ధర్మం అంతశ్చేతనను అదుపులో ఉంచుకునే ఆంతరంగిక సాధన.

సన్యాసం మరియు కరుణ (అరుళ్):

తిరుక్కుఱళ్‌లోని సన్యాస భావన మనిషిని సమాజం నుండి వేరుచేయదు. బదులుగా కరుణ, తపస్సు, సత్యసంధత, క్రోధరాహిత్యం, అపకారం చేయకుండా ఉండటం, అహింస వంటి సుగుణాల ద్వారా అతడిని మరింత బాధ్యతాయుతమైన వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది.

తన కోరికలను జయించినవాడు ఇతరుల హక్కులను లాక్కోడు; కోపాన్ని జయించినవాడు ఎదుటివారిని హింసించడు; అహంకారాన్ని జయించినవాడు ఇతర ప్రాణులను హీనంగా చూడడు. కాబట్టి సన్యాసం అంటే లోకాన్ని ద్వేషించడం కాదు; తనలోని అనంతమైన తృష్ణను (దురాశను) జయించడం.

వినియోగ సంస్కృతి, పోటీ, ధనదాహం పెచ్చుమీరిన నేటి జీవన విధానంలో తిరుక్కుఱళ్‌లోని సన్యాస చింతన సరికొత్త అర్థాన్ని సంతరించుకుంది. అవసరానికి, అత్యాశకు గల తేడాను గుర్తించడం, మితంగా జీవించడం, మనోనిగ్రహం, నిరాడంబరత అనేవి ఆధునిక జీవితానికి కూడా ఎంతో అత్యావశ్యకమైనవి.

తిరుక్కుఱళ్ చూపిన సన్యాసం లోకాన్ని వదిలి పారిపోవడం కాదు; లోకంలో జీవిస్తూనే అంతరంగాన్ని జయించడం. భౌతిక సంపదను త్యజించడం కంటే వ్యామోహాన్ని త్యజించడం, ఇతరులను ఓడించడం కంటే తనను తాను గెలవడమే ఉత్కృష్టమైన సన్యాసం. ఈ రీతిగా సన్యాస ధర్మాన్ని మానవుని అంతఃశుద్ధికి, మానసిక విముక్తికి మార్గం చూపే జీవన విధానంగా తిరువళ్లువర్ విశదీకరించారు.

5.5. తిరుక్కుఱళ్‌లో వ్యక్తిగత క్రమశిక్షణ

ఒక ఉత్తమ సమాజానికి పునాది సత్ప్రవర్తన గల మనుషులే. కేవలం చట్టాల ద్వారా మాత్రమే సమాజాన్ని తీర్చిదిద్దలేము; ప్రతి వ్యక్తిలోనూ ఆత్మనిగ్రహం, నిజాయితీ, బాధ్యతాయుత ప్రవర్తన, వినయం వంటి సుగుణాలు పాదుకోవాలి. తిరుక్కుఱళ్ దీనిని 'వ్యక్తిగత క్రమశిక్షణ' అనే విశాల జీవన దృక్పథంతో ప్రబోధిస్తుంది.

సదాచారమే సర్వోన్నతం:

మనిషికి ఉన్నతిని చేకూర్చేది అతని సంపదో, హోదానో కాదు; అతని సదాచారమే. అందుకే ప్రాణం కంటే మిన్నగా క్రమశిక్షణను కాపాడుకోవాలనే సత్యాన్ని:

ஒழுக்கம் விழுப்பம் தரலான் ஒழுக்கம்
உயிரினும் ஓம்பப் படும். (குறள் 131)

ఒళుక్కం విళుప్పం తరలాన్ ఒళుక్కం
ఉయిరినుం ఓమ్బ ప్పడుం.

సత్ప్రవర్తన పదిమందిలో గౌరవాన్ని కలిగిస్తుంది. అందువలన సత్ప్రవర్తన ప్రాణంకన్న మిన్నగా ప్రశంసింపబడుతుంది. (కుఱళ్ 131)

అని వళ్లువర్ తెలియజేశారు. విజ్ఞానం, నైపుణ్యం ఒకరిని ఉన్నత స్థాయికి చేర్చవచ్చు; కానీ ఆ ఎదుగుదలకు విలువను చేకూర్చేది సత్ప్రవర్తనే. జ్ఞానం ఉన్నవాడికి శీలము లేకపోతే, అతని జ్ఞానమే సమాజానికి చేటుగా మారే ప్రమాదముంది.

ఆత్మనిగ్రహం – క్రమశిక్షణకు రక్షాకవచం:

వ్యక్తిగత క్రమశిక్షణకు మూలస్తంభంగా ఆత్మనిగ్రహాన్ని వళ్లువర్ ప్రతిపాదించారు. ఆలోచనలను, మాటలను, చేతలను అదుపులో ఉంచుకునే సామర్థ్యమే నిగ్రహం. భావోద్వేగాలకు తక్షణమే బానిస కాకుండా, వాటి పర్యవసానాలను ఆలోచించి నడుచుకోవడమే పరిపక్వ మనస్సుకు నిదర్శనమనే భావాన్ని:

அடக்கம் அமரருள் உய்க்கும் அடங்காமை
ஆரிருள் உய்த்து விடும். (குறள் 121)

అడక్కం అమరరుళ్ ఉయక్కుం; అడంగామై
ఆరిరుళ్ ఉయత్తు విడుం.

వినయం కలిగినవాడు అక్షీణమైన కీర్తిని పొంది, దైవసమానుడుగా భావింపబడుతాడు. వినయం లేనివాడు చీకటిని పోలిన బాధామయ జీవితం గడుపుతాడు. (కుఱళ్ 121)

అనే కుఱళ్ స్పష్టం చేస్తుంది. అలాగే ఒకరి వాక్కులు కూడా వారి వ్యక్తిత్వానికి గీటురాయిగా నిలుస్తాయి.

தீயினால் சுட்டபுண் உள்ளாறும் ஆறாதே
நாவினால் சுட்ட வடு. (குறள் 129)

తీయినాల్ సుట్టపుణ్ ఉళ్లాఱుం ఆఱాదే
నావినాల్ సుట్ట వడు.

అగ్ని సోకినందువలన ఏర్పడిన పుండు మచ్చగా బయట ఉన్నప్పటికీ లోపల మానిపోయి ఉంటుంది. అయితే ద్వేషంతో పలికిన మాటలవలన కలిగే గాయం ఎన్నటికీ ఆరదు. (కుఱళ్ 129)

శరీరానికి తగిలిన గాయం మానిపోవచ్చు; కానీ మాటల ద్వారా మనసుకు తగిలిన గాయం చిరకాలం నిలిచిపోతుందనే నిజాన్ని ఈ కుఱళ్ చాటిచెబుతోంది. కాబట్టి వ్యక్తిగత క్రమశిక్షణ అనేది కేవలం పనులను నియంత్రించడం మాత్రమే కాదు; ఆలోచన, వాక్కు, భావోద్వేగాలన్నింటినీ సంస్కరించుకోవడం.

వ్యక్తి నుండి సమాజం వైపు:

ఒకరు క్రమశిక్షణతో జీవించడం వల్ల కలిగే ప్రయోజనం కేవలం వారికే పరిమితం కాదు. నిజాయితీపరులైన వ్యక్తుల ద్వారా ఉత్తమ కుటుంబాలు ఏర్పడతాయి; ఉత్తమ కుటుంబాలు మంచి సమాజాన్ని నిర్మిస్తాయి; మంచి సమాజమే బాధ్యతాయుతమైన దేశాన్ని తీర్చిదిద్దుతుంది. కాబట్టి సామాజిక మార్పుకు ఆరంభం వ్యక్తి నుంచే మొదలవుతుంది.
నేటి ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియా యుగంలో వ్యక్తిగత క్రమశిక్షణ పరిధి మరింత విస్తరించింది. ముఖాముఖిగా చెప్పడానికి జంకే మాటలను అంతర్జాలంలో రాయకుండా ఉండటం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా ఉండటం, ఇతరుల వ్యక్తిగత గోప్యతను గౌరవించడం వంటివి కూడా ఆధునిక క్రమశిక్షణ రూపాలుగా పరిగణించవచ్చు. తిరుక్కుఱళ్‌లో వ్యక్తిగత క్రమశిక్షణ అనేది బయటి నుంచి విధించే ఆంక్ష కాదు; తనను తాను సరిదిద్దుకునే అంతర్గత నియంత్రణ. ఆత్మనిగ్రహం, మృదుభాషణం, నిజాయితీ, ఓర్పు, వినయం వంటి సుగుణాలు మానవుని నిజమైన విలువను నిర్ధారిస్తాయి. మనిషి లోకాన్ని మార్చడానికి ముందు తనను తాను సంస్కరించుకోవాలన్నదే వళ్లువర్ భావన. వ్యక్తిగత క్రమశిక్షణే సామాజిక శ్రేయస్సుకు మొదటి విత్తనం కాబట్టి తిరుక్కుఱళ్‌లోని ఈ ఆలోచన సర్వకాలాలకూ అనువర్తిస్తుంది.

5.6. తిరుక్కుఱళ్‌లో ఆత్మవిశ్వాస ఆలోచనలు

'ఆత్మవిశ్వాసం' అనే పదాన్ని తిరువళ్లువర్ నేరుగా ఉపయోగించక పోయినప్పటికీ, ఉత్సాహం (ఊక్కమ్), మనోస్థైర్యం (మనత్తిణ్మై), పురుష ప్రయత్నం (ముయర్చ్చి), కార్యదక్షత (వినైత్తిట్పమ్), ఆపదల్లో ధైర్యం (ఇడుక్కణ్ అళియామై) వంటి అధికారాలలో ఆత్మవిశ్వాసానికి సంబంధించిన ఎన్నో ఆలోచనలు చోటుచేసుకున్నాయి. మనిషి ఉన్నత స్థానానికి ఎదగడం లేదా దిగజారడం అనేది చాలావరకు అతని మనోబలం మరియు ప్రయత్నాలపైనే ఆధారపడి ఉంటుందన్నదే వళ్లువర్ దృక్పథం. కాబట్టి ఒకరి అంతరంగ ఔన్నత్యం మేరకే అతని ఎదుగుదల ఉంటుందనే విషయాన్ని:

வெள்ளத் தனைய மலர்நீட்டம் மாந்தர்தம்
உள்ளத் தனையது உயர்வு. (குறள் 595)

వెళ్లత్తనైయ మలర్ నీట్టం మాన్దర్ తం
ఉళ్లత్తనైయదు ఉయర్వు.

నీటిలో పూసిన తామర తూడు పొడవు ఎంతో నీటిలోతు అంత. అదే విధంగా వ్యక్తి జీవితంలోని ఔన్నత్యం ఎంతో అతని మనసులోని ఆసక్తి అంత. (కుఱళ్ 595)

అని ఈ కుఱళ్లో నమోదు చేశారు. నీటి లోతును బట్టి తామర పువ్వు పైకి ఎదిగినట్లే, మనిషి ఎదుగుదల అతని అంతరంగ ఉన్నతిపై ఆధారపడి ఉంటుంది. ఉన్నతమైన ఆశయం, విశ్వాసమే మానవ ప్రగతికి నాంది అని ఈ కుఱళ్ తెలియజేస్తుంది.

మనోస్థైర్యం, విజయం:

జీవితంలో లక్ష్యాన్ని సాధించడానికి కేవలం గమ్యాన్ని నిర్దేశించుకుంటే సరిపోదు; దానిని చేరుకోవడానికి తగిన మనోధైర్యం కూడా ఉండాలి. ఆలోచన మరియు కార్యాచరణ ఏకమైన చోటే విజయం రూపుదిద్దుకుంటుంది. దీనిని స్పష్టం చేస్తూ వళ్లువర్:

எண்ணிய எண்ணியாங்கு எய்துப எண்ணியார்
திண்ணியர் ஆகப் பெறின். (குறள் 666)

ఎణ్ణియ ఎణ్ణియాంగు ఎయ్దుప ఎణ్ణియార్
తిణ్ణియర్ ఆగ పెఱిన్.

అనుకొన్నది చేసి ముగించాలనే మనో ధైర్యం కలిగినవాళ్లు అనుకొన్నది చేసి విజయాన్ని సాధిస్తారు (కుఱళ్ 666)

అని విశదీకరించారు. అపజయాలకు కుంగిపోకుండా కర్తవ్య నిర్వహణ సాగించడాన్ని కూడా వళ్లువర్ నొక్కిచెప్పారు:

துன்பம் உறவரினும் செய்க துணிவாற்றி
இன்பம் பயக்கும் வினை. (குறள் 669)

తున్బం ఉఱవరినుం సెయ్గ తుణివాట్రి
ఇన్బం పయక్కుం వినై.

ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ వాటిని లక్ష్యం చేయక ధైర్యంతో అనుకొన్న పనిని పూర్తిచేసినట్లయితే ఆపనివలన ఆనందమే కలుగుతుంది. (కుఱళ్ 669)

చేపట్టిన పనిలో ఎటువంటి అవరోధాలు ఎదురైనా ఆ పనిని వదలకుండా నిరంతరం శ్రమించి విజయాన్ని సాధించాలి. ఆత్మవిశ్వాసం అంటే కేవలం అడ్డంకులను చూసి భయపడటం కాదు; అడ్డంకులు ఉన్నప్పటికీ వాటిని అధిగమించగలమనే ధృడ మనస్తత్వం.

ప్రయత్నానికి ఉన్న విలువ:

విధి లేదా అదృష్టం సహకరించక ఒక పనిలో విజయం లభించకపోయినప్పటికీ, ఆ పని కోసం చేసే తీవ్ర పరిశ్రమ సత్ఫలితాన్ని ఇస్తుందనే సత్యాన్ని:

தெய்வத்தான் ஆகா தெனினும் முயற்சிதன்
மெய்வருத்தக் கூலி தரும். (குறள் 619)

దెయ్‌వత్తాన్ ఆగాదెనినుం ముయఱ్చి తన్
మెయ్ వరుత్త క్కూలి తరుం.

విధికారణంగా ఒకపని పూర్తికాకుండా నిలిచిపోయినా ఒకరు ప్రయత్నించి శ్రమిస్తున్నప్పుడు ఆ శ్రమకు తగిన ఫలితం అతనికి లభిస్తుంది. (కుఱళ్ 619)

అని తిరుక్కుఱళ్ చాటుతోంది. ఆశించిన సంపూర్ణ విజయం లభించకపోయినా నిజాయితీతో కూడిన ప్రయత్నం ఎన్నడూ వృథా కాదనే ఆలోచన ఇందులో ఉంది. అందువల్ల ఆత్మవిశ్వాసం అనేది కేవలం సానుకూల ఆలోచన మాత్రమే కాదు; నిరంతర ప్రయత్నంతో ముడిపడిన క్రియాశీలక నమ్మకం.

తిరుక్కుఱళ్ దృష్టిలో ఆత్మవిశ్వాసం అంటే అహంకారం కాదు; తన సామర్థ్యాన్ని గుర్తించి, గమ్యాన్ని స్పష్టం చేసుకుని, పట్టుదలతో శ్రమించే మానసిక స్థైర్యం. "సాధ్యమే" అనే ఆలోచనతో "ప్రయత్నిస్తాను" అనే కార్యాచరణ తోడైనప్పుడే మనిషి సామర్థ్యం పరిపూర్ణమవుతుంది.

5.7. తిరుక్కుఱళ్‌లో విద్య

తిరువళ్లువర్ విద్యను కేవలం సమాచార సేకరణగా మాత్రమే చూడలేదు. అది మానవుని దృక్పథాన్ని విస్తరింపజేసి, ప్రవర్తనను సంస్కరించి, జీవితాంతం తోడునీడగా నిలిచే అక్షయ సంపదగా విలసిల్లాలని చెప్పారు.

கற்க கசடறக் கற்பவை கற்றபின்
நிற்க அதற்குத் தக.

కఱ్క కశడఱ క్కఱ్పవై కట్రపిన్
నిఱ్క అదఱ్కు త్తగ.

నేర్చుకోవలసిన వాటిని క్షుణ్ణంగా అంటే దోషరహితంగా నేర్చుకోవాలి. నేర్చుకొన్న తరువాత ఆ విద్యకు అనుగుణంగా నడుచుకోవాలి. (కుఱళ్ 391)

నేర్వవలసిన సద్విద్యలను దోషం లేకుండా నేర్చుకుని, నేర్చుకున్న తరువాత దానికి తగినట్లుగా జీవించడమే వళ్లువర్ చూపిన విద్యా మార్గం. విద్య అంటే విషయాలను కంఠస్థం చేయడం మాత్రమే కాదు; స్పష్టంగా నేర్చుకుని, ఆ నేర్చుకున్న సత్యాల ప్రకారం జీవించడమే నిజమైన చదువు.

విద్య – మానవుని నేత్రాలు:

విద్య కన్నుల వంటిది. అటువంటి విద్యను సంపాదించడమే మానవ జీవిత పరమార్థమని తిరుక్కుఱళ్ ప్రబోధిస్తుంది.

எண்ணென்ப ஏனை எழுத்தென்ப இவ்விரண்டும்
கண்ணென்ப வாழும் உயிர்க்கு. (குறள் 392)

ఎణ్ణెన్ప ఏనై ఎఴుత్తెన్ప ఇవ్విరణ్డుం
కణ్ణెన్ప వాళుమ్ ఉయిర్కు.

అంకెలు, అక్షరాలు అనే జ్ఞాన నేత్రాలు కలిగినవారే ప్రాణమున్నవారుగా
పరిగణింపబడుతారు. (కుఱళ్ 392)

గణితం, అక్షరం మానవ జీవితానికి రెండు నేత్రాలుగా వర్ణించబడ్డాయి. చర్మచక్షువులు ప్రపంచ బాహ్య రూపాన్ని చూపిస్తే; విద్య దాని పరమార్థాన్ని అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది.

கண்ணுடையர் என்பவர் கற்றோர் முகத்திரண்டு
புண்ணுடையர் கல்லா தவர். (குறள் 393)

కణ్ణుడైయర్ ఎన్బవర్ కట్రోర్; ముగత్తిరణ్డు
పుణ్ణుడైయర్ కల్లాదవర్.

విద్యావంతుడు మాత్రమే కళ్లున్నవాడని గౌరవంగా చెబుతారు. విద్యావిహీనుడికి కళ్లున్నప్పటికీ అవి పుళ్లుగానే భావింపబడుతాయి (కుఱళ్ 393)

విద్య నభ్యసించినవారే నిజమైన కన్నులు కలవారు. నిరక్షరాస్యులకు కళ్లు ఉన్నప్పటికీ అవి పుండ్లతో సమానమని పేర్కొంటూ. విద్య మనిషికి కేవలం బాహ్య దృష్టిని మాత్రమే కాక, వివేచనాత్మక అంతర్దృష్టిని ప్రసాదిస్తుందని వళ్లువం స్పష్టం చేసింది.

తరగని సంపద:

భౌతిక సంపద నశించిపోవచ్చు; కానీ విద్య ఒకరి ఆలోచనల్లోనూ, వ్యక్తిత్వంలోనూ శాశ్వతంగా నిలిచివుంటుంది. అందువల్ల విద్యను నాశనం లేని మహోన్నత సంపదగా వళ్లువర్ భావించారు. ఈ భావాన్ని:

கேடில் விழுச்செல்வம் கல்வி ஒருவற்கு
மாடுஅல்ல மற்றை யவை. (குறள் 400)

కేడిల్ విళు చ్చెల్వం కల్వి ఒరువఱ్కు
మాడుఅల్ల మట్రై యవై.

విద్య ఒక్కటే అక్షీణమైన సంపద. దానితో ఉపమించదగిన సంపద వేరేదీ లేదు. (కుఱళ్ 400)

అని సుస్పష్టం చేశారు.

తిరుక్కుఱళ్‌లో విద్య అనేది జ్ఞానం, శీలం, ఆచరణల సమ్మేళనం. చదువుకున్నవాడు కేవలం తెలిసినవాడిగా మాత్రమే కాక, చదువుకు తగినట్లుగా ప్రవర్తించేవాడిగా కూడా ఉండాలి. జ్ఞానాన్ని జీవన విధానంగా మార్చుకోవడంలోనే విద్య యొక్క పరిపూర్ణత దాగి ఉంది.

5.8. తిరుక్కుఱళ్‌లో నాయకత్వ లక్షణాలు

తిరుక్కుఱళ్‌లోని అర్థ విభాగంలో రాజు, మంత్రి, కోట, సైన్యం, ప్రజలు, మంత్రాంగం, కాలం విలువ, కార్యాచరణ రీతులు తదితర అంశాల గురించిన విశ్లేషణలు ఉన్నాయి. ఈ భావనలను నాయకత్వ లక్షణాల ప్రాథమిక సూత్రాలుగా కూడా పరిగణించవచ్చు.

தூங்காமை கல்வி துணிவுடைமை இம்மூன்றும்
நீங்கா நிலனாள் பவற்கு. (குறள் 383)

తూంగామై కల్వి తుణివుడైమై ఇమ్మూన్ఱుం
నీంగా నిలనాళ్ళవఱ్కు.

కాలయాపన చేయక వెంటనే పని ప్రారంభించడం, జ్ఞానం, ధైర్యం - ఈ మూడు రాజుకు అత్యావశ్యకాలు. శాశ్వతంగా ఉండవలసిన గుణాలు. (కుఱళ్ 383)

మెలకువతో కూడిన అప్రమత్తత, జ్ఞానం, సాహసోపేతమైన ధైర్యం అనే ఈ మూడింటినీ ఒక ఉత్తమ నాయకుడి ప్రాథమిక లక్షణాలుగా వళ్లువర్ నిర్దేశించారు.

నాయకత్వం (నాయకత్వ లక్షణాలు - కొనసాగింపు):

తనను చూడటానికి వచ్చిన వాళ్లందరికి సులభంగా అందుబాటులో ఉంటూ, అందరినీ ప్రేమించే నాయకుడి నాయకత్వాన్ని ప్రజలందరూ కోరుకుంటారనే విషయాన్ని:

காட்சிக்கு எளியன் கடுஞ்சொல்லன் அல்லனேல்
மீக்கூறும் மன்னன் நிலம். (குறள் 386)

కాట్చిక్కు ఎళియన్ కడుం జొల్లన్ అల్లనేల్
మీక్కూఱుం మన్నన్ నిలం.

చూడవచ్చిన వారికి సులభంగా దర్శనమిస్తూ, పరుషోక్తులాడక న్యాయవర్తనంతో మెలగే రాజును లోకం ప్రస్తుతిస్తుంది. (కుఱళ్ 386)

అని వళ్లువం చెబుతోంది. భయం లేకపోవడం (ధైర్యం), నిరుపేదలకు ఇచ్చి ఆదుకునే దాతృత్వం, జ్ఞానం, ఉత్సాహం అనే ఈ నాలుగింటినీ నాయకుడికి ఉండవలసిన ప్రధాన లక్షణాలుగా తిరుక్కుఱళ్ నిర్వచించింది.

నాయకత్వ ధర్మం

முறைசெய்து காப்பாற்றும் மன்னவன் மக்கட்கு
இறையென்று வைக்கப் படும். (குறள் 388)

ముఱైసెయ్‌దు కాప్పాట్రుం మన్నవన్ మక్కట్కు
ఇఱై యెన్ఱు వైక్క ప్పడుం.

నీతిమార్గం తప్పక పరిపాలన సాగిస్తూ ప్రజలను సంరక్షించే రాజును మాత్రమే ప్రజానాయకుడని ప్రశంసిస్తారు (కుఱళ్ 388)

తనను నమ్ముకున్న ప్రజలకు అవసరమైన వాటిని సమకూర్చి రక్షించేవాడే నిజమైన నాయకుడన్నది తిరుక్కుఱళ్ చూపే నాయకత్వ మార్గం. నాయకత్వం అనేది అధికారంతో కూడిన హక్కు కాదు; అదొక బాధ్యతాయుతమైన కర్తవ్యమని దీని ద్వారా స్పష్టమవుతోంది. ఒక ఉత్తమ నాయకుడు ఇతరుల సలహాలను వినడానికి, లోపాలను ఎత్తిచూపేవారిని స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి.

తిరుక్కుఱళ్ ప్రతిపాదించిన నాయకత్వ భావనలో జ్ఞానం, ధైర్యం, న్యాయం, ఆలోచన (మంత్రాంగం), బాధ్యత, ప్రజాసంక్షేమం అన్నీ కలగలసి ఉంటాయి. నిజమైన నాయకుడు ముందు నడిచేవాడు మాత్రమే కాదు; అందరినీ ముందుకు నడిపించేవాడు.

5.9. తిరుక్కుఱళ్‌లో శారీరక ఆరోగ్యం

తిరుక్కుఱళ్‌లోని 'మరుందు' (ఔషధం/వైద్యం) అనే అధ్యాయం రోగం వచ్చాక చికిత్స పొందడమే కాకుండా, రోగం రాకుండా కాపాడుకునే జీవన విధానాన్ని వివరిస్తుంది. ప్రత్యేకించి ఆహార నియమాల పట్ల వళ్లువర్ ఇచ్చిన ప్రాధాన్యత విశేషమైనది.

மருந்தென வேண்டாவாம் யாக்கைக்கு அருந்தியது
அற்றது போற்றி உணின். (குறள் 942)

మరుందెన వేణ్డావాం యాక్కైక్కు అరుందియదు
అట్రదు పోట్రి ఉణిన్.

పూర్వం తిన్న ఆహారం జీర్ణం కావడానికి కాల వ్యవధి ఇచ్చి మితంగా ఆహారాన్ని స్వీకరించే వాళ్ల శరీరానికి వేరే మందు అవసరం లేదు (కుఱళ్ 942)

గతంలో తిన్న ఆహారం చక్కగా జీర్ణమైన తర్వాత సమతుల్యంగా భుజిస్తే శరీరానికి మందులతో పనే ఉండదనే నివారణా ఆరోగ్య (ప్రివెంటివ్ హెల్త్‌కేర్) సూత్రం ఇందులో వ్యక్తమవుతోంది.

మితాహార నియమం

அற்றால் அளவறிந்து உண்க அஃதுடம்பு
பெற்றான் நெடிதுய்க்கும் ஆறு. (குறள் 943)

అట్రాల్ అళవఱిన్దు ఉణ్గ; అద్దు ఉడంబు
పెట్రాన్ నెడిదుయ్క్కుమ్ ఆఱు.

తిన్న ఆహారం జీర్ణమైనదా అని తెలుసుకోవడం, తినే ఆహారం పరిమితిని తెలుసుకొని తినడం. దీర్ఘకాల జీవితానికి మార్గమవుతుంది (కుఱళ్ 943)

ఆహార నాణ్యత మాత్రమే కాదు, దాని పరిమాణం కూడా ముఖ్యమైనదే. శరీరానికి అవసరమైనంత మేరకే గ్రహించి భుజించడమే ఆరోగ్యవంతమైన జీవితానికి పునాది.

மாறுபாடு இல்லாத உண்டி மறுத்துண்ணின்
ஊறுபாடு இல்லை உயிர்க்கு. (குறள் 945)

మాఱుపాడు ఇల్లాద ఉణ్డి మఱుత్తుణ్ణిన్
ఊఱుపాడు ఇల్లై ఉయిర్కు.

శరీరానికి సరిపడే ఆహారమైనాసరే, అధికమైనపుడు వద్దని చెప్పి మితంగా తిన్నట్లయితే జీవించడంలో ఎలాంటి ఇబ్బందీ రాదు (కుఱళ్ 945)

శరీరానికి పడని ఆహారాన్ని విసర్జించి, అనువైన ఆహార విధానాన్ని అనుసరించాలనే స్పృహ ఇందులో కనిపిస్తుంది. తిరుక్కుఱళ్ శారీరక ఆరోగ్య భావన రోగం వచ్చాక మందు వేసుకోవడం కంటే, రోగానికి ముందే క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని గడపడానికే ప్రథమ ప్రాధాన్యం ఇస్తుంది. ఆహారం, పరిమాణం, జీర్ణశక్తి, శరీర స్వభావాన్ని తెలుసుకుని జీవించడమే సకల ఆరోగ్యాలకు మూలం.

5.10. తిరుక్కుఱళ్‌లో వైద్య ధర్మం

తిరుక్కుఱళ్‌లోని 'మరుందు' (వైద్యం) అనే అధ్యాయం వైద్య విజ్ఞానం, వైద్యుల బాధ్యతలకు సంబంధించిన ఎన్నో విశేషాలను నమోదు చేసింది. ఇందులో రోగం, రోగానికి గల కారణం, నివారణోపాయం, రోగి స్వభావం వీటన్నింటినీ సమగ్రంగా తెలుసుకుని వైద్యుడు కార్యాచరణ చేపట్టాలని నిర్దేశించింది.

நோய்நாடி நோய்முதல் நாடி அதுதணிக்கும்
வாய்நாடி வாய்ப்பச் செயல். (குறள் 948)

నోయ్‌నాడి, నోయ్‌ముదల్ నాడి అదు తణిక్కుం
వాయ్‌నాడి వాయ్‌ప్ప చ్చెయల్.

వ్యాధి ఏమిటి? వ్యాధికి కారణం ఏమిటి? వ్యాధి తీరడానికి మార్గమేది? వీటిని పద్ధతి ప్రకారం పరిశీలించి చికిత్స చేయాలి. (కుఱళ్ 948)

మొదట వ్యాధి లక్షణాలను గ్రహించాలి; అనంతరం కారణాన్ని కనుగొనాలి; ఆపై పరిష్కారాన్ని అన్వేషించి సరైన చికిత్సను అందించాలి. ఇది శాస్త్రీయ వైద్య విధానానికి సంబంధించిన అత్యంత స్పష్టమైన రూపం.

రోగి-కేంద్రక వైద్యం (పేషెంట్-సెంట్రిక్ మెడిసిన్)

உற்றான் அளவும் பிணியளவும் காலமும்
கற்றான் கருதிச் செயல். (குறள் 949)

ఉట్రాన్ అళవుం పిణి యళవుం కాలముం
కట్రాన్ కరుది చ్చెయల్.

వ్యాధి గ్రస్తుని వయసు, వ్యాధి స్వరూపం, చికిత్స తీసుకోవడానికి సరియైన సమయం - ఇవన్నీ పరిణతులైన వైద్యులు పరీక్షించిన తరువాతనే మొదలు పెట్టాలి (కుఱళ్ 949)

ఒకే వ్యాధికి అందరికీ ఒకే రకమైన చికిత్స సరిపోదు. రోగి శారీరక స్థితి, వ్యాధి తీవ్రత, కాలం/వాతావరణం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని వైద్యుడు చికిత్సను నిర్ణయించాలి.

உற்றவன் தீர்ப்பான் மருந்துழைச் செல்வான்என்று
அப்பால்நாற் கூற்றே மருந்து. (குறள் 950)

ఉట్రవన్ తీర్పాన్ మరున్దుళై చ్చెల్వాన్ ఎన్ఱు
అప్పాల్ నాట్ కూట్రే మరున్దు.

రోగి, వైద్యుడు, ఔషధం, పక్కనే ఉండి సహాయం చేసేవాడు - ఇలా వైద్య పద్ధతి నాలుగు విధాలుగా ఉంటుంది (కుఱళ్ 950)

రోగి, వైద్యుడు, మందు, వైద్య సహాయకుడు అనే వైద్య ప్రక్రియలోని నాలుగు మూలస్తంభాలను సమన్వయపరచిన క్రాంతదర్శి తిరువళ్లువర్.

తిరుక్కుఱళ్‌లో వైద్య ధర్మం అంటే కేవలం రోగాన్ని నయం చేయడం మాత్రమే కాదు; రోగిని సమగ్రంగా అర్థం చేసుకుని, విజ్ఞానంతో, పరిశోధనతో, బాధ్యతతో వ్యవహరించడం. రోగాన్ని మాత్రమే కాక, రోగిని కూడా సమానంగా పరిగణించే వైద్య దృక్పథమే దీని ప్రత్యేకత.

5.11. తిరుక్కుఱళ్‌లో మానసిక ఆరోగ్యం

తిరుక్కుఱళ్‌లో మానసిక ఆరోగ్యం అనే పేరుతో నేరుగా ప్రత్యేక అధ్యాయం ఏదీ కనిపించకపోయినప్పటికీ... ఆందోళన, క్రోధం, అసూయ, దురాశ, దుఃఖం, మనోధైర్యం, స్నేహం, ప్రేమ, ఆత్మనిగ్రహం వంటి అంశాలపై ఉన్న కుఱళ్ పద్యాలు మానసిక ప్రశాంతతకు తోడ్పడే జీవన సూత్రాలను అందిస్తాయి.

அழுக்காறு அவாவெகுளி இன்னாச்சொல் நான்கும்
இழுக்கா இயன்றது அறம். (குறள் 35)

అళుక్కాఱు అవావెగుళి ఇన్నాచ్చొల్ నాన్గుం
ఇళుక్కా ఇయన్ఱదు అఱం.

ఈర్ష్య, దురాశ, కోపం, మనసును బాధించే మాటలు - ఈ నాల్గింటికి చోటివ్వక జీవనం సాగించడమే ధర్మం. (కుఱళ్ 35)

ఈర్ష్య, అత్యాశ, క్రోధం, పరుష పదజాలం నుండి దూరంగా ఉండటమే ధర్మమని చెప్పబడింది. ఇవి వ్యక్తిగత సంబంధాలనే కాకుండా అంతర్గత మానసిక ప్రశాంతతను కూడా తీవ్రంగా దెబ్బతీసే అంశాలు.

దుఃఖాన్ని ఎదుర్కొనే మనోధైర్యం

కష్టాలు ఎదురైనప్పుడు కుంగిపోవడం మానవ సహజం. ఇది మానసిక అశాంతికి దారితీస్తుంది. అటువంటి సమయంలో మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇటువంటి పరిస్థితుల నుండి తనను తాను కాపాడుకోవడానికి వళ్లువర్

ఒక దివ్య ఔషధాన్ని సూచించారు. కష్టం వచ్చినప్పుడు దానిని చిరునవ్వుతో ఆహ్వానిస్తే, ఆ దుఃఖం మనస్సును సంతాపానికి గురిచేయదు.

இடுக்கண் வருங்கால் நகுக அதனை
அடுத்தூர்வது அஃதொப்பது இல். (குறள் 621)

ఇడుక్కణ్ వరుంగాల్ నగుగ; అదనై
అడుత్తూర్వదు అద్దొప్పదు ఇల్.

కష్టాలు ముంచెత్తినపుడు కలత చెందక సంతోషంతో నవ్వాలి. కష్టాలను జయించడానికి నవ్వునకు మించినది వేరేదీలేదు (కుఱళ్ 621)

దీనిని కష్టాలను నిరాకరించడంగా భావించకూడదు; ఆపదలు వచ్చినప్పుడు పూర్తిగా నిరుత్సాహపడకుండా వాటిని నిబ్బరంతో ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని కలిగి ఉండాలని అర్థం చేసుకోవాలి.

మానసిక ఆరోగ్యానికి మంచి మానవ సంబంధాలు ఎంతో అవసరం. ప్రేమ, స్నేహం, ప్రియభాషణం, కృతజ్ఞతాభావం వంటి వాటికి వళ్లువర్ ఇచ్చిన ప్రాధాన్యత మానవుడి మానసిక జీవితానికి, సామాజిక సంబంధాలకు ఎంతో కీలకమైనది.

మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకునే మార్గాలు

ఇతరుల ఎదుగుదలను చూసి ఈర్ష్య పడటం మానసిక ఆరోగ్యాన్ని ఛిద్రం చేస్తుంది. ఎదుటివారి అభివృద్ధిని చూసి అసూయ చెందకుండా వారిని మనస్ఫూర్తిగా అభినందించి, మనం కూడా అటువంటి ఉన్నతిని సాధించగలమనే ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయడం మానసిక ప్రశాంతతను కాపాడుతుంది.

அறனாக்கம் வேண்டாதான் என்பான் பிறனாக்கம்
பேணாது அழுக்கறுப் பான். (குறள் 163)

అఱనాక్కం వేణ్డాదాన్ ఎన్బాన్ పిఱనాక్కం
పేణాదు అళుక్కఱు ప్పాన్.

ఎవడైతే ఇతరుల గొప్పదనాన్ని చూసి ఆనందించక అసూయగ్రస్తుడవుతాడో వాడు ధర్మమార్గానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడని అర్థం. (కుఱళ్ 163)

తిరుక్కుఱళ్ మానసిక ప్రశాంతతను బయట వెతకడానికి బదులు ముందుగా అంతరంగాన్ని సంస్కరించుకోవాలని చెబుతుంది. భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, వాటిని నియంత్రించడం, ఆపదల్లో ధైర్యం కోల్పోకపోవడం, ప్రేమపూర్వక బంధాలను పెంపొందించుకోవడం వంటివి తిరుక్కుఱళ్ అందించే మానసిక జీవన సందేశాలు.

5.12. తిరుక్కుఱళ్‌లో మానవతా దృక్పథం

మనిషిని మనిషిగా గౌరవించడం, తోటివారి కష్టాన్ని అర్థం చేసుకోవడం, సహాయం చేయడం, కీడు తలపెట్టకపోవడం, ఆకలి తీర్చడం, ప్రేమతో ఆదరించడం మానవతావాదానికి పునాదులు. తిరుక్కుఱళ్ గ్రంథమంతటా ఈ ఆలోచన వివిధ రూపాలలో విస్తరించి ఉంది.

அன்பிலார் எல்லாம் தமக்குரியர் அன்புடையார்
என்பும் உரியர் பிறர்க்கு. (குறள் 72)

అన్బిలార్ ఎల్లాం తమక్కురియర్; అన్బుడైయార్
ఎన్బుం ఉరియర్ పిఱర్కు.

ప్రేమలేనివారు ప్రతివస్తువూ తమకే కావాలని, దాన్ని స్వంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ప్రేమగలవారు తమ శరీరం, వస్తువులు, ప్రాణం అన్నీ పరోపకారార్థమే అని భావిస్తారు. (కుఱళ్ 72)

స్వార్థాన్ని దాటుకొని పరోపకారార్థం వైపుగా విస్తరించే హృదయమే మానవత్వానికి నాంది.

ఎదుటివారి కష్టాన్ని తన కష్టంగా భావించడం

அறிவினான் ஆகுவது உண்டோ பிறிதின்நோய்
தம்நோய்போல் போற்றாக் கடை. (குறள் 315)

అఱివినాన్ ఆగువదు ఉణ్డో పిఱిదిన్ నోయ్
తమ్ నోయ్‌పోల్ పోట్రా క్కడై.

ఇతరుల కష్టాలను తన కష్టంగా భావించి వాళ్లను రక్షించడానికి ముందుకు రానివారు ప్రజ్ఞావంతులైనంత మాత్రాన ఏం ప్రయోజనం? (కుఱళ్ 315)

తోటివారి వేదనను తన వేదనలా అనుభవించని జ్ఞానం వల్ల ఏమి ప్రయోజనం? అనే ఈ ప్రశ్న మానవతావాదపు పరమోన్నత శిఖరాన్ని తాకుతుంది. జ్ఞానపుటౌన్నత్యం దాని పరిమాణంలో లేదు; అది ఎదుటివారికి ఉపయోగపడే గుణంలో ఉంది.

దాతృత్వం, మానవతావాదం

నిజంగా అవసరంలో ఉన్నవారికి చేసినప్పుడే అది నిజమైన 'దానం' అవుతుంది.

வறியார்க்குஒன்று ஈவதே ஈகைமற் றெல்லாம்
குறியெதிர்ப்பை நீர துடைத்து. (குறள் 221)

వఱియార్కు ఒన్ఱు ఈవదే ఈగై; మట్రెల్లాం
కుఱియెదిర్‌పై నీర దుడైత్తు.

లేనివారికి ఇవ్వడమే నిజమైన దానం. మిగిలిన వారికి ఇవ్వడం అనేది ఏదో ఒక ఆదాయాన్ని ఆశించి ఇవ్వడమే. (కుఱళ్ 221)

ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే నిస్వార్థ సహాయమే మానవతావాదపు అత్యున్నత రూపం. తిరుక్కుఱళ్‌లో మానవతావాదం అనేది 'నేను' నుండి 'మనం' వైపు సాగే ఆధ్యాత్మిక మానసిక ప్రయాణం. ఇతరుల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమం కోసం పనిచేసినప్పుడే జ్ఞానానికి, సంపదకు నిజమైన మానవ విలువ చేకూరుతుంది.

5.13. తిరుక్కుఱళ్‌లో సామాజిక సామరస్యం

ఒక సమాజం కేవలం చట్టాల ద్వారా మాత్రమే శాశ్వతంగా నిలబడదు. పరస్పర గౌరవం, ప్రేమ, న్యాయం, సహనం, మృదుభాషణం, సర్దుబాటు తత్వాలే సామాజిక సామరస్యానికి బలమైన పునాదులు.

இனிய உளவாக இன்னாத கூறல்
கனியிருப்பக் காய்கவர்ந் தற்று. (குறள் 100)

ఇనియ ఉళవాగ ఇన్నాద కూఱల్
కని యిరుప్ప క్కాయ్ కవర్ న్దట్రు.

మధురములైన మాటలు ఎన్నో ఉన్నపుడు వాటిని వదలి కఠినంగా మాట్లాడ్డం తీయని పండును వదలి పచ్చికాయను తినడానికి సమ మవుతుంది. (కుఱళ్ 100)

మధురమైన మాటలు మాట్లాడకుండా కఠినంగా సంభాషించడం తియ్యని పండును వదిలిపెట్టి పచ్చి కాయను ఎంచుకున్నట్లే. సంబంధాలను నిలబెట్టడంలో మాటలు కీలకపాత్ర పోషిస్తాయి. అందువల్ల సామాజిక సంబంధాలలో భాష యొక్క బాధ్యతను ఈ కుఱళ్ స్పష్టం చేస్తుంది.

చెడుకు మంచిని బదులుగా ఇవ్వడం

కక్షకు ప్రతీకారం అనే విషవలయాన్ని కొనసాగించకుండా, తమకు కీడు చేసిన వారికి కూడా మేలు చేయడమే ఉత్తమ గుణమని వళ్లువర్ చెబుతారు. ఇది సామాజిక సామరస్యానికి అత్యంత లోతైన ధార్మిక దృక్పథం.

இன்னாசெய் தாரை ஒறுத்தல் அவர்நாண
நன்னயம் செய்து விடல். (குறள் 314)

ఇన్నాసెయ్ దారై ఒఱుత్తల్ అవర్ నాణ
నన్నయం సెయ్దు విడల్.

తమకు కీడుచేసిన వారిని దండించడానికి సరియైన పద్ధతి అతడు సిగ్గుతో తలవంచుకునేలే అతనికి మేలుచేయాలి. అతడు చేసిన అపకారాన్ని వెంటనే మరచిపోవాలి. (కుఱళ్ 314)

నిష్పాక్షికత (నడువునిలైమై)

సామాజిక సామరస్యానికి న్యాయమే ప్రథమ ప్రాధాన్యం. ఎవరి వైపూ మొగ్గు చూపకుండా అందరినీ సమానంగా చూసే నిష్పాక్షికత లేకపోతే దీర్ఘకాలిక ఐక్యత సాధ్యపడదు. అందువల్ల తిరుక్కుఱళ్ ప్రతిపాదించే సామరస్యం భేదాలను అంతం చేయడం కాదు; భిన్నత్వాల మధ్య కూడా మానవతా నియమాలను కాపాడటం.

ప్రేమ, ప్రియవచనం, సహనం, న్యాయం, క్షమాగుణం అనేవి తిరుక్కుఱళ్ చాటిచెప్పే సామాజిక సామరస్య స్తంభాలు. ఐక్యత అంటే అందరూ ఒకేలా ఉండటం కాదు; భిన్నత్వాలు ఉన్నవారూ పరస్పర గౌరవంతో కలిసి జీవించడం.

5.14. తిరుక్కుఱళ్‌లో మైత్రి

తిరుక్కుఱళ్‌లో స్నేహం కేవలం కాలక్షేప బంధంగా పరిగణించబడలేదు. మంచి మిత్రుడిని ఎన్నుకోవడం, మైత్రిని పరీక్షించి తెలుసుకోవడం, నిజమైన స్నేహాన్ని నిలబెట్టుకోవడం, దుష్ట సాంగత్యాన్ని విడిచిపెట్టడం వంటి స్నేహానికి సంబంధించిన అనేక పార్శ్వాలను వళ్లువర్ లోతుగా విశ్లేషించారు.

முகநக நட்பது நட்பன்று நெஞ்சத்து
அகநக நட்பது நட்பு. (குறள் 786)

ముగనగ నట్పదు నట్పన్రు; నెంజత్తు
అగనగ నట్పదు నట్పు.

మందహాసం వెదజల్లే మోము మాత్రమే స్నేహానికి గుర్తుకాదు. మనసారా అభిలషించడమే నిజమైన స్నేహం (కుఱళ్ 786)

తప్పును సరిదిద్దే మిత్రుడు

స్నేహితుడు అంటే ఆనందంలో మాత్రమే పక్కన ఉండేవాడు కాదు. తప్పుదారి పట్టినప్పుడు వారించి, కష్టాలు ఎదురైనప్పుడు అండగా నిలబడేవాడే నిజమైన మిత్రుడని స్నేహానికి లక్షణాన్ని నిర్దేశించారు వళ్లువర్.

அழிவின் அவைநீக்கி ஆறுஉய்த்து அழிவின்கண்
அல்லல் உழப்பதாம் நட்பு. (குறள் 787)

అళివి అవైనీక్కి ఆఱుఉయ్త్తు అళివిన్ కణ్
అల్లల్ ఉళైప్పదాం నట్పు.

స్నేహితుని చెడు మార్గాల్లో వెళ్లకుండా అడ్డగించి, అతన్ని మంచి మార్గంలో ప్రవర్తింపజేసి అతనికి ఆపద వచ్చినపుడు ఆదుకోవడమే నిజమైన స్నేహం (కుఱళ్ 787)

ఆపదలో చిక్కుకున్న మిత్రుడిని ఆదుకునే వైఖరిని వళ్లువర్ ఒక అద్భుతమైన ఉపమానంతో వివరించారు:

உடுக்கை இழந்தவன் கைபோல ஆங்கே
இடுக்கண் களைவதாம் நட்பு. (குறள் 788)

ఉడుక్కె ఇళన్దవన్ కైపోల ఆంగే
ఇడుక్కణ్ కళైవదాం నట్పు.

ధరించిన వస్త్రాభరణాలు జారిపోతున్నపుడు చేతులు పట్టుకోవడానికి ఎలా లేస్తాయో అలా స్నేహితుని కష్టాలను తొలగించడానికి ఆతురతతో ముందుకు రావడమే స్నేహానికి లక్షణం (కుఱళ్ 788)

ఆనందాన్ని పంచుకోవడంలో కంటే, తప్పును సరిదిద్దడం, ఆపదలో తోడుగా నిలవడం, నిజాయితీగా ఉండటంలోనే స్నేహానికి అసలైన విలువ ఉంది.

5.15. తిరుక్కుఱళ్‌లో రాజనీతి

తిరుక్కుఱళ్‌లోని అర్థ విభాగంలో రాజ్యం, పాలకుడు, మంత్రి, కోట, సైన్యం, ప్రజలు, న్యాయం, ఆర్థిక వ్యవస్థ, రాయబారం వంటి రాజకీయ అంశాలు సమగ్రంగా చర్చించబడ్డాయి. వళ్లువర్ రాజకీయ ఆలోచనలలో ప్రజా సంక్షేమం, న్యాయపాలనలు అగ్రస్థానంలో నిలుస్తాయి.

படைகுடி கூழ்அமைச்சு நட்புஅரண் ஆறும்
உடையான் அரசருள் ஏறு. (குறள் 381)

పడైకుడి కూళ్- అమైచ్చు నట్పు అరణ్ ఆఱుం
ఉడైయాన్ అరశరుళ్ ఏఱు.

బలోపేత సైన్యం, తెలివైన ప్రజలు, అక్షీణ సంపద, దొసగులులేని మంత్రులు, నిష్కళంక స్నేహం, బలమైన కోట - ఈ ఆరు అంశాలు కలిగినవాడే రాజులలో మగ సింహం వంటివాడు (కుఱళ్ 381)

సైన్యం, ప్రజలు, ఆర్థిక వనరులు, మంత్రివర్గం, మిత్రరాజ్యాలు, రక్షణ దుర్గం అనే ఆరింటినీ రాజ్యానికి ముఖ్యమైన అంగాలుగా వళ్లువర్ పేర్కొన్నారు.

న్యాయపాలన (ధర్మదండం)

வான்நோக்கி வாழும் உலகெல்லாம் மன்னவன்
கோல்நோக்கி வாழும் குடி. (குறள் 542)

వాన్ నోక్కి వాళుమ్ ఉలగెల్లాం; మన్నవన్
కోల్ నోక్కి వాళుమ్ కుడి.

లోకంలో ప్రాణులన్నీ వానను ఎదురుచూస్తూ జీవిస్తున్నాయి. అదేవిధంగా ప్రజలందరూ రాజదండాన్ని అనగా న్యాయ సమ్మతమైన ప్రభుత్వాన్ని ఎదురుచూస్తూ జీవిస్తున్నారు (కుఱళ్ 542)

ఆకాశం నుండి కురిసే వర్షంపై లోకం ఆధారపడినట్లే, ప్రజల జీవనం పాలకుడి న్యాయమైన రాజదండంపై ఆధారపడి ఉంటుందనే భావన ఇందులో వ్యక్తమవుతోంది. రాజకీయం అనేది పాలకుడి వ్యక్తిగత వైభవాన్ని ప్రదర్శించే సాధనం కాదు; ప్రజల రక్షణ, వారి సంక్షేమానికి సంబంధించిన పవిత్ర బాధ్యత అన్నదే తిరుక్కుఱళ్ మూలసూత్రం. తిరుక్కుఱళ్

రాజకీయ సిద్ధాంతంలో అధికారం కంటే న్యాయం, పాలకుడి స్వార్థం కంటే ప్రజల శ్రేయస్సు, బలప్రయోగం కంటే బాధ్యతాయుతమైన పాలనకే సర్వోన్నత ప్రాధాన్యత లభించింది.

5.16. తిరుక్కుఱళ్‌లో పరిపాలనా దక్షత

పరిపాలన అంటే కేవలం నిర్ణయాలు తీసుకోవడం మాత్రమే కాదు; సరైన కార్యాన్ని, సరైన వ్యక్తికి, సరైన సమయంలో అప్పగించి, ఫలితాలను సమీక్షించి విజయవంతంగా పూర్తి చేయడం. తిరుక్కుఱళ్‌లోని అనేక అధ్యాయాలలో ఇటువంటి పరిపాలనా సూత్రాలు కనిపిస్తాయి.

இதனை இதனால் இவன்முடிக்கும் என்றாய்ந்து
அதனை அவன்கண் விடல். (குறள் 517)

ఇదనై ఇదనాల్ ఇవన్ ముడిక్కుం ఎన్ఱాయ్‌న్దు
అదనై అవన్ కణ్ విడల్.

ఒకపనిని ఒకడు ఎలాచేసి ముగిస్తాడు అనేది పరీక్షించి తెలుసుకొని దాని తరువాత ఆ పనిని ఆ వ్యక్తికి అప్పగించాలి (కుఱళ్ 517)

ఏ కార్యాన్ని ఎవరు ఏ మార్గంలో సమర్థవంతంగా పూర్తి చేయగలరో విచారించి వారికి అప్పగించాలి. ఇది ఆధునిక నిర్వహణ శాస్త్రంలో (మేనేజ్‌మెంట్‌లో) చెప్పే 'సరైన పనికి సరైన వ్యక్తిని ఎంపిక చేయడం' (రైట్ పర్సన్ ఫర్ ద రైట్ జాబ్) అనే భావనకు అద్దం పడుతుంది.

ప్రణాళికా రచన – కార్యాచరణ

எண்ணித் துணிக கருமம் துணிந்தபின்
எண்ணுவம் என்பது இழுக்கு. (குறள் 467)

ఎణ్ణిత్తుణిగ కరుమం; తుణిన్ద పిన్
ఎణ్ణువం ఎన్బదు ఇళుక్కు.

క్షుణ్ణంగా ఆలోచించిన తరువాతనే పనిలో దిగాలి. పని ప్రారంభించిన తరువాత ఆలోచిద్దామనుకోవడం తగదు. (కుఱళ్ 467)

కార్యాచరణకు ముందే సమగ్రమైన పరిశోధన, ప్రణాళిక ఉండాలి; నిర్ణయం తీసుకున్న తరువాత అనవసరమైన సందేహాలు, సందిగ్ధతలు ఉండకూడదు. ప్రణాళిక మరియు కార్యాచరణల మధ్య ఉండవలసిన సమతుల్యతను వళ్లువర్ వివరించారు.

వనరులు, సమయం, కార్యవిధానం, కష్టతరమైన పనులను నెరవేర్చే నైపుణ్యాలను ఎరిగి ఉండటమే సమర్థవంతమైన పరిపాలన లక్షణం. దీనిని:

கருவியும் காலமும் செய்கையும் செய்யும்
அருவினையும் மாண்டது அமைச்சு. (குறள் 631)

కరువియుం కాలముం సెయ్గైయుం సెయ్యుం
అరువినైయుం మాణ్డదు అమైచ్చు.

తగిన సాధనం, సరియైన కాలం, పనిచేసే విధం, తలపెట్టిన పని - వీటిని క్షుణ్ణంగా పరిశీలించి కార్యాచరణకు పూనుకొనేవాడే మంత్రి. (కుఱళ్ 631)

అనే కుఱళ్ స్పష్టం చేస్తుంది. కుఱళ్ బోధించే పరిపాలనా చింతన, ప్రణాళికా రచన, మానవ వనరుల ఎంపిక, సమయస్ఫూర్తి, కాలం విలువ, అధికారాల వికేంద్రీకరణ, కార్యాచరణ సామర్థ్యాల సమన్వయంగా నిలుస్తుంది. ఉత్తమ నిర్వాహకుడు అంటే అన్ని పనులను తానొక్కడే చేసేవాడు కాదు; ఇతరులతో సమర్థవంతంగా చేయించగల నాయకుడు.

5.17. తిరుక్కుఱళ్‌లో ఆర్థిక ఆలోచనలు

ధర్మబద్ధమైన మార్గంలో ధనాన్ని సంపాదించడం, సంపాదించిన దానిని కాపాడుకోవడం, క్రమబద్ధంగా వినియోగించడం, ఇతరులకు ఉపయోగపడేలా చేయడం వంటి అంశాలను తిరుక్కుఱళ్ నొక్కిచెబుతుంది. దీని ద్వారా ఆర్థిక వ్యవస్థను మానవ సంక్షేమంతో అనుసంధానించింది.

இயற்றலும் ஈட்டலும் காத்தலும் காத்த
வகுத்தலும் வல்லது அரசு. (குறள் 385)

ఇయట్రలుం ఈట్టలుం కాత్తలుం కాత్త
వగుత్తలుం వల్లదు అరసు.

ధన సంపాదన కోసం ఉపాయాలను అన్వేషించడం, రాజ్యాదాయాన్ని వృద్ధిచేయడం, సంపాదించిన ధనాన్ని రక్షించడం, ప్రణాళిక ప్రకారం వ్యయం చేయడం ఇవి రాజు చేయవలసిన పనులు (కుఱళ్ 385)

ఆదాయాన్ని సమకూర్చడం, ఆర్జించడం, రక్షించడం, ఆపై సముచిత రీతిలో పంపిణీ చేయడం అనేవి సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణకు నాలుగు మూలస్తంభాలు.

సంపద యొక్క సామాజిక ప్రయోజనం

ఒక దేశం ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడు, ఆ బలమే శత్రువులను లేకుండా చేస్తుంది. అటువంటి ఆర్థిక పురోగతిని ప్రతి దేశం కలిగి ఉండాలనే ఆలోచనను వళ్లువం ప్రతిపాదించింది. ఆ భావనను:

செய்க பொருளைச் செறுநர் செருக்கறுக்கும்
எஃகுஅதனிற் கூரியது இல். (குறள் 759)

సెయ్గ పొరుళై; చ్చెఱునర్ సెరుక్కఱుక్కుం
ఎగ్గు అదనిట్ కూరియదు ఇల్.

ప్రయత్నించి ఒకరు ధనాన్ని ఆర్జించాలి. శత్రువుల గర్వాన్ని అణచడానికి తగిన సాధనం ధనం తప్ప వేరేదీ లేదు (కుఱళ్ 759)

అని తిరుక్కుఱళ్ ప్రతిధ్వనిస్తుంది.

ఆర్థిక బలం వ్యక్తికి మరియు ప్రభుత్వానికి సమర్థవంతంగా పనిచేసే సామర్థ్యాన్ని ఇస్తుంది. అయితే సంపద ఎల్లప్పుడూ ధర్మం యొక్క అదుపులోనే ఉండాలన్నది తిరుక్కుఱళ్ విశాల దృక్పథం. దానం (ఈగై), సామాజిక హితం (ఒప్పురవు), ఆతిథ్యం (విరుందోంబల్) వంటి అధ్యాయాలు సంపద యొక్క సామాజిక బాధ్యతను వివరిస్తాయి. అందువల్ల ధనార్జన యొక్క అంతిమ లక్ష్యం కూడబెట్టడం మాత్రమే కాదు; దానిని లోకహితానికి సార్థకం చేయడమే.
తిరుక్కుఱళ్ ఆర్థిక చింతనలో ఉత్పత్తి – ఆర్జన – సంరక్షణ – పంపిణీ అనే నాలుగు దశలు ఉన్నాయి. సంపద మనిషిని శాసించకూడదు; అది మానవ శ్రేయస్సుకు సాధనంగా ఉపయోగపడాలి. ధర్మబద్ధమైన ఆర్థిక వ్యవస్థే శాశ్వతమైన సంపద అన్నది వళ్లువర్ ప్రాథమిక సందేశం.

5.18. తిరుక్కుఱళ్‌లో వ్యవసాయం

తిరువళ్లువర్ వ్యవసాయాన్ని కేవలం ఒక వృత్తిగా మాత్రమే కాక, సమస్త సమాజ మనుగడకు ప్రాథమిక పునాదిగా దర్శించారు. ఆహారోత్పత్తి లేకుండా ప్రపంచం నడవలేదు. అందుకే తిరువళ్లువర్ రైతుకు అత్యున్నత స్థానాన్ని ఇచ్చారు.

சுழன்றும்ஏர்ப் பின்னது உலகம் அதனால்
உழந்தும் உழவே தலை. (குறள் 1031)

సుళన్టుం ఏర్ ప్పిన్నదు ఉలగం; అదనాల్
ఉళన్డుం ఉళ వే తలై.

ఎన్నో వృత్తులు ఉన్నప్పటికీ ఈ లోకం వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. కాబట్టి ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ వ్యవసాయ వృత్తియే ఉన్నతమైంది. (కుఱళ్ 1031)

ప్రపంచం ఎన్ని వృత్తుల్లో మునిగితేలినా, చివరకు ఆహారం కోసం రైతన్ననే ఆశ్రయించక తప్పదు.

సమాజానికి మూలస్తంభం

వ్యవసాయమే సర్వ ప్రాణుల క్షుద్బాధను తొలగించి, మానసికానందాన్ని, చిత్తశుద్ధిని ప్రసాదిస్తుంది. ఆకలి అనే వ్యాధిని నయం చేసే వైద్యులుగా రైతులను కొనియాడుతూ:

உழுதுண்டு வாழ்வாரே வாழ்வார்மற் றெல்லாம்
தொழுதுண்டு பின்செல் பவர். (குறள் 1033)

ఉళుదుణు వాళ్వారే వాళ్వార్; మట్రెల్లాం
తొళుదుణ్డు పిన్ సెల్బవర్.

వ్యవసాయం చేసి జీవించేవారి జీవనమే మేలైనది. ఎందుకంటే మిగిలిన వాళ్లు, కర్షకులను ఆశ్రయించి. (కుఱళ్ 1033)

అనే కుఱళ్‌ను వళ్లువర్ అందించారు. శ్రమ ద్వారా ఆహారాన్ని ఉత్పత్తి చేసేవారి ఆత్మగౌరవాన్ని, సామాజిక పాత్రను ఈ కుఱళ్ సమున్నతంగా నిలబెడుతుంది.

உழவினார் கைம்மடங்கின் இல்லை விழைவதூஉம்
விட்டேமென் பார்க்கு நிலை. (குறள் 1036)

ఉళ్ళవినార్ కైమ్మడంగిన్ ఇల్లై విళైవదూఉం
విట్టే మెన్బార్కు నిలై.

బంధాలన్నీ వదిలేశామని చెప్పే తాపసులు కూడ రైతులను ఆశ్రయించే జీవించాలి. (కుఱళ్ 1036)

రైతుల చేతులు పనిచేయకపోతే మిగిలిన రంగాలన్నీ స్తంభించిపోతాయనే సామాజిక-ఆర్థిక సత్యాన్ని వళ్లువర్ సూటిగా విశదీకరించారు. తిరుక్కుఱళ్‌లో వ్యవసాయం అంటే కేవలం ఆహారోత్పత్తి మాత్రమే కాదు; మానవ సమాజపు జీవనాడి. రైతును గౌరవించడం అంటే ఒక వృత్తిని గౌరవించడం మాత్రమే కాదు; సమస్త మానవ జీవనాన్ని మోస్తున్న మౌలిక శ్రమను గౌరవించడమే.

5.19. తిరుక్కుఱళ్‌లో పర్యావరణం

'పర్యావరణం' అనే ఆధునిక పదం నేరుగా తిరుక్కుఱళ్‌లో కనిపించకపోయినా వర్షం, నీరు, వ్యవసాయం, భూతదయ, అహింస, మితమైన వినియోగం వంటి భావనల ద్వారా ప్రకృతికి, మానవ జీవితానికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని తిరుకుఱళ్ గ్రంథం సుస్పష్టంగా నమోదు చేసింది.

నీటి ప్రాధాన్యత

భూమిపై జీవన చక్రం నిరాటంకంగా సాగాలంటే జలవనరులు అత్యంత ఆవశ్యకం. నీటి విశిష్టతను వళ్లువర్:

நீர்இன்று அமையாது உலகெனின் யார்யார்க்கும்
வான்இன்று அமையாது ஒழுக்கு. (குறள் 20)

నీర్ఇన్టు అమైయాదు ఉలగెనిన్ యార్ యార్కుం
వాన్ఇన్టు అమైయాదు ఒళుక్కు.

వర్షం వలన లభించే నీరు లేకపోతే ఈ లోకం నిలిచి ఉండదు. వర్షం లేకపోతే ధర్మం నశించిపోతుంది. (కుఱళ్ 20)

అనే కుఱళ్లో నిక్షిప్తం చేశారు. నీరు లేకపోతే ప్రాపంచిక జీవితం నడవదు. అందుకే నీటికి మూలాధారమైన వర్షం ప్రాముఖ్యతను కూడా వళ్లువర్ నొక్కిచెప్పారు:

விசும்பின் துளிவீழின் அல்லால்மற் றாங்கே
பசும்புல் தலைகாண்பு அரிது. (குறள் 16)

విసుంబిన్ తుళి వీళిన్ అల్లాల్ మట్రాంగే
పసుంబుల్ తలై కాణ్బు అరిదు.

> ఆకాశం నుండి వర్షపు చినుకు పడకపోయినట్లయితే భూమిమీద పచ్చని గడ్డి మొలవడం కూడ గగనమవుతుంది. (కుఱళ్ 16)

ఒక చిన్న పచ్చగడ్డి పరక బతకాలన్నా వర్షం తప్పనిసరి. మానవుడు, వృక్షజాతి, నీరు, వాన అనేవి విడివిడిగా లేవని; అవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న సహజసిద్ధమైన ప్రాకృతిక శృంఖల అని చాటారు.

భూతదయ, పర్యావరణ సమతుల్యత

దేశంలో నీటి కొరత ఏర్పడితే కరవు కాటకాలు ముంచుకొస్తాయి. దీనివల్ల రోగాలు, ఆకలి, శత్రుత్వాలు పెరిగి దేశ శాంతి ఛిద్రమవుతుంది. అందువల్ల జలవనరులే వీటన్నింటినీ నివారించే అతిపెద్ద ఆధారం. ప్రకృతి సమృద్ధిగా ఉన్నప్పుడు సమాజంలో ఆకలి ఉండదు. అందరికీ ఆహారం లభించడం వల్ల మానసికారోగ్యం, శారీరకారోగ్యం బాగుంటాయి; అందరికీ అన్నీ సమకూరడం వల్ల వైరభావాలు నశిస్తాయి. దానాలు, తపస్సులు సైతం కొనసాగుతాయి. కాబట్టి ప్రకృతిని కాపాడుకోవడం మన కర్తవ్యమనే విషయాన్ని:

> *தானம் தவமிரண்டும் தங்கா வியனுலகம்*
> *வானம் வழங்காது எனின். (குறள் 19)*
>
> దానం తవమిరణ్టుం తంగా, వియనులగం
> వానం వళ్ంగాదు ఎనిన్.
>
> వర్షాలు కురవకపోయినట్లయితే ఈ విశాల ప్రపంచంలో ఇతరులకు చేసే దానాలకు, తాముచేసే వ్రతాలకు విఘ్నం ఏర్పడుతుంది. (కుఱళ్ 19)

అనే కుఱళ్ ద్వారా స్పష్టం చేశారు. తిరుక్కుఱళ్‌లోని పర్యావరణ చింతనలు మానవుడు ప్రకృతికి అతీతంగా ఒంటరిగా జీవించలేడనే నిజాన్ని బోధిస్తున్నాయి. ప్రకృతిని రక్షించడం అంటే కేవలం బయటి ప్రపంచాన్ని కాపాడటం మాత్రమే కాదు; మానవ మనుగడ పునాదులనే రక్షించుకోవడమని వళ్లువర్ అమృతవాక్కుల అంతరార్థం.

5.20. తిరుక్కుఱళ్‌లో కుటుంబ ధర్మం

తిరుక్కుఱళ్‌లో కుటుంబం అనేది కేవలం నివాస ప్రదేశంగా మాత్రమే చూడబడలేదు; సకల ధర్మాలు జన్మించే మొట్టమొదటి సామాజిక వ్యవస్థగా అది భావించబడింది. ప్రేమ, బాధ్యత, ఆతిథ్యం, సంతాన ప్రాప్తి, అనురాగ బంధాలు కుటుంబ ధర్మానికి ముఖ్యమైన అంగాలుగా నిలుస్తాయి.

> *அன்பும் அறனும் உடைத்தாயின் இல்வாழ்க்கை*
> *பண்பும் பயனும் அது. (குறள் 45)*
>
> అన్బుం అఱనుం ఉడైత్తాయిన్ ఇల్ వాళ్క్కై
> పణ్బుం పయనుం అదు.

> గృహస్థ జీవితాన్ని సాగించేవారు ప్రేమైక హృదయులుగా ధర్మమార్గంలో పయనించేవారుగా ఉండాలి. అదే జీవితానికి సాఫల్యాన్ని ఇస్తుంది. (కుఱళ్ 45)

కుటుంబ గొప్పతనం సంపదల్లో లేదు; ప్రేమ, ధర్మాలతో నిండిన సంబంధ బాంధవ్యాలలోనే ఉంది.

కుటుంబపు సామాజిక బాధ్యత

వ్యక్తిగత జీవితం అంటే కేవలం తాను, తన కుటుంబం అని బతకడం కాదు. ప్రతి వ్యక్తి తనను సృష్టించి పోషిస్తున్న ఈ సమాజానికి తన వంతు చిన్న కర్తవ్యాన్ని నిర్వహించాలి. పెద్ద ఎత్తున సమాజ సేవ చేయలేకపోయినా, తన శక్తిమేరకు తన చుట్టూ ఉన్న బంధుమిత్రులను, ప్రాణులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి విధి. దీనిని దృష్టిలో ఉంచుకునే గృహస్థుడు ఆచరించవలసిన విధులను వళ్లువర్ అత్యంత స్పష్టంగా నిర్వచించారు. సన్యాసులకు, అభాగ్యులకు/పేదలకు, మరణించిన పితృదేవతలకు బాసటగా నిలవడమే నిజమైన గృహస్థ ధర్మం.

కుటుంబ వ్యవస్థ నిర్వహించే ఈ ఉన్నత ధర్మాన్ని వళ్లువం:

> *இல்வாழ்வான் என்பான் இயல்புடைய மூவர்க்கும்*
> *நல்லாற்றின் நின்ற துணை. (குறள் 41)*
>
> ఇల్ వాళ్వాన్ ఎన్బాన్ ఇయల్బుడైయ మూవర్కుం
> నల్లాట్రిన్ నిన్ట తుణై.
>
> బంధువులకు, పేదలకు, అసహాయులకు ఈ ముప్పురికి తోడుగా ఉండడమే గృహస్థ ధర్మం అవుతుంది. (కుఱళ్ 41)

అని పేర్కొంది.

గృహస్థ జీవితం తన కోసం మాత్రమే బతికే వ్యవస్థ కాదు; ఇతరులకు కూడా ఆసరాగా నిలబడవలసిన సామాజిక బాధ్యత కలిగినది. ఇటువంటి సామాజిక బాధ్యతకు సదాచార కుటుంబ వ్యవస్థే మూలాధారం. అందుకే కుటుంబ ఔన్నత్యానికి సద్గుణవంతురాలైన ఇల్లాలు, ఆ కుటుంబ ఖ్యాతిని ముందుకు తీసుకువెళ్లే ఉత్తమ సంతానం అత్యంత కీలకమని:

> *மங்கலம் என்ப மனைமாட்சி மற்றதன்*
> *நன்கலம் நன்மக்கட் பேறு. (குறள் 60)*
>
> మంగలం ఎన్ప మనై మాట్చి; మట్రదన్
> నన్గలం నన్మక్కట్ పేఱు.
>
> భార్య సౌశీల్యమే గృహస్థ జీవితానికి ముఖ్యమైనది. మంచి సంతానాన్ని పొందడమే దానికి ఆభరణాలని చెబుతారు. (కుఱళ్ 60)

అనే కుఱళ్ ద్వారా విశదీకరించారు. కుటుంబ విశిష్టత సద్గుణాలతో, భావితరాన్ని ఉన్నత మార్గంలో తీర్చిదిద్దడంలోనే ఉంది.

తిరుక్కుఱళ్‌లోని కుటుంబ ధర్మం ప్రేమ, బాధ్యత, పరస్పర పంపకం, ఉత్తమ తరం నిర్మాణం మొదలైనవాటి సంగమం. ఉత్తమ సమాజం రూపుదిద్దుకోవాలంటే దాని మొదటి పాఠశాల అయిన కుటుంబం ధర్మబద్ధంగా ఉండాలి.

5.21. తిరుక్కుఱళ్‌లో మహిళలు

తిరుక్కుఱళ్‌లో స్త్రీలకు సంబంధించిన భావనలను నాటి సమకాలీన సామాజిక నేపథ్యంతో అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం. గృహస్థ జీవితం, జీవిత భాగస్వామి, సంతాన ప్రాప్తి, కామ విభాగంలో మహిళల స్థానం విభిన్న కోణాలలో ప్రస్ఫుటమవుతుంది. వాటిలో జీవిత భాగస్వామి సద్గుణాలు, కుటుంబ నిర్వహణ, అనుబంధాల లోతు వంటి అంశాలు అత్యంత కీలకమైనవి.

గృహస్థ జీవనంలో మహిళలు

కుటుంబ ఆర్థిక వనరులకు తగినట్లుగా ఇంటిని క్రమశిక్షణతో, సమర్థవంతంగా నడిపే మహోన్నత వ్యక్తిగా గృహిణి చిత్రీకరించబడింది.

> *மனைத்தக்க மாண்புடையள் ஆகித்தற் கொண்டான்*
> *வளத்தக்காள் வாழ்க்கைத் துணை. (குறள் 51)*
>
> మనైత్తక్క మాణ్బుడైయళ్ ఆగిత్తఱ్ కొండాన్
> వళత్తకాళ్ వాళ్‌క్కై తుణై.
>
> గృహస్థ ధర్మాలను పాటిస్తూ ఆదాయానికి తగిన విధంగా కుటుంబాన్ని నిర్వహించే స్త్రీ భర్త జీవితానికి తోడూ నీడా అవుతుంది. (కుఱళ్ 51)

అనే కుఱళ్ ద్వారా కుటుంబ వ్యవస్థలో స్త్రీకి ఉన్న బాధ్యతను, మహత్తర స్థానాన్ని వెల్లడించారు. అంతేకాకుండా ఉత్తమ ఇల్లాలు లభించకపోతే ఆ ఇల్లు శోభించదనే సత్యాన్ని:

> *மனைமாட்சி இல்லாள்கண் இல்லாயின் வாழ்க்கை*
> *எனைமாட்சித் தாயினும் இல். (குறள் 52)*
>
> మనైమాట్చి ఇల్లాళ్ కణ్ ఇల్లాయిన్ వాళ్‌క్కై
> ఎనై మాట్చిత్తాయినుం ఇల్.
>
> భార్య గుణవతి కాకపోయినట్లయితే గృహస్థ జీవితం ఎంత చక్కగా సాగినప్పటికీ అందులో ఔన్నత్యం లేదు. (కుఱళ్ 52)

అని నమోదు చేశారు. బాహ్య సంపదలు ఎంత ఉన్నప్పటికీ, కుటుంబ జీవనానికి కావలసిన ఆంతరంగిక సద్గుణాలు లేకపోతే ఆ సంసారానికి పరిపూర్ణత ఉండదనే భావం ఇక్కడ స్పష్టమవుతోంది.

ప్రణయంలో స్త్రీ స్వరం

కామ విభాగంలో నాయిక ప్రేమ, విరహం, వ్యామోహం, తపన, ప్రణయ కలహం వంటి అంతరంగిక మానసిక భావాలు ఒక విశిష్టమైన స్వరంతో ప్రస్ఫుటమవుతాయి. అందువల్ల తిరుక్కుఱళ్‌లో మహిళ కేవలం కుటుంబ బాధ్యతలను మోసే

వ్యక్తిగా మాత్రమే కాకుండా, లోతైన భావోద్వేగాలు, వ్యక్తిగత ఆకాంక్షలు కలిగిన స్వతంత్ర వ్యక్తిగా చిత్రీకరించబడింది. ఈ విభాగం జీవిత భాగస్వామి ఔన్నత్యాన్ని, కుటుంబంలో ఆమె ప్రాముఖ్యతను, ప్రణయ జీవితంలో ఆమె మనోభావాల స్వరూపాన్ని అత్యంత స్పష్టంగా ఆవిష్కరిస్తున్నది.

5.22. తిరుక్కుఱళ్‌లో నిర్వహణ (మేనేజ్‌మెంట్)

'మేనేజ్‌మెంట్' (నిర్వహణ) అనే ఆధునిక పదం నేరుగా తిరుక్కుఱళ్‌లో లేనప్పటికీ, ప్రణాళికా రచన, మానవ వనరుల ఎంపిక, కాలజ్ఞానం, స్థల పరిశీలన, బాధ్యతల అప్పగింత (డెలిగేషన్), నిర్ణయాధికారం, పర్యవేక్షణ వంటి ఎన్నో యాజమాన్య అంశాలను 'పొరుట్పాల్' (అర్థ కాండం) అంతటా విస్తారంగా చూడవచ్చు. ఏ పనిని ప్రారంభించాలన్నా ప్రణాళిక తప్పనిసరి. అయితే నిర్ణయం తీసుకున్న తరువాత సంశయించడం కార్యాచరణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. ఈ దృక్పథాన్ని:

எண்ணித் துணிக கருமம் துணிந்தபின்
எண்ணுவம் என்பது இழுக்கு. (குறள் 467)

ఎణ్ణిత్తుణిగ కరుమం; తుణిన్ద పిన్
ఎణ్ణువం ఎన్బదు ఇళుక్కు.

క్షుణ్ణంగా ఆలోచించిన తరువాతనే పనిలో దిగాలి. పని ప్రారంభించిన తరువాత ఆలోచిద్దామనుకోవడం తగదు. (కుఱళ్ 467)

అనే కుఱళ్ నమోదు చేస్తుంది.

మానవ వనరుల నిర్వహణ (హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్)

సమర్థుడైన వ్యక్తిని ఎంపిక చేసి, బాధ్యతను అప్పగించి, నిర్దేశిత సమయంలో ఆ పనిని పూర్తి చేయించడంలో కీలక పాత్ర మానవ వనరులదే. ఆ మానవ వనరులను ప్రతిభావంతంగా వినియోగించుకోవడమే విజయానికి రాజమార్గం. అటువంటి భావన ఆధునిక నిర్వహణ శాస్త్రంలో అత్యుత్తమమైనదిగా పరిగణించబడుతోంది. ఇటువంటి చింతనలను తిరుక్కుఱళ్ సందర్భానుసారంగా అందించింది. వాటిలో ఒకటి ఈ కుఱళ్:

இதனை இதனால் இவன்முடிக்கும் என்றாய்ந்து
அதனை அவன்கண் விடல். (குறள் 517)

ఇదనై ఇదనాల్ ఇవన్ ముడిక్కుం ఎన్ఱాయ్న్దు
అదనై అవన్ కణ్ విడల్.

ఒకపనిని ఒకడు ఎలాచేసి ముగిస్తాడు అనేది పరీక్షించి తెలుసుకొని దాని తరువాత ఆ పనిని ఆ వ్యక్తికి అప్పగించాలి. (కుఱళ్ 517)

పని యొక్క స్వభావం, దాన్ని పూర్తి చేసే విధానం, ఆ పని చేసే వ్యక్తి నైపుణ్యం — వీటన్నింటినీ సమీక్షించిన పిమ్మటే బాధ్యతను అప్పగించాలి. ఇది సామర్థ్య ఆధారిత పని విభజనకు (స్కిల్-బేస్డ్ టాస్క్ డెలిగేషన్) అత్యుత్తమ ప్రాథమిక సూత్రం.

సమయం, కార్యాచరణ

కాలము, స్థలము ఈ రెండూ ఒక పని విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషిస్తాయి. కాబట్టి కార్యసాధనలో ఈ అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలనే సత్యాన్ని:

> *ஞாலம் கருதினும் கைகூடும் காலம்*
> *கருதி இடத்தாற் செயின். (குறள் 484)*
>
> జాలం కరుదినుం కైకూడుం, కాలం
> కరుది ఇడత్తాల్ సెయిన్.
>
> తగిన సమయం చూసుకొని పరిసరాలను పరిశీలించి కార్యాచరణలో దిగితే లోకమే తన పిడికిలిలోనికి వస్తుంది. (కుఱళ్ 484)

అనే కుఱళ్ విశదీకరిస్తుంది. ఎంతటి మహత్తర లక్ష్యాలైనా సరైన సమయం, సందర్భాన్ని గుర్తించి పనిచేస్తే సిద్ధిస్తాయి. అందువల్ల నిర్వహణలో భౌతిక వనరులు మాత్రమే కాక, కాలం మరియు పరిస్థితులు కూడా విలువైన వనరులే.

తిరుక్కుఱళ్ నిర్వహణా చింతన అనేది: **ప్రణాళికా రచన - పరిశోధన/విశ్లేషణ - సమర్థులైన వారి ఎంపిక - సమయస్ఫూర్తితో కార్యాచరణ - దృఢ సంకల్పంతో పూర్తి చేయడం**. ఉత్తమ నిర్వహణ అంటే ఎక్కువ పనులు గుట్టలుగా పెట్టుకోవడం కాదు; తగిన పనిని, సరైన పద్ధతిలో, సరైన సమయానికి నెరవేర్చడమే.

5.23. ప్రపంచ భాషల్లో తిరుక్కుఱళ్

తిరుక్కుఱళ్ తమిళ భాషలో ఆవిర్భవించినప్పటికీ, దాని మూల సిద్ధాంతాలు మానవ జీవితానికి సంబంధించిన సార్వజనీన ప్రశ్నలను స్పృశిస్తాయి. ధర్మం, ప్రేమ, న్యాయం, స్నేహం, పాలన, విద్య, శ్రమ, కుటుంబం, ప్రణయం వంటి అంశాలు ప్రపంచ మానవాళి అందరికీ సమానమైనవి. అందుకే తిరుక్కుఱళ్ 'విశ్వవేదం' (ఉలగ పొదుమఱై)గా కొనియాడబడుతోంది. వివిధ భాషల ప్రజలు దీనిని తమతమ భాషల్లోకి అనువదించుకోవడానికి ప్రధాన కారణం అందులోని విశ్వజనీన భావాలే.

విద్య మనిషిని దేశం, ప్రాంతం, భాష మొదలైన సంకుచిత సరిహద్దులను అధిగమించేలా చేస్తుంది. అదేవిధంగా తిరుక్కుఱళ్ కూడా అనువాదాల ద్వారా తన మూలభాషా సరిహద్దులను దాటి వివిధ దేశాల ప్రజలకు సన్నిహితమైంది.

తిరుక్కుఱళ్‌ను అనువదించడం అంటే కేవలం పదాలను మార్చడం మాత్రమే కాదు. రెండే రెండు పాదాలలో నిక్షిప్తమైన ఆ భావ సాంద్రతను, ఉపమానాలను, వ్యాకరణ చట్రాన్ని, సాంస్కృతిక ఔచిత్యాన్ని మరొక భాషలోకి తీసుకువెళ్లడం ఒక

గొప్ప సవాలు. అందువల్ల ప్రతి అనువాదం మూలభాషకు మరియు నూతన భాషా సంస్కృతికి మధ్య నిర్మించబడే ఒక సాంస్కృతిక వారధి వంటిది.

తిరుక్కుఱళ్ సార్వత్రిక ప్రాముఖ్యత కేవలం దాని అనువాదాల సంఖ్య ద్వారానే నిర్ణయించబడదు. మానవ జీవితపు మౌలిక ప్రశ్నలకు అత్యంత సంక్షిప్తంగా సమాధానం అందిస్తున్న విధానమే దాని విస్తృత ఆదరణకు ముఖ్య కారణం.

"ఉత్తమ మానవుడిగా ఎలా జీవించాలి?", "అధికారాన్ని ఎలా వినియోగించాలి?", "సంపద పరమార్థం ఏమిటి?", "స్నేహం ఎలా ఉండాలి?", "ఇతరులకు కీడు చేయకుండా ఎలా బతకాలి?" మొదలైన ప్రశ్నలు దేశ కాల భాషలకు అతీతంగా సకల మానవాళికీ వర్తిస్తాయి.

తిరుక్కుఱళ్ భారతీయ భాషలు, యూరోపియన్ భాషలు, ఆగ్నేయాసియా భాషలు మొదలైన అనేక ప్రపంచ భాషల్లోకి అనువదించబడటమే 'తిరుక్కుఱళ్' విశ్వవేదం అనడానికి నిదర్శనం. దీని ద్వారా తిరుక్కుఱళ్ అనువాదాలు తమిళ భాషకు మరియు ఇతర భాషా సంస్కృతులకు మధ్య మేధోపరమైన, సాంస్కృతిక మార్పిడిగా నిలిచాయి.

తిరుక్కుఱళ్ తమిళ జాతి సిరిసంపదగా పుట్టి, అనువాదాల ద్వారా సమస్త మానవ సమాజంతో సంభాషించే మహోన్నత గ్రంథంగా ఎదిగింది. దాని ప్రపంచ ప్రస్థానపు బలం దాని కుఱళ్ అనే చిన్న ఛందోరూపంలో మాత్రమే లేదు; ఆ సంక్షిప్త రూపంలో ఇమిడి ఉన్న అనంతమైన మానవతావాదంలో ఉంది. భాషలు మారినా ప్రేమ, ధర్మం, న్యాయం, మానవత్వాల ఆవశ్యకత మారదు. ఆ సార్వత్రిక మానవీయ స్వభావమే తిరుక్కుఱళ్‌ను దేశ, భాష సరిహద్దులను అధిగమించి నిరంతరం ప్రయాణించేలా చేస్తోంది.

ఈ 'వాన్మఴై వళ్లువం' (దివ్యవాణి వళ్లువం) అనే అధ్యాయంలో విశ్వవేదమైన తిరుక్కుఱళ్ ప్రబోధించిన అంశాలను తెలుసుకున్నాము. తదుపరి విభాగంలో 'కుఱళ్ మణిమాల' ద్వారా తిరుక్కుఱళ్ భావాలను అధ్యయనం చేద్దాం.

అధ్యాయం 6

కుఱళ్ మణిమాల

తిరుక్కుఱళ్‌లోని ధర్మ విభాగం, అర్థ విభాగంల నుండి ఒక్కో అధ్యాయానికి ఒక్కొక్క కుఱళ్ చొప్పున సేకరించి ఈ 'కుఱళ్ మణిమాల' రూపొందించబడింది. రోజుకొక కుఱళ్ చొప్పున పఠిస్తే త్రివర్గాలనూ సమగ్రంగా అధ్యయనం చేయవచ్చు.

1. அறத்துப்பால்

అఱత్తుప్పాల్ - ధర్మ విభాగం

1. கடவுள் வாழ்த்து

కడవుళ్ వాళ్‌త్తు - ప్రార్థన

அகர முதல எழுத்தெல்லாம் ஆதி
பகவன் முதற்றே உலகு. (குறள் 1)

అగర ముదల ఎళుత్తెల్లాం ఆది
బగవన్ ముదట్రే ఉలగు.

అక్షరాలన్నింటికీ అకారమే ఆది. అదే విధంగా ఈ ప్రపంచానికి భగవంతుడే ఆద్యుడు. (కుఱళ్ 1)

2. வான்சிறப்பு

వాన్‌సిఱప్పు - వర్ష ప్రశంస

வான்நின்று உலகம் வழங்கி வருதலால்
தான்அமிழ்தம் என்றுணரல் பாற்று. (குறள் 11)

వాన్‌నిన్ఱు ఉలగం వళ్‌ంగి వరుదలాల్
తాన్ అమిళ్‌దం ఎన్ఱణరల్ పాట్రు.

వర్షం వలన ప్రపంచం వర్ధిల్లుతున్నది. అందువలన ప్రపంచంలోని జీవరాశులకు అది అమృతమని గ్రహించాలి. (కుఱళ్ 11)

3. நீத்தார் பெருமை

నీత్తార్ పెరుమై - యతి మహత్వం

அந்தணர் என்போர் அறவோர்மற் றெவ்வுயிர்க்கும்
செந்தண்மை பூண்டொழுக லான். (குறள் 30)

అన్దణర్ ఎన్బోర్ అఱవోర్ మట్రెవ్వుయిర్కుం
సెన్దణ్మై పూణ్డు ఒళుగ లాన్.

సకల జీవరాశిని ప్రేమించి కరుణామృతాన్ని వర్షించే ధర్మాత్ములైన పెద్దలు ఎవరైనప్పటికీ వారు బ్రాహ్మణులు అని పిలువబడుతారు. (కుఱళ్ 30)

4. అరన్ వలియుఱుత్తల్

అఱన్ వలియుఱుత్తల్ - ధర్మం ఆవశ్యకత

అన్ఱివాం ఎన్నాదు అఱంచెయ్క మఱ్ఱదు
పొన్ఱుంగాల్ పొన్ఱాత్ తుణై. (குறள் 36)

అన్ఱివాం ఎన్నాదు అఱం చెయ్గ, మఱ్ఱదు
పొన్ఱుంగాల్ పొన్ఱా త్తుణై.

`తరువాత చేసుకోవచ్చులే' - అని వాయిదా వేయకుండా యువకులు ధర్మ మార్గంలో ప్రవర్తించాలి. మరణ సమయంలో ఆ ధర్మమే అతనికి తోడుగా ఉంటుంది. (కుఱళ్ 36)

5. ఇల్వాళ్క్కై

ఇల్వాళ్క్కై - గార్హస్థ్యం

వైయత్తుళ్ వాళ్వాంగు వాళ్బవన్ వాన్ఉఱైయుం
తెయ్వత్తుళ్ వైక్క ప్పడుం. (குறள் 50)

వైయత్తుళ్ వాళ్వాంగు వాళ్బవన్ వాన్ ఉఱైయుం
దెయ్వత్తుళ్ వైక్క ప్పడుం.

ధర్మమార్గంలో సంచరిస్తూ గృహస్థ జీవితాన్ని సాగించే వ్యక్తి ఆ దైవానికి సమానంగా గౌరవింపబడుతున్నాడు. (కుఱళ్ 50)

6. వాళ్క్కైత్ తుణైనలం

వాళ్క్కై తుణైనలం - సహధర్మచారిణి

మంగలం ఎన్ప మనైమాట్చి మఱ్ఱదన్
నన్గలం నన్మక్కట్ పేఱు. (குறள் 60)

మంగలం ఎన్ప మనై మాట్చి; మఱ్ఱదన్
నన్గలం నన్మక్కట్ పేఱు.

భార్య సౌశీల్యమే గృహస్థ జీవితానికి ముఖ్యమైనది. మంచి సంతానాన్ని పొందడమే దానికి ఆభరణాలని చెబుతారు. (కుఱళ్ 60)

7. మక్కట్పేఱు

మక్కట్పేఱు - సంతాన భాగ్యం

కుழలినిదు యాழినిదు ఎన్బదం మక్కళ్
మழలైచ్చొల్ కేళా దవర్. (குறள் 66)

కుழలినిదు యాழినిదు ఎన్బతం మక్కళ్
మழలై చ్చొల్ కేళా దవర్.

తమ కన్నబిడ్డల తొక్కుడు పలుకులు వినలేనివారు మాత్రమే వేణుగానం, యాళివాయిద్యనాదం మధురమని చెబుతారు. (కుఱళ్ 60)

8. அன்புடைமை

అన్బుడైమై - ప్రేమ

அன்பிலார் எல்லாம் தமக்குரியர் அன்புடையார்
என்பும் உரியர் பிறர்க்கு. (குறள் 72)

అన్బిలార్ ఎల్లాం తమక్కురియర్; అన్బుడైయార్
ఎన్బుం ఉరియర్ పిఱర్కు.

ప్రేమలేనివారు ప్రతివస్తువూ తమకే కావాలని, దాన్ని స్వంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ప్రేమగలవారు తమ శరీరం, వస్తువులు, ప్రాణం అన్నీ పరోపకారార్థమే అని భావిస్తారు. . (కుఱళ్ 72)

9. விருந்தோம்பல்

విరుందోంబల్ - అతిథి సత్కారం

மோப்பக் குழையும் அனிச்சம் முகம்திரிந்து
நோக்கக் குழையும் விருந்து. (குறள் 90)

మోప్ప క్కుళైయుం అనిచ్చం, ముగమ్ తిరిన్దు
నోక్క క్కుళైయుం విరున్దు.

`అనిచ్చం' అనే పుష్పాన్ని వాసన చూసిన వెంటనే అది వాడిపోతుంది. అదే విధంగా ముఖాన్ని చిట్లించుకొని ఆహ్వానిస్తే అతిథుల మొహం వాడిపోతుంది. . (కుఱళ్ 90)

10. இனியவை கூறல்

ఇనియవై కూఱల్ - మధుర భాషణం

இனிய உளவாக இன்னாத கூறல்
கனியிருப்பக் காய்கவர்ந் தற்று. (குறள் 100)

ఇనియ ఉళవాగ ఇన్నాద కూఱల్
కని యిరుప్ప క్కాయ్ కవర్ న్దట్రు.

మధురములైన మాటలు ఎన్నో ఉన్నపుడు వాటిని వదలి కఠినంగా మాట్లాడ్డం తీయని పండును వదలి పచ్చికాయను తినడానికి సమ మవుతుంది. (కుఱళ్ 100)

11. செய்ந்நன்றி அறிதல்

సెయ్న్నన్ఱి అఱిదల్ - కృతజ్ఞత

செய்யாமல் செய்த உதவிக்கு வையகமும்
வானகமும் ஆற்றல் அரிது. (குறள் 101)

సెయ్యామల్ సెయ్‌ద ఉదవిక్కు వైయగముం
వానగముం ఆట్రల్ అరిదు.

తాను ఏ సహాయమూ పూర్వం చేయకపోయినప్పటికీ ఒక వ్యక్తి తనకు సహాయం చేసినట్లయితే ఆ సహాయానికి స్వర్గమర్త్యలోకాలు ఇచ్చినప్పటికీ సమానంకావు. (కుఱళ్ 101)

12. நடுவுநிலைமை

నడువు నిలైమై - సమస్థితి

வாணிகம் செய்வார்க்கு வாணிகம் பேணிப்
பிறவும் தமபோல் செயின். (குறள் 120)

వాణిగం సెయ్‌వార్కు వాణిగం పేణి
ప్పిఱవుం తమ్‌పోల్ సెయిన్.

ఇతరుల వస్తువులైనప్పటికీ వాటిని తన వస్తువులుగా భావించి సమదృష్టితో వర్తకం చేయడమే నిజమైన వర్తక నీతి అవుతుంది. (కుఱళ్ 120)

13. அடக்கமுடைமை

అడక్కముడైమై - వినయం

தீயினால் சுட்டபுண் உள்ளாறும் ஆறாதே
நாவினால் சுட்ட வடு. (குறள் 129)

తీయినాల్ సుట్టపుణ్ ఉళ్లాఱుం ఆఱాదే
నావినాల్ సుట్ట వడు.

అగ్ని సోకినందువలన ఏర్పడిన పుండు మచ్చగా బయట ఉన్నప్పటికీ లోపల మానిపోయి ఉంటుంది. అయితే ద్వేషంతో పలికిన మాటలవలన కలిగే గాయం ఎన్నటికీ ఆరదు. (కుఱళ్ 129)

14. ஒழுக்கமுடைமை

ఒళుక్కముడైమై - సత్ప్రవర్తన

ஒழுக்கம் விழுப்பம் தரலான் ஒழுக்கம்
உயிரினும் ஓம்பப் படும். (குறள் 131)

ఒళుక్కం విళుప్పం తరలాన్ ఒళుక్కం
ఉయిరినుం ఓమ్బ ప్పడుం.

సత్ప్రవర్తన పదిమందిలో గౌరవాన్ని కలిగిస్తుంది. అందువలన సత్ప్రవర్తన ప్రాణంకన్న మిన్నగా ప్రశంసింపబడుతుంది. (కుఱళ్ 131)

15. பிறனில் விழையாமை

పిఱనిల్ విళైయామై - పర సతీ వైముఖ్యం

பிறன்மனை நோக்காத பேராண்மை சான்றோர்க்கு
அறனொன்றோ ஆன்ற ஒழுக்கு. (குறள் 148)

పిఱన్ మనై నోక్కాద పేరాణ్మై శాన్తోర్కు
అఱనొన్తో ఆన్ఱ ఒళుక్కు.

వేరొకరి భార్యను కామ దృష్టితో చూడని ఉత్కృష్ట గుణం ధర్మమార్గం మాత్రమే కాదు అది సత్ప్రవర్తనకు శిఖరం కూడ. (కుఱళ్ 148)

16. பொறையுடைமை

పొఱైయుడైమై - సహనం

பொறுத்தல் இறப்பினை என்றும் அதனை
மறத்தல் அதனினும் நன்று. (குறள் 152)

పొఱుత్తల్ ఇఱప్పినై ఎన్ఱుం అదనై
మఱత్తల్ అదనినుం నన్ఱు.

చెప్పలేనంత చెరుపు చేసినప్పటికీ దానిని సహించి ఉండడం కన్న ఆ చెరుపును పూర్తిగా మరిచి పోవడమే ఉత్తమ గుణం. (కుఱళ్ 152)

17. அழுக்காறாமை

అళుక్కాఱామై - ఈర్ష్య

ஒழுக்காறாக் கொள்க ஒருவன்தன் நெஞ்சத்து
அழுக்காறு இலாத இயல்பு. (குறள் 161)

ఒళుక్కాఱా క్కొళ్గ ఒరువన్ తన్ నెంజత్తు
అళుక్కాఱు ఇలాద ఇయల్బు.

హృదయంలో మాత్సర్యం లేకుండా జీవనం సాగించే స్వభావమే సచ్ఛీలమని భావించాలి. (కుఱళ్ 161)

18. வெஃகாமை

వెగ్గామై - లోభం

அஃகாமை செல்வத்திற்கு யாதெனின் வெஃகாமை
வேண்டும் பிறன்கைப் பொருள். (குறள் 178)

అగ్గామై సెల్వత్తిఱ్కు యాదెనిన్ వెగ్గామై
వేణ్డుం పిఱన్కై ప్పొరుళ్.

తన సంపద తరిగిపోకుండా ఉండాలనుకునేవాడు ఇతరుల వస్తువులను ఆక్రమించు కోవాలని ఆశించకూడదు. (కుఱళ్ 178)

19. புறங்கூறாமை

పుఱంగూఱామై - చాటున నిందించడం

ஏதிலார் குற்றம்போல் தம்குற்றம் காண்கிற்பின்
தீதுண்டோ மன்னும் உயிர்க்கு. (குறள் 190)

ఏదిలార్ కుట్రంపోల్ తంకుట్రం కాణ్గిఱ్ పిన్
తీదుణ్డో మన్నుం ఉయిర్కు.

ఇతరుల దోషాలను లెక్కించేవాళ్లు తమ దోషాలను కూడ లెక్కించి చూడగలిగి నట్లయితే వాళ్లకు కష్టాలు ఎన్నటికీ కలగవు. (కుఱళ్ 190)

20. பயனில சொல்லாமை

పయనిల సొల్లామై - వ్యర్థ భాషణం

சொல்லுக சொல்லில் பயனுடைய சொல்லற்க
சொல்லில் பயனிலாச் சொல். (குறள் 200)

సొల్లుగ సొల్లిల్ పయనుడైయ; సొల్లఱ్కు
సొల్లిల్ పయనిలా చ్చొల్.

ప్రయోజన రహితములైన మాటలను పరిహరించి ప్రయోజనం కలిగించే మాటలనే మాట్లాడాలి. (కుఱళ్ 200)

21. தீவினையச்சம்

తీవినైయచ్చం - పాప భీతి

தீயவை தீய பயத்தலால் தீயவை
தீயினும் அஞ்சப் படும். (குறள் 202)

తీయవై తీయ పయత్తలాల్ తీయవై
తీయినుం అంజ ప్పడుం.

పాప కర్మల వలన పాపమే కలుగుతుంది. అందువలన ఆ పనులు నిప్పు కన్న భయంకరమైనవని భావించి వాటిని చేయడానికి భయపడాలి. (కుఱళ్ 202)

22. ஒப்புரவறிதல்

ఒప్పురవఱిదల్ - ఉపకారం

கைம்மாறு வேண்டா கடப்பாடு மாரிமாட்டு
என்னாற்றும் கொல்லோ உலகு. (குறள் 211)

కైమ్మాఱు వేణ్డా కడప్పాడు; మారిమాట్టు
ఎన్నాట్టుం కొల్లో ఉలగు.

తమకు ఉపకారం చేస్తున్న వర్షానికి ప్రజలు ప్రత్యుపకారం ఏం చేస్తున్నారు? ఆ వర్షాన్ని పోలిన పెద్దలు ప్రత్యుపకారాన్ని ఆశించి సహాయం చేసేవాళ్లు కారు. (కుఱళ్ 211)

23. ஈகை

ఈగై - దానగుణం

அற்றார் அழிபசி தீர்த்தல் அஃதொருவன்
பெற்றான் பொருள்வைப் புழி. (குறள் 226)

అట్రార్ అళిపసి తీర్తల్; అద్దొరువన్
పెట్రాన్ పొరుళ్వై ప్పుళి.

ఆకలి అని వచ్చేవారి ఆకలిబాధను పోగొట్టాలి. అది భవిష్యత్కాలంలో తనకు ఉపకరించడం కోసం కూడబెట్టిన నిధి అవుతుంది. (కుఱళ్ 226)

24. புகழ்

పుగళ్ - కీర్తి

ஈதல் இசைபட வாழ்தல் அதுவல்லது
ஊதியம் இல்லை உயிர்க்கு. (குறள் 231)

ఈదల్; ఇశైపడ వాళ్దల్ అదువల్లదు
ఊదియం ఇల్లై ఉయిర్కు.

దానం చేస్తూ కీర్తి ప్రతిష్టలతో జీవించాలి. దానికి మించిన ప్రయోజనం మానవజాతికి వేరేదీలేదు. (కుఱళ్ 231)

25. அருளுடைமை

అరుళుడైమై - దయ

அருட்செல்வம் செல்வத்துள் செல்வம் பொருட்செல்வம்
பூரியார் கண்ணும் உள. (குறள் 241)

అరుట్చెల్వం సెల్వత్తుళ్ సెల్వం; పొరుట్ చెల్వం
పూరియార్ కణ్ణుం ఉళ.

క్రూరాత్ములైన దుర్మార్గుల దగ్గర కూడ అశేషమైన సంపద ఉంది. కాని ఆ సంపద దయా సంపదకు సమానం కాదు. (కుఱళ్ 241)

26. புலால் மறுத்தல்

పులాల్ మఱుత్తల్ - మాంస విసర్జనం

கொல்லான் புலாலை மறுத்தானைக் கைகூப்பி
எல்லா உயிரும் தொழும். (குறள் 260)

కొల్లాన్ పులాలై మఱుత్తానై క్కైకూప్పి
ఎల్లా ఉయిరుం తొళుం.

మాంసం తినని వాళ్లను, మాంసం కోసం ప్రాణులను చంపని వాళ్లను సకల జీవరాశులు నమస్కరించి ఆశీర్వదిస్తాయి. (కుఱళ్ 260)

27. தவம்

తవం - తపస్సు

உற்றநோய் நோன்றல் உயிர்க்குஉறுகண் செய்யாமை
அற்றே தவத்திற்கு உரு. (குறள் 261)

ఉట్రనోయ్ నోన్టల్ ఉయిర్క్కు ఉఱుకణ్ సెయ్యామై
అట్రే తవత్తిఱ్కు ఉరు.

దేనినైనా భరించే హృదయాన్ని కలిగి ఉండడం, ఏ ప్రాణికీ హాని తలపెట్టకుండా ఉండడం `తపస్సు' అని చెప్పబడుతుంది. (కుఱళ్ 261)

28. கூடாவொழுக்கம்

కూడావొళుక్కం - దుష్ప్రవర్తన

வலியில் நிலைமையான் வல்லுருவம் பெற்றம்
புலியின்தோல் போர்த்துமேய்ந் தற்று. (குறள் 273)

వలియిల్ నిలైమైయాన్ వల్లురువం పెట్రం
పులియిన్తోల్ పోర్తుమేయ్న్ దట్రు.

మనసును అణచుకోలేనివారు తపోవేషం ధరించడం ఆవు పులితోలు కప్పుకొని పైరు మేయడంతో సమానం. (కుఱళ్ 273)

29. கள்ளாமை

కళ్లామై - దొంగతనం

எள்ளாமை வேண்டுவான் என்பான் எனைத்தொன்றும்
கள்ளாமை காக்கதன் நெஞ்சு. (குறள் 281)

ఎళ్లామై వేణ్డువాన్ ఎన్బాన్ ఎనైత్తొన్ఱుం
కళ్లామై కాక్కదన్ నెంజు.

ఏ వస్తువునైనా అపహరిద్దామనే ఆలోచన హృదయంలో రాకుండా చూసుకునేవాడే నవ్వులపాలు కాకుండా జీవనం సాగించగలడు. (కుఱళ్ 281)

30. வாய்மை

వాయ్మై - సత్యం

வாய்மை எனப்படுவது யாதெனின் யாதொன்றும்
தீமை இலாத சொலல். (குறள் 291)

వాయ్మై ఎనప్పడువదు యాదు ఎనిన్ యాదొన్ఱుం
తీమై ఇలాద సొలల్.

ఇతరులకు కించిత్తయినా కీడుకలిగించని మాటలు మాట్లాడమే సత్యమని చెప్పబడుతుంది. (కుఱళ్ 291)

31. వెకులామై

వెగుళామై - కోపం

தன்னைத்தான் காக்கின் சினம்காக்க காவாக்கால்
தன்னையே கொல்லும் சினம். (குறள் 305)

తన్నై త్కాన్ కాక్కిన్ సినంగాక్క; కావాక్కాల్
తన్నైయే కొల్లుం సినం.

ఒకడు తన్ను తాను సంరక్షించుకోవాలనుకుంటే మొదట కోపాన్ని వదలుకోవాలి. లేకపోతే ఆ కోపమే అతన్ని నాశనం చేస్తుంది. (కుఱళ్ 305)

32. இன்னா செய்யாமை

ఇన్నా సెయ్యామై - అపకారం

இன்னாசெய் தாரை ஒறுத்தல் அவர்நாண
நன்னயம் செய்து விடல். (குறள் 314)

ఇన్నాసెయ్ దారై ఒఱుత్తల్ అవర్ నాణ
నన్నయం సెయ్దు విడల్.

తమకు కీడుచేసిన వారిని దండించడానికి సరియైన పద్ధతి అతడు సిగ్గుతో తలవంచుకునేలే అతనికి మేలుచేయాలి. అతడు చేసిన అపకారాన్ని వెంటనే మరచిపోవాలి. (కుఱళ్ 314)

33. கொல்லாமை

కొల్లామై - అహింస

பகுத்துண்டு பல்லுயிர் ஓம்புதல் நூலோர்
தொகுத்தவற்றுள் எல்லாம் தலை. (குறள் 322)

పగుత్తుణ్డు పల్లుయిర్ ఓమ్బుదల్ నూలోర్
తొగుత్తవట్రుళ్ ఎల్లాం తలై.

లభించిన దానిని అందరితో కలసి పంచుకొని ప్రాణులను రక్షించడం అనేది ధర్మశాస్త్రజ్ఞులు చెప్పిన ధర్మాలన్నింటిలోనూ మేలైనది. (కుఱళ్ 322)

34. நிலையாமை

నిలైయామై - అస్థిరత

நெருநல் உளனொருவன் இன்றில்லை என்னும்
பெருமை உடைத்திவ் வுலகு. (குறள் 336)

నెరునల్ ఉళనొరువన్ ఇన్ఱిలై ఎన్నుం
పెరుమై ఉడైత్తి వ్వులగు.

నిన్న ప్రాణాలతో ఉన్న వ్యక్తిని నేడు లేకుండా చేశామనే గర్వాన్ని ఒక ప్రశస్తిగా ఈ లోకం కలిగి ఉంది. (కుఱళ్ 336)

35. துறவு

తుఱవు - త్యాగం

பற்றுக பற்றற்றான் பற்றினை அப்பற்றைப்
பற்றுக பற்று விடற்கு. (குறள் 350)

పట్రుగ పట్రట్రాన్ పట్రినై; అప్పుట్రై
ప్పట్రుగ పట్రు విడఱ్కు.

బంధాలకు అతీతుడైన భగవంతునిపై మాత్రమే భక్తి శ్రద్ధలు కలిగి ఉండాలి. బంధాలను తెంచుకోవడానికి అతనిపై పెట్టుకొన్న భక్తియే సహాయం చేస్తుంది. (కుఱళ్ 350)

36. மெய்யுணர்தல்

మెయ్యుణర్తల్ - నిజతత్వం

எப்பொருள் எத்தன்மைத்து ஆயினும் அப்பொருள்
மெய்ப்பொருள் காண்பது அறிவு. (குறள் 355)

ఎప్పొరుళ్ ఎత్తన్మైత్తు ఆయినుం అప్పొరుళ్
మెయ్ప్పొరుళ్ కాణ్బదు అఱివు.

ఒక వస్తువు ఎలా కనిపించినప్పటికీ ఆకారాన్ని చూసి మోసపోకుండా దాని నిజ స్థితిని తెలుసుకోవడమే నిజతత్వం. అదే జ్ఞానంగా భావింపబడుతుంది. (కుఱళ్ 355)

37. அவாவறுத்தல்

అవావఱుత్తల్ - కోరికలు

அவாஎன்ப எல்லா உயிர்க்கும்எஞ் ஞான்றும்
தவாஅப் பிறப்பீனும் வித்து. (குறள் 361)

అవాఎన్బఎల్లా ఉయిర్కుం ఎంజాన్ఱుం
తవా అప్పిఱప్పీనుం విత్తు.

ప్రాణులన్నింటికీ అన్ని కాలాల్లోనూ జన్మ అనే దుఃఖం ఏర్పడ్డానికి కోరికయే విత్తుగా ఉందని చెబుతారు. (కుఱళ్ 361)

38. ஊழ்

ఊళ్ - విధి

ஊழின் பெருவலி யாவுள மற்றொன்று
சூழினும் தான்முந் துறும். (குறள் 380)

ఊళిన్ పెరువలి యావుళ? మఱ్ఱొన్ఱు
సూళినుం తాన్ మున్దుఱుం.

విధికంటె బలీయమైంది వేరొకటుందా? విధిని తప్పించుకోవడానికి వేరొక ఉపాయాన్ని ఆలోచిస్తే అక్కడకూడ విధి ముందుగా వచ్చి నిలుస్తున్నది. (కుఱళ్ 380)

2. பொருட்பால்

పొరుట్పాల్ - అర్థ విభాగం

39. இறைமாட்சி

ఇఱైమాట్చి - రాజార్హత

முறைசெய்து காப்பாற்றும் மன்னவன் மக்கட்கு
இறையென்று வைக்கப் படும். (குறள் 388)

ముఱైసెయ్దు కాప్పాట్రుం మన్నవన్ మక్కట్కు
ఇఱై యెన్ఱు వైక్క ప్పడుం.

నీతిమార్గం తప్పక పరిపాలన సాగిస్తూ ప్రజలను సంరక్షించే రాజును మాత్రమే ప్రజానాయకుడని ప్రశంసిస్తారు. (కుఱళ్ 388)

40. கல்வி

కల్వి - విద్య

கற்க கசடறக் கற்பவை கற்றபின்
நிற்க அதற்குத் தக. (குறள் 391)

కఱ్క కశడఱ క్కఱ్పవై; కట్రపిన్
నిఱ్క అదఱ్కు త్తగ.

నేర్చుకోవలసిన వాటిని క్షుణ్ణంగా అంటే దోషరహితంగా నేర్చుకోవాలి. నేర్చుకొన్న తరువాత ఆ విద్యకు అనుగుణంగా నడుచుకోవాలి. (కుఱళ్ 391)

41. கல்லாமை

కల్లామై - విద్యా విహీనత

விலங்கொடு மக்கள் அனையர் இலங்குநூல்
கற்றாரோடு ஏனை யவர். (குறள் 410)

విలంగొడు మక్కళ్ అనైయర్ ఇలంగునూల్
కట్రారోడు ఏనై యవర్.

మానవులకు జంతువులకు మధ్య ఏం భేదం ఉందో అంతే భేదం జ్ఞానాన్నిచ్చే గ్రంథాలు చదివినవారికి, ఆ గ్రంథాలు చదవని వారికి మధ్య ఉంది. (కుఱళ్ 410)

42. கேள்வி

కేళ్వి - శ్రుతజ్ఞానం

செல்வத்துள் செல்வம் செவிச்செல்வம் அச்செல்வம்
செல்வத்துள் எல்லாம் தலை. (குறள் 411)

సెల్వత్తుళ్ సెల్వం సెవిచ్చెల్వం; అచ్చెల్వం
సెల్వత్తుళ్ ఎల్లాం తలై.

వినికిడి ద్వారా సంపాదించిన జ్ఞానసంపదయే అన్ని సంపదలకన్న మిన్నయైనది. (కుఱళ్ 411)

43. అறிவுடைமை

అఱివుడైమై - జ్ఞానం

எப்பொருள் யார்யார்வாய்க் கேட்பினும் அப்பொருள்
மெய்ப்பொருள் காண்பது அறிவு. (குறள் 423)

ఎప్పొరుళ్ యార్యార్ వాయ్ క్కేట్పినుం అప్పొరుళ్
మెయ్ప్పొరుళ్ కాణ్బదు అఱివు.

ఏ ఒక్క విషయాన్ని గురించి ఎవరు ఏది చెప్పినప్పటికీ దానిని అలాగే గుడ్డిగా విశ్వసించక దాని నిజతత్వాన్ని పరిశోధించి తెలుసుకోవడమే జ్ఞానం. (కుఱళ్ 423)

44. குற்றங்கடிதல்

కుట్రంకడిదల్ - దోష నివారణ

தன்குற்றம் நீக்கிப் பிறர்குற்றம் காண்கிற்பின்
என்குற்றம் ஆகும் இறைக்கு. (குறள் 436)

తన్ కుట్రం నీక్కి ప్పిఱర్కుట్రం కాణ్గిఱ్ పిన్
ఎన్కుట్రమ్ ఆగుం ఇఱైక్కు?

మొదట తనలోని దోషాలను తొలగించుకొని దాని తరువాత ఇతరుల దోషాలను ఎత్తిచూపే నాయకుడికి ఏం కొరత? (కుఱళ్ 436)

45. பெரியாரைத் துணைக்கோடல்

పెరియారై తుణైక్కోడల్ - పెద్దలతో మైత్రి

இடிப்பாரை இல்லாத ஏமரா மன்னன்
கெடுப்பார் இலானும் கெடும். (குறள் 448)

ఇడిప్పారై ఇల్లాద ఏమరా మన్నన్.
కెడుప్పార్ ఇలానుం కెడుం.

కఠినంగా మందలించి దోషాలను ఎత్తిచెప్పి హితము చెప్పే పెద్దలు లేకపోయినట్లయితే శత్రువులు ఎవరూ లేకపోయినప్పటికీ అతడు నశించిపోతాడు. (కుఱళ్ 448)

46. சிற்றினம் சேராமை

సిట్రినమ్ సేరామై - దుష్టులకు దూరం

நிலத்தியல்பால் நீர்திரிந்து அற்றாகும் மாந்தர்க்கு
இனத்தியல்ப தாகும் அறிவு. (குறள் 452)

నిలత్తియల్బాల్ నీర్ తిరిన్దు ఆట్రాగుం మాన్దర్కు
ఇనత్తియల్బదాగుం అఱివు.

ఆ యా నేలల స్వభావానికి తగినట్లు నీటి రంగు మారుతుంటుంది. అదే విధంగా ప్రజల వివేకం తాము చేరిన సమూహాన్ని బట్టి రూపొందుతుంది. ((కుఱళ్ 452)

47. తెరిన్దు సెయల్‌వగై

తెరిందు సెయల్‌వగై - తెలుసుకొని చేయడం

எண்ணித் துணிக கருமம் துணிந்தபின்
எண்ணுவம் என்பது இழுக்கு. (குறள் 467)

ఎణ్ణిత్తుణిగ కరుమం; తుణిన్ద పిన్
ఎణ్ణువం ఎన్బదు ఇళుక్కు.

క్షుణ్ణంగా ఆలోచించిన తరువాతనే పనిలో దిగాలి. పని ప్రారంభించిన తరువాత ఆలోచిద్దామనుకోవడం తగదు. (కుఱళ్ 467)

48. వలియఱిదల్

వలియఱిదల్ - స్వశక్తి

வினைவலியும் தன்வலியும் மாற்றான் வலியும்
துணைவலியும் தூக்கிச் செயல். (குறள் 471)

వినైవలియుం తన్ వలియుం మాట్రాన్ వలియుం
తుణైవలియుం తూక్కి చ్చెయల్.

ఒక పని చేయడానికి ముందు ఆ పనికి కావలసిన శక్తి, తనశక్తి, శత్రువుల శక్తి, ఇరువురికీ తోడుగా ఉండే వారి శక్తి మొదలైనవి పరిశీలించిన తరువాతనే పనిలో ప్రవేశించాలి. (కుఱళ్ 471)

49. కాలమఱిదల్

కాలమఱిదల్ - కాలం విలువ

கொக்கொக்க கூம்பும் பருவத்து மற்றதன்
குத்தொக்க சீர்த்த இடத்து. (குறள் 490)

కొక్కొక్క కూంబుం పరువత్తు; మట్రదన్
కుత్తొక్క సీర్త ఇడత్తు.

కాలం సానుకూలమయ్యేంతవరకూ కొంగవలె వేచియుండాలి. సరియైన కాలం ఆసన్నమైనపుడు కొంగ గురితప్పకుండా ముక్కుతో పొడిచి ఎరను నోట కరచుకొన్నట్లు పని ముగించాలి. (కుఱళ్ 490)

50. இடனறிதல்

ఇడనఱిదల్ - స్థాన బలం

நெடும்புனலுள் வெல்லும் முதலை அடும்புனலின்
நீங்கின் அதனைப் பிற. (குறள் 495)

నెడుం బునలుళ్ వెల్లుం ముదలై; అడుం బునలిన్
నీంగిన్ అదనై ప్పిఱ.

నీళ్లలో ఉన్నంతవరకే మొసలికి బలం. నీటి నుండి బయటకు వచ్చినట్లయితే ఒక సాధారణ జంతువు కూడ దానిని గాయపరుస్తుంది. (కుఱళ్ 495)

51. தெரிந்து தெளிதல்

తెరిందు తెళిదల్ - ఎంపికలో విజ్ఞత

குணம்நாடிக் குற்றமும் நாடி அவற்றுள்
மிகைநாடி மிக்க கொளல். (குறள் 504)

గుణం నాడి కుట్రముం నాడి అవట్రుళ్
మిగై నాడి మిక్క కొళల్.

ఒకరి గుణాలను దోషాలను పరిశీలించి వాటిలో ఏవి అధికంగా ఉన్నాయో తెలుసుకొని దానితరువాత అతని గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకోవాలి. (కుఱళ్ 504)

52. தெரிந்து வினையாடல்

తెరిందు వినైయాడల్ - కార్యనిర్దేశం

இதனை இதனால் இவன்முடிக்கும் என்றாய்ந்து
அதனை அவன்கண் விடல். (குறள் 517)

ఇదనై ఇదనాల్ ఇవన్ ముడిక్కుం ఎన్ఱాయ్ందు
అదనై అవన్ కణ్ విడల్.

ఒకపనిని ఒకడు ఎలాచేసి ముగిస్తాడు అనేది పరీక్షించి తెలుసుకొని దాని తరువాత ఆ పనిని ఆ వ్యక్తికి అప్పగించాలి. (కుఱళ్ 517)

53. சுற்றந்தழால்

సుట్రందళాల్ - బంధుప్రీతి

காக்கை கரவா கரைந்துண்ணும் ஆக்கமும்
அன்னநீ ரார்க்கே உள. (குறள் 527)

కాక్కె కరవా కరైందుణ్ణుం; ఆక్కముం
అన్న నీరార్కే ఉళ.

కాకి తనకు లభించిన దానిని దాచిపెట్టుకోక తన వారిని పిలిచి కలసి తింటుంది. అటువంటి స్వభావం గలవారికి మాత్రమే ఈ లోకంలో సంపద, ఔన్నత్యాలు ఉంటాయి. (కుఱళ్ 527)

54. பொச்சாவாமை

పొచ్చావామై - విస్మృతి

முன்னுறக் காவாது இழுக்கியான் தன்பிழை
பின்னூறு இரங்கி விடும். (குறள் 535)

మున్నుఱ క్కావాదు ఇఱుక్కియాన్ తన్ పిళై
పిన్నూఱు ఇరంగి విడుం.

ముందుగానే ఆలోచించి తన్ను తాను రక్షించు కోవడం మరచినవాడు కష్టాలు వచ్చినపుడు తన తప్పును తలచుకొని బాధపడుతాడు. (కుఱళ్ 535)

55. செங்கோன்மை

సెంగోన్మై - మంచి ప్రభుత్వం

வான்நோக்கி வாழும் உலகெல்லாம் மன்னவன்
கோல்நோக்கி வாழும் குடி. (குறள் 542)

వాన్ నోక్కి వాళుమ్ ఉలగెల్లాం; మన్నవన్
కోల్ నోక్కి వాళుమ్ కుడి.

లోకంలో ప్రాణులన్నీ వానను ఎదురుచూస్తూ జీవిస్తున్నాయి. అదేవిధంగా ప్రజలందరూ రాజదండాన్ని అనగా న్యాయ సమ్మతమైన ప్రభుత్వాన్ని ఎదురుచూస్తూ జీవిస్తున్నారు. (కుఱళ్ 542)

56. கொடுங்கோன்மை

కొడుంగోణ్మై - దుష్ట ప్రభుత్వం

அல்லற்பட்டு ஆற்றாது அழுதகண் ணீரன்றே
செல்வத்தைத் தேய்க்கும் படை. (குறள் 555)

అల్లఱ్ఱుట్టు ఆట్రాదు అళుద కణ్ణీరన్ఱే
సెల్వత్తై త్తేయ్క్కుం పడై.

దుర్మార్గాలను సహించలేక ప్రజలు చిందించే కన్నీరు ప్రభుత్వాన్ని కూలదూసే సైనికదళం అవుతుంది. (కుఱళ్ 555)

57. வெருவந்த செய்யாமை

వెరువంద సెయ్యామై - క్రూరంగా ప్రవర్తించడం

தக்காங்கு நாடித் தலைச்செல்லா வண்ணத்தால்
ஒத்தாங்கு ஒறுப்பது வேந்து. (குறள் 561)

తక్కాంగు నాడి త్తలై చ్చెల్లా వణ్ణత్తాల్
ఒత్తాంగు ఒఱుప్పదు వేన్దు.

జరిగిన నేరాలను పక్షపాతం లేకుండా పరిశోధించి, మళ్లీ అవి జరగనీయకుండా వాటికి తగిన దండన. (కుఱళ్ 561)

58. கண்ணோட்டம்

கண்ணோட்டம் - కరుణ

பெயக்கண்டும் நஞ்சுண்டு அமைவர் நயத்தக்க
நாகரிகம் வேண்டு பவர். (குறள் 580)

పెయక్కణ్డుం నంజుండు అమైవర్ నయత్తక్క
నాగరికం వేండు బవర్.

సంస్కార భావాలతో కూడిన దయాహృదయులు తమకు చనువు ఉన్నవారు విషమిచ్చినప్పటికీ సంతోషంతో తాగుతారు. (కుఱళ్ 580)

59. ஒற்றாடல்

ఒట్రాడల్ - గూఢచారులు

ஒற்றும் உரைசான்ற நூலும் இவையிரண்டும்
தெற்றென்க மன்னவன் கண். (కుఱళ్ 581)

ఒట్రుం ఉరై శాన్ఱ నూలుం ఇవై యిరణ్డుం
తెట్రెన్ఱ మన్నవన్ కణ్.

సమర్థుడైన గూఢచారి, నీతిగ్రంధం ఇవి రెండూ రాజుకు రెండు కళ్లుగా భావింపబడుతోంది. (కుఱళ్ 518)

60. ஊக்கமுடைமை

ఊక్కముడైమై - ఆసక్తి

வெள்ளத் தனைய மலர்நீட்டம் மாந்தர்தம்
உள்ளத் தனையது உயர்வு. (குறள் 595)

వెళ్లత్తనైయ మలర్ నీట్టం మాన్దర్ తం
ఉళ్లత్తనైయదు ఉయర్వు.

నీటిలో పూసిన తామర తూడు పొడవు ఎంతో నీటిలోతు అంత. అదే విధంగా వ్యక్తి జీవితంలోని ఔన్నత్యం ఎంతో అతని మనసులోని ఆసక్తి అంత. (కుఱళ్ 595)

61. மடியின்மை

మడియిన్మై - సోమరితనం

நெடுநீர் மறவி மடிதுயில் நான்கும்
கெடுநீரார் காமக் கலன். (குறள் 605)

నెడునీర్ మఱవి మడి తుయిల్ నాన్గుం
కెడు నీరార్ కామక్కలన్.

కాలయాపన చేయడం, మరపు, సోమరితనం, మితిమీరిన నిద్ర ఈ నాలుగు చెడిపోయేవాడు అభిలషించి ఎక్కే పడవలు. (కుఱళ్ 605)

62. ఆళ్వినైయుడైమై

ఆళ్వినైయుడైమై - పురుష ప్రయత్నం

அருமை உடைத்தென்று அசாவாமை வேண்டும்
பெருமை முயற்சி தரும். (குறள் 611)

అరుమై ఉడైత్తెన్ఱు అసావామై వేణ్డుం
పెరుమై ముయఱ్చి తరుం.

మన వలన ఇది చేయడానికి వీలవుతుందా అని సంశయించక వీలవుతుంది అనే నమ్మకంతో ప్రయత్నిస్తే అదే గొప్పశక్తిగా మారుతుంది. (కుఱళ్ 611)

63. இடுக்கண் அழியாமை

ఇడుక్కణ్ అళియామై - ఆపదలలో ధైర్యం

இடுக்கண் வருங்கால் நகுக அதனை
அடுத்தூர்வது அஃதொப்பது இல். (குறள் 621)

ఇడుక్కణ్ వరుంగాల్ నగుగ; అదనై
అడుత్తూర్వదు అద్దొప్పదు ఇల్.

కష్టాలు ముంచెత్తినపుడు కలత చెందక సంతోషంతో నవ్వాలి. కష్టాలను జయించడానికి నవ్వునకు మించినది వేరేదీలేదు. (కుఱళ్ 621)

64. அமைச்சு

అమైచ్చు - మంత్రి

கருவியும் காலமும் செய்கையும் செய்யும்
அருவினையும் மாண்டது அமைச்சு. (குறள் 631)

కరువియుం కాలముం సెయ్గైయుం సెయ్యుం
అరువినైయుం మాణ్డదు అమైచ్చు.

తగిన సాధనం, సరియైన కాలం, పనిచేసే విధం, తలపెట్టిన పని - వీటిని క్షుణ్ణంగా పరిశీలించి కార్యాచరణకు పూనుకొనేవాడే మంత్రి. (కుఱళ్ 631)

65. சொல்வன்மை

సొల్వన్మై - వాగ్విలాసం

சொல்லுக சொல்லைப் பிறிதோர்சொல் அச்சொல்லை
வெல்லும்சொல் இன்மை அறிந்து.

సొల్లుగ సొల్లై ప్పిఱిదోర్ సొల్ అచ్చొల్లై
వెల్లుం చొల్ ఇన్మై అఱిన్దు.

ఈ మాటను వేరొక మాట జయించదు అని తెలుసుకొన్న తరువాతనే ఆ మాటను ప్రయోగించాలి. (*కుఱళ్ 645)*

66. வினைத்தூய்மை

వినైత్తూయ్‌మై - మంచి పనులు

ஈன்றாள் பசிகாண்பான் ஆயினும் செய்யற்க
சான்றோர் பழிக்கும் வினை. (குறள் 656)

ఈన్ఱాళ్ పసికాణ్బాన్ ఆయినుం సెయ్యఱ్క
శాన్ఱోర్ పళిక్కుం వినై.

ఆకలితో తపించిపోతున్న తల్లి వేదనను పోగొట్టడానికి సైతం నీచమైన పనుల్లో దిగకూడదు. (కుఱళ్ 656)

67. வினைத்திட்பம்

వినైత్తిట్పమ్ - కార్య స్థైర్యం

எண்ணிய எண்ணியாங்கு எய்துப எண்ணியார்
திண்ணியர் ஆகப் பெறின். (குறள் 666)

ఎణ్ణియ ఎణ్ణియాంగు ఎయ్‌దుప ఎణ్ణియార్
తిణ్ణియర్ ఆగ పెఱిన్.

అనుకొన్నది చేసి ముగించాలనే మనో ధైర్యం కలిగినవాళ్లు అనుకొన్నది చేసి విజయాన్ని సాధిస్తారు. (కుఱళ్ 666)

68. வினைசெயல்வகை

వినైసెయల్ వగై - కార్యాచరణ విధానం

தூங்குக தூங்கிச் செயற்பால தூங்கற்க
தூங்காது செய்யும் வினை. (குறள் 672)

తూంగుగ తూంగి చ్చెయఱ్ పాల; తూంగఱ్క
తూంగాదు సెయ్యుం వినై.

నిదానంగా చేయవలసిన పనులను నిదానంగానే చేయవచ్చు. అయితే త్వరగా చేయవలసిన పనులను మాత్రం ఆలస్యంగా చేయకూడదు. (కుఱళ్ 672)

69. தூது

తూదు - దూత

இறுதி பயப்பினும் எஞ்சாது இறைவற்கு
உறுதி பயப்பதாம் தூது. (குறள் 690)

ఇఱుది పయప్పినుం ఎంజాదు ఇఱైవఱ్కు
ఉఱుది పయప్పదాం తూదు.

తనకు మరణమే సంభవించే పరిస్థితి ఎదురైనప్పటికీ దాని గురించి భయపడక ధైర్యంగా తన బాధ్యతలను నిర్వహించేవాడే తన రాజు నమ్మికకు పాత్రుడైన దూత. (కుఱళ్ 690)

70. மன்னரைச் சேர்ந்தொழுகல்

మన్నరై సేర్న్దొళుగల్ - రాజసేవ

அகலாது அணுகாது தீக்காய்வார் போல்க
இகல்வேந்தர்ச் சேர்ந்தொழுகு வார். (குறள் 691)

అగలాదు అణుగాదు తీక్కాయ్‌వార్ పోల్క
ఇగల్ వేన్దర్ చ్చేర్న్దొళుగు వార్.

రాజుగారి దగ్గర సంచరించేవారు నిప్పుముందు చలికాచు కున్నట్లు మరీ దగ్గరికి వెళ్లక, మరీ వెనక్కి వెళ్లక జాగ్రత్తగా ప్రవర్తించాలి. (కుఱళ్ 691)

71. குறிப்பறிதல்

కుఱిప్పఱిదల్ - భావ గ్రహణం

அடுத்தது காட்டும் பளிங்குபோல் நெஞ்சம்
கடுத்தது காட்டும் முகம். (குறள் 706)

అడుత్తదు కాట్టుం పళింగుపోల్ నెంజం
కడుత్తదు కాట్టుం ముగం.

అద్దం తనకు ఎదురుగా ఉన్నది చూపించినట్లు ఒకరి మనసులో ఉన్నది వారి ముఖం బహిర్గతం చేస్తుంది. (కుఱళ్ 706)

72. அவையறிதல்

అవైయఱిదల్ - సభా మర్యాద

அவையறிந்து ஆராய்ந்து சொல்லுக சொல்லின்
தொகையறிந்த தூய்மை யவர். (குறள் 711)

అవైయఱిన్దు ఆరాయ్న్దు సొల్లుగ సొల్లిన్
తొగైయఱిన్ద తూయ్‌మై యవర్.

మాటల అంతరార్థాన్ని గ్రహించిన జ్ఞానులు సభా సదుల స్వభావాన్ని తెలుసుకొని దానికి తగినట్లు మాట్లాడుతారు. (కుఱళ్ 711)

73. அவையஞ்சாமை

అవైయంజామై - సభా కంపం

கற்றாருள் கற்றார் எனப்படுவர் கற்றார்முன்
கற்ற செலச்சொல்லு வார். (குறள் 722)

కట్రారుళ్ కట్రార్ ఎనప్పడువర్ కట్రార్ మున్
కట్ర సెలచ్చొల్లు వార్.

విద్యావంతుల సమక్షంలో తామునేర్చిన విషయాలను వాళ్ల హృదయాలకు హత్తుకునేలా చెప్పగల వ్యక్తి పండితులలో మేటిగా ప్రస్తుతింపబడతాడు. (కుఱళ్ 722)

74. நாடு

నాడు - దేశం

பிணியின்மை செல்வம் விளைவின்பம் ஏமம்
அணியென்ப நாட்டிற்கிவ் வைந்து. (குறள் 738)

పిణియిన్మె సెల్వం, విళైవిన్బం ఏమం
అణియెన్బ నాట్టిఱ్ కివ్వైన్దు.

వ్యాధిలేని జీవనం, అధిక దిగుబడి ఇచ్చే పంటలు, వస్తు సమృద్ధి, సుఖ శాంతులు, రక్షణ - ఈ ఐదు అంశాలు ఒక దేశానికి అలంకారాలు. (కుఱళ్ 738)

75. அரண்

అరణ్ - దుర్గం

மணிநீரும் மண்ணும் மலையும் அணிநிழல்
காடும் உடையது அரண். (குறள் 742)

మణినీరుం మణ్ణుం మలైయుం అణినిళల్
కాడుం ఉడైయదు అరణ్.

లోతైన విశాలమైన అగడ్త, విస్తారమైన భూమి, ఎత్తైన కొండల వరుస, దట్టమైన అడవి. ఇవి ఉంటేనే కోట. (కుఱళ్ 742)

76. பொருள்செயல்வகை

పొరుళ్ సెయల్వగై - ధన సంపాదన

. *செய்க பொருளைச் செறுநர் செருக்கறுக்கும்*
எஃகுஅதனிற் கூரியது இல். (குறள் 759)

సెయ్గ పొరుళై; చ్చెఱునర్ సెరుక్కఱుక్కుం
ఎగ్గు అదనిఱ్ కూరియదు ఇల్.

ప్రయత్నించి ఒకరు ధనాన్ని ఆర్జించాలి. శత్రువుల గర్వాన్ని అణచడానికి తగిన సాధనం ధనం తప్ప వేరేదీ లేదు. (కుఱళ్ 759)

77. படைமாட்சி

పడైమాట్చి - సైన్యం

மறம்மானம் மாண்ட வழிச்செலவு தேற்றம்
எனநான்கே ஏமம் படைக்கு. (குறள் 766)

మఱమ్మానం మాన్ద వళిచ్చెలవు తేట్రం
ఎన నాన్గే ఏమం పడైక్కు.

శౌర్యం, మానం, పెద్దలు చూపిన మార్గం, నాయకుని నమ్మిక పొందడం - ఈ నాలుగు సైన్యాన్ని కాపాడే గుణాలు. (కుఱళ్ 766)

78. படைச்செருக்கு

పడైసెరుక్కు - పరాక్రమం

பேராண்மை என்ப தறுகண்ஒன்று உற்றக்கால்
ஊராண்மை மற்றதன் எஃகு.(குறள் 773)

పేరాణ్మై ఎన్బదు దఱుకణ్ ఒన్రు ఉట్రక్కాల్
ఊరాణ్మై మట్రదన్ ఎగ్గు.

శత్రువులకు భయపడని శౌర్యమే మగతనమని ప్రశంసింపబడుతుంది. ఆ శత్రువులకు ఒక కష్టం వచ్చినపుడు వాళ్లకు సహాయం చేయడం మగటిమిలో మగటిమి. (కుఱళ్ 773)

79. நட்பு

నట్పు - స్నేహం

உடுக்கை இழந்தவன் கைபோல ஆங்கே
இடுக்கண் களைவதாம் நட்பு. (குறள் 788)

ఉడుక్కై ఇళన్దవన్ కైపోల ఆంగే
ఇడుక్కణ్ కళైవదాం నట్పు.

ధరించిన వస్త్రాభరణాలు జారిపోతున్నపుడు చేతులు పట్టుకోవడానికి ఎలా లేస్తాయో అలా స్నేహితుని కష్టాలను తొలగించడానికి ఆతురతతో ముందుకు రావడమే స్నేహానికి లక్షణం. (కుఱళ్ 788)

80. நட்பாராய்தல்

నట్పారాయ్దల్ - స్నేహ పరిశీలన

கேட்டினும் உண்டுஓர் உறுதி கிளைஞரை
நீட்டி அளப்பதோர் கோல். (குறள் 796)

కేట్టినుం ఉండుఓర్ ఉఱుది కిళైంజరై
నీట్టి అళప్పదోర్ కోల్.

కష్టాలు వచ్చినట్లయితే దానిలో కూడ ఒక మంచి ఉంది. ఆ కష్టాలే స్నేహితులు ఎలాంటి వారనేది కొలిచేసాధనం అవుతుంది. (కుఱళ్ 796)

81. பழைமை

పళైమై - చనువు

பழைமை எனப்படுவது யாதெனின் யாதும்
கிழமையைக் கீழ்ந்திடா நட்பு. (குறள் 801)

పళైమై ఎనప్పడువదు యాదెనిన్ యాదుం
కిళమైయై కీళ్న్దిడా నట్పు.

చనువుతో స్నేహితులు చేసే పనులను చులకన చేయకుండా గౌరవించడమే నిజమైన స్నేహం. (కుఱళ్ 801)

82. தீநட்பு

తీ నట్పు - చెడు స్నేహం

கனவினும் இன்னாது மன்னோ வினைவேறு
சொல்வேறு பட்டார் தொடர்பு. (குறள் 819)

కనవినుం ఇన్నాదు మన్నో వినై వేఱు
సొల్ వేఱు పట్టార్ తొడర్బు.

మాటకు, చేతకు సంబంధం లేని వ్యక్తి స్నేహం కలలో కూడ దుఃఖాన్ని కలిగిస్తుంది. (కుఱళ్ 819)

83. கூடாநட்பு

కూడా నట్పు - కపట స్నేహం

தொழுதகை யுள்ளும் படையொடுங்கும் ஒன்னார்
அழுதகண் ணீரும் அனைத்து. (குறள் 828)

తొళుదగై యుళ్లుం పడైయొడుంగుం ఒన్నార్
అళుద కణ్ణీరుం అనైత్తు.

శత్రువులు నమస్కరించేటప్పుడు కూడ వాళ్ల చేతుల్లో హత్యాయుధం మరుగున ఉంటుంది. అలాగే వాళ్లు కన్నీరు చిందుతూ ఏడుస్తున్నపుడు కూడా కుట్రచర్యలు వాళ్ల హృదయంలో నిండి ఉంటుంది. (కుఱళ్ 828)

84. பேதைமை

పేదైమై - అవివేకం

பேதைமை என்பதுஒன்று யாதெனின் ஏதம்கொண்டு
ஊதியம் போக விடல். (குறள் 831)

పేదైమై ఎన్బదు ఒన్ఱు యాదెనిన్ ఏదంకొండు
ఊదియం పోగ విడల్.

హాని కలిగించేది ఏది? మంచిని కలిగించేది ఏది? అని తెలుసుకోలేక మంచిని వదలి హానిని స్వీకరించడమే అవివేకం. (కుఱళ్ 831)

85. புல்லறிவாண்மை

పుల్లఱివాణ్మై - అల్పజ్ఞానం

உலகத்தார் உண்டென்பது இல்லென்பான் வையத்து
அலகையா வைக்கப் படும். (குறள் 850)

ఉలగత్తార్ ఉండెన్బదు ఇల్లెన్బాన్ వైయత్తు
అలగైయా వైక్క ప్పడుం.

ఆధారాలు చూపించి ఇదే వాస్తవమని స్పష్టంగా చెప్పినప్పటికీ, మొండిగా `కాదు' అని వ్యతిరేకించేవారిని దయ్యాల పట్టికలో చేర్చాలి. (కుఱళ్ 850)

86. இகல்

ఇగల్ - పగ

இகலென்ப எல்லா உயிர்க்கும் பகலென்னும்
பண்பின்மை பாரிக்கும் நோய். (குறள் 851)

ఇగలెన్న ఎల్లా ఉయిర్కుం పగలెన్నుం
పణ్బిన్మై పారిక్కుం నోయ్.

ఒక ప్రాణిని మరొకప్రాణితో చేరనీయకుండ చేసి ద్వేషభావాన్ని కలిగించే చెడు గుణాన్నే `పగ' అంటారు. (కుఱళ్ 851)

87. பகைமாட்சி

పగైమాట్చి - విరోధుల స్వభావం

வலியார்க்கு மாறுஏற்றல் ஓம்புக ஓம்பா
மெலியார்மேல் மேக பகை. (குறள் 861)

వలియార్కు మాఱు ఏట్రల్ ఓంబుగ; ఓంబా
మెలియార్ మేల్ మేగ పగై.

తమ కంటె బలవంతులైన వారిని ఎదిరించడం మానుకోవాలి. తమకంటె బలహీనులైన వారిపై ద్వేషభావాన్ని వదలుకోక ఎదిరించాలి. (కుఱళ్ 861)

88. பகைத்திறம் தெரிதல்

పగైత్తిఱమ్ తెరిదల్ - శత్రుసామర్థ్యం

பகையென்னும் பண்பி லதனை ஒருவன்
நகையேயும் வேண்டற்பாற்று அன்று. (குறள் 871)

పగైయెన్నుం పణ్బి లాదనై ఒరువన్
నగైయేయుం వేణ్డఱ్పాట్రు అన్ఱు.

పగ అనే భావం సంప్రదాయానికి వ్యతిరేకమైంది కాబట్టి పరిహాసానికైనా దానిని తీసుకోకూడదు. (కుఱళ్ 871)

89. உட்பகை

ఉట్పగై - ఆంతరంగిక వైరం

உடம்பாடு இலாதவர் வாழ்க்கை குடங்கருள்
பாம்போடு உடனுறைந் தற்று. (குறள் 890)

ఉడం బాడు ఇలాదవర్ వాళ్క్కై కుడంగరుళ్
పాంబోడు ఉడన్ ఉఱైన్ద్రట్రు.

మనసులో స్నేహభావం లేనివాళ్లు కలసి జీవించడం అనేది ఒక చిన్న గుడిసెలో పాముతో కలసి ఉన్నట్లు ప్రతిక్షణం భయాన్ని కలిగిస్తుంది. (కుఱళ్ 890)

90. பெரியாரைப் பிழையாமை

పెరియారై పిళైయామై - పెద్దలను నిందించమి

பெரியாரைப் பேணாது ஒழுகின் பெரியாரால்
பேரா இடும்பை தரும். (குறள் 892)

పెరియారై ప్పేణాదు ఒళుగిన్ పెరియారాల్
పేరా ఇడుంబై తరుం.

పెద్దలను గౌరవించక ప్రవర్తించినట్లయితే అది తీరని దుఃఖాన్ని కలిగిస్తుంది. (కుఱళ్ 892)

91. பெண்வழிச் சேறல்

పెణ్‌వళి చ్చేఱల్ - భార్యా విధేయత

மனைவிழைவார் மாண்பயன் எய்தார் வினைவிழைவார்
வேண்டாப் பொருளும் அது. (குறள் 901)

మనైవిళైవా మాణ్‌పయన్ ఎయ్‌దార్; వినై విళైవార్
వేణ్డా ప్పొరుళుం అదు.

కామసుఖాన్ని కోరుతూ భార్యచెప్పినట్లు ప్రవర్తించేవాడు సత్ఫలితాన్ని పొందలేడు. బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని అభిలషించేవాళ్లకు అప్రియమైన విషయమిది. (కుఱళ్ 901)

92. வரைவின் மகளிர்

వరైవిన్ మగళిర్ - వేశ్యలు

அன்பின் விழையார் பொருள்விழையும் ஆய்தொடியார்
இன்சொல் இழுக்குத் தரும். (குறள் 911)

అన్బిన్ విళైయార్ పొరుళ్ విళైయుం ఆయ్‌దొడియార్
ఇన్‌సొల్ ఇళుక్కు త్తరుం.

ప్రేమ ఏమాత్రమూ లేక ధన సంపాదనే లక్ష్యంగా కలిగిన వారవనితల తీయని మాటలు నమ్మి మోసపోయిన వాళ్లకు ఆఖరున దుఃఖం సంప్రాప్తిస్తుంది. (కుఱళ్ 911)

93. கள்ளுண்ணாமை

కళ్లుణ్ణామై - మద్యపానం

கள்ளுண்ணாப் போழ்தில் களித்தானைக் காணுங்கால்
உள்ளான்கொல் உண்டதன் சோர்வு. (குறள் 930)

కళ్లుణ్ణా ప్పోళ్‌దిల్ కళిత్తానై క్కాణుంగాల్
ఉళ్లాన్ కొల్ ఉణ్డదన్ సోర్వు.

ఒక తాగుబోతు తాను తాగకుండా ఉన్నపుడు మరొక తాగుబోతు మత్తులో జోగుతుండడం చూసిన తరువాతైనా ఆ చెడ్డ అలవాటును గురించి ఆలోచించవద్దా? (కుఱళ్ 930)

94. சூது

సూదు - జూదం

வேண்டற்க வென்றிடினும் சூதினை வென்றதூஉம்
தூண்டில்பொன் மீன்விழுங்கி யற்று. (குறள் 931)

వేండఱ్క వెన్ఱిడినుం సూదినై; వెన్ఱదూఉం
తూండిల్ పొన్ మీన్ విళుంగి యట్రు.

గెలుపు లభిస్తున్నప్పటికీ జూదమాడే చోటుకు వెళ్లకూడదు. ఆ గెలుపు ఎరని మింగడానికి ప్రయత్నించి చేప గాలం ముల్లుకు గుచ్చుకున్నట్లు. (కుఱళ్ 931)

95. மருந்து

మరుందు - మందు

மாறுபாடு இல்லாத உண்டி மறுத்துண்ணின்
ஊறுபாடு இல்லை உயிர்க்கு. (కుఱళ్ 945)

మాఱుపాడు ఇల్లాద ఉణ్డి మఱుత్తుణ్ణిన్
ఊఱుపాడు ఇల్లై ఉయిర్క్కు.

శరీరానికి సరిపడే ఆహారమైనాసరే, అధికమైనపుడు వద్దని చెప్పి మితంగా తిన్నట్లయితే జీవించడంలో ఎలాంటి ఇబ్బందీ రాదు. (కుఱళ్ 945)

96. குடிமை

కుడిమై - ఉన్నతవంశం

இல்பிறந்தார் கண்ணல்லது இல்லை இயல்பாகச்
செப்பமும் நாணும் ஒருங்கு.(குறள் 951)

ఇల్ పిఱన్దార్ కణ్ణల్లదు ఇల్లై ఇయల్బాగ
చ్చెప్పముం నాణుం ఒరుంగు.

సమదృష్టి, వినయస్వభావం ఉన్నత వంశంలో జన్మించినవారికి సహజంగానే వస్తాయి. (కుఱళ్ 951)

97. மானம்

మానం - మానం

மயிர்நீப்பின் வாழாக் கவரிமா அன்னார்
உயிர்நீப்பர் மானம் வரின். (குறள் 969)

మయిర్ నీప్పిన్ వాళా క్కవరిమా అన్నార్
ఉయిర్ నీప్పర్ మానం వరిన్.

శరీరంలోని రోమాలను తీసివేస్తే చమరీ మృగం బతకడం కష్టం. అదే విధంగా మానాభిమానాలు కోల్పోయే పరిస్థితి వచ్చినప్పుడు మానధనులు ప్రాణాలనే వదిలేస్తారు. (కుఱళ్ 969)

98. பெருமை

పెరుమై - గొప్పతనం

பிறப்பொக்கும் எல்லா உயிர்க்கும் சிறப்பொவ்வா
செய்தொழில் வேற்றுமை யான். (குறள் 972)

పిఱప్పొక్కుం ఎల్లా ఉయిర్కుం; సిఱప్పొవ్వా
సెయ్ తొళిల్ వేట్రుమై యాన్.

పుట్టుకతో ప్రాణులన్నీ సమానమే. అయినప్పటికీ చేసేపనులనుబట్టి, తారతమ్యాలనుబట్టి కీర్త్యపకీర్తులు కలుగుతాయి. (కుఱళ్ 972)

99. சான்றாண்மை

సాన్రాణ్మై - గుణ గణాలు

ஆற்றுவார் ஆற்றல் பணிதல் அதுசான்றோர்
மாற்றாரை மாற்றும் படை. (குறள் 985)

ఆట్రువార్ ఆట్రల్ పణిదల్; అదు శాన్రోర్
మాట్రారై మాట్రుం పడై.

అహంకారం లేకుండా వినయంతో నడుచుకోవడమే గుణవంతులకు గుణం. అదే పగను మైత్రిగా మార్చే సాధనంగా కూడ పెద్దలకు ఉపయోగపడుతున్నది. (కుఱళ్ 985)

100. பண்புடைமை

పణ్బుడైమై - సభ్యత

அரம்போலும் கூர்மைய ரேனும் மரம்போல்வர்
மக்கட்பண்பு இல்லா தவர். (குறள் 997)

అరంబోలుం కూర్మైయ రేనుం మరంబోల్వర్
మక్కట్ పణ్బు ఇల్లాదవర్.

ఆకురాయి వలె సూక్ష్మమైన బుద్ధి కుశలత కలిగిన మేధావంతులుగా ఉన్నప్పటికీ, గుణహీనులుగా ఉన్నట్లైతే వాళ్ళను చెట్లతో ఉపమించవచ్చు. (కుఱళ్ 997)

101. நன்றியில் செல்வம்

నన్రియిల్ సెల్వమ్ - వ్యర్థ సంపద

வைத்தான்வாய் சான்ற பெரும்பொருள் அஃதுஉண்ணான்
செத்தான் செயக்கிடந்தது இல். (குறள் 1001)

వైత్తాన్ వాయ్ శాన్ర పెరుం పొరుళ్ అద్దుఉణ్ణాన్
సెత్తాన్ సెయక్కిడన్దదు ఇల్.

తీరని ఆశలతో అంతులేని సంపదను కూడబెట్టి దానిని అనుభవించకుండా మరణించేవారికి కూడబెట్టిన ఆ సంపదలవలన ఏం ప్రయోజనం? (కుఱళ్ 1001)

102. நாணுடைமை

నాణుడైమై - లజ్జ

கருமத்தால் நாணுதல் நாணுத் திருநுதல்
நல்லவர் நாணுப் பிற. (குறள் 1011)

కరుమత్తాల్ నాణుదల్ నాణు త్తిరునుదల్
నల్లవర్ నాణుప్పిఱ.

చేయకూడని పని కారణంగా లజ్జ చెందడాన్నే లజ్జ అంటారు. సౌశీల్యంగల స్త్రీ సహజంగా పొందే లజ్జ తద్భిన్నమైనది. (కుఱళ్ 1011)

103. குடிசெயல்வகை

కుడిసెయల్ వగై - వంశగౌరవం

கருமம் செயஒருவன் கைதூவேன் என்னும்
பெருமையில் பீடுடையது இல். (குறள் 1021)

కరుమం సెయఒరువన్ కైతూ వేన్ ఎన్నుం
పెరుమైయిల్ పీడుడైయదు ఇల్.

విద్యుక్త ధర్మాన్ని నిర్వహించడంలో ఎవరు అలసత్యం వహించక ప్రయత్నాలు సాగిస్తారో ఆ గౌరవానికి మించిన గౌరవం వేరేదీ లేదు. (కుఱళ్ 1021)

104. உழவு

ఉళవు - వ్యవసాయం

சுழன்றும்ஏர்ப் பின்னது உலகம் அதனால்
உழந்தும் உழவே தலை. (குறள் 1031)

సుళన్టుం ఏర్ ప్పిన్నదు ఉలగం; అదనాల్
ఉళన్దుం ఉళ వే తలై.

ఎన్నో వృత్తులు ఉన్నప్పటికీ ఈ లోకం వ్యవసాయంపైనే ఆధారపడి ఉంది. కాబట్టి ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ వ్యవసాయ వృత్తియే ఉన్నతమైంది. (కుఱళ్ 1031)

105. நல்குரவு

నల్కురవు - దారిద్ర్యం

இன்மையின் இன்னாதது யாதெனின் இன்மையின்
இன்மையே இன்னா தது. (குறள் 1041)

ఇన్మైయిన్ ఇన్నాదదు యాదెనిన్ ఇన్మైయిన్
ఇన్మైయే ఇన్నాదదు.

దారిద్ర్యబాధవంటి దుఃఖకరమైంది వేరొకటిలేదు. దారిద్ర్యబాధకు ఉపమానంగా చూపించడానికి దారిద్ర్యబాధతప్ప వేరేదీలేదు. (కుఱళ్ 1041)

106. இரவு

ఇరవు - యాచన

இரக்க இரத்தக்கார்க் காணின் கரப்பின்
அவர்பழி தம்பழி அன்று. (குறள் 1051)

ఇరక్క ఇరత్తక్కార్ క్కాణిన్; కరప్పిన్
అవర్ పళి తం పళి అన్ఱు.

ఉన్నవారి దగ్గర ఒక వస్తువును అడిగి, దానిని అతడు ఇవ్వలేకపోతే ఇవ్వనని చెప్పినవాడికే నిందగాని అడిగిన వారికి కాదు. (కుఱళ్ 1051)

107. இரவச்சம்

ఇరవచ్చం - యాచనా భయం

இரந்தும் உயிர்வாழ்தல் வேண்டின் பரந்து
கெடுக உலகியற்றி யான். (குறள் 1062)

ఇరన్దుం ఉయిర్ వాళ్ దల్ వేణ్డిన్ పరన్దు
కెడుగ ఉలగియట్రి యాన్!

భిక్షాటన చేసి కొందరు జీవనం సాగించాలనే నియమం ఏర్పరచి ఉంటే ఈలోకాన్ని సృష్టించినవాడు యాచకునివలె అంతటా అల్లాడుతూ తిరిగి నశించిపోవాలి. (కుఱళ్ 1062)

108. கயமை

కయమై - నీచత్వం

மக்களே போல்வர் கயவர் அவரன்ன
ஒப்பாரி யாம்கண்டது இல். (குறள் 1071)

మక్కళే పోల్వర్ కయవర్; అవరన్న
ఒప్పారి యాంగణ్డదు ఇల్.

నీచగుణం కలిగిన వాడు మంచివాడిలాగ తనను తాను చూపించు కుంటాడు. మనుషుల్లో మాత్రమే ఇలా రెండు. (కుఱళ్ 1071)

*****